RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి ®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:134 హైదరాబాద్, శుక్రవారం, 22 నవంబర్ 2024 పేజీలు: 12 వెల: 1.00

## భారత్ కు ఆర్థిక నేరగాళ్లు

# బ్రిటన్ తో మోడీ చర్చలు

న్యూఢిల్లీ, నవంబర్21, (న్యూస్ పల్స్)

ప్రస్తుతం నరేంద్ర మోడీ జీ -20 సదస్సులో ఉన్నారు.. బ్రెజిల్ లో జరుగుతున్న ఈ సదస్సులో ప్రధాని ప్రపంచాధినేతలను కలిశారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్మార్టర్ తో భేటీ అయ్యారు..బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్మార్టర్ తో భేటీ లో వ్యాపార అంశాలను తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్థిక నేరగాళ్లపై అప్పగింతపై మాట్లాడారు. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ ని అప్పగించాలని కోరారు. దానికి సంబంధించిన చర్యలు తీసుకోవాలని స్మార్టర్ దృష్టికి తీసుకువచ్చారు.. అయితే వారిని చాలా కాలంగా స్వదేశానికి తీసుకురావడానికి భారత్ అనేక ప్రయత్నాలు చేస్తోంది. న్యాయపరమైన లొసుగల వల్ల వాళ్లు కొంతకాలంగా అక్కడే ఉండిపోతున్నారు. అయితే ఈసారి వాటిపై నరేంద్ర మోడీ మరింతగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. జీ ? 20 సదస్సులో ఇదే విషయాన్ని మోడీ స్పష్టం చేశారు. " ఆర్థిక నేరగాళ్లను స్వదేశానికి రప్పించడానికి భారత్ కృషి చేస్తోంది. దీనిపై అనేక దేశాలతో చర్చలు జరుపుతోంది. పన్నులు ఎగవేయడం.. మనీలాండరింగ్ కు పాల్పడటం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్ బండారి వంటి నేరగాళ్లను సైతం స్వదేశానికి రప్పించడానికి కృషి చేస్తున్నామని" మోడీ పేర్కొన్నారు.. నరేంద్ర మోడీ ప్రస్తావించిన నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకు ను మోసం చేశారు. 13వేల కోట్లకు నిండా ముంచారు. 2018 నుంచి ఆయన లండన్ లో ఉంటున్నారు.. అయితే బ్రిటన్ నీరవ్ మోడీని భారతదేశానికి అప్పగించడంలో అనేక రకాలైన న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ఇక విజయ్ మాల్యా 9000 కోట్ల బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి 2016లో లండన్ పారిపోయాడు. అతనిపై అరెస్టు వారెంట్లు జారీ అయినప్పటికీ ఇంతవరకు అతడిని ప్రభుత్వం భారత్ కు అప్పగించలేదు.. ఇక ఇటీవల బ్రిటన్ కోర్టు నీరవ్ మోడీ అప్పగింత దరఖాస్తును తోసిపుచ్చింది. కోర్టు తిరస్కరించినప్పటికీ.. అతడిని భారత్ అప్పగించడానికి.. భారత చేసిన అభ్యర్థనను వర్గంలోకి తీసుకుంటామని బ్రిటన్ ప్రభుత్వం చెప్పినట్టు వార్తలు వస్తున్నాయి.



అయితే న్యాయ ప్రక్రియలు సంక్లిష్టంగా ఉండడం.. నేరపూరితమైన కేసుల పరిశీలన లో జాప్యం వంటివి ఈ ప్రక్రియను రోజురోజుకు జటిలం చేస్తున్నాయి. ఇక ఇటీవల బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ నీరవ్ మోడీ, విజయ్ మాల్యా కేసులను ప్రస్తావించారు.." మా దేశంలో ఆర్థిక నేరగాళ్లు ఉండకూడదు. ఆర్థిక నేరగాళ్లకు మా దేశం స్థావరం కాదని" పేర్కొన్నారు. అలాంటి నేరగాళ్లను వారి స్వదేశాలకు పంపించడానికి తాము సహకరిస్తామని అప్పట్లోనే జాన్సన్ ప్రకటించారు. ఆ తర్వాత ఇటలీ ప్రధానమంత్రి జార్జియో మెలోనిని కలిశారు. వాణిజ్యం, పెట్టుబడులు, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి వాటి విషయాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ద్వైపాక్షిత వాణిజ్య విషయంలో కీలక చర్చలు జరిపారు. ఇండియా మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్, సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరర్స్, ఇటాలియన్ ఇండస్ట్రీస్ ఫర్ ఫెడరేషన్ ఏరోస్పేస్, డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ వంటి వాటి విషయాలలో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తీవ్రవాదానికి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలని.. భవిష్యత్తు కాలంలో రెండు దేశాలు సంయుక్తంగా పనిచేయాలని నిర్ణయించారు. సముద్రం, భూతల వ్యాపారాలలో సంయుక్తంగా సహకరించుకోవాలని ఒప్పందానికి వచ్చారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక వ్యాపార భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు.

## నదులు కనుమరుగైతే మనిషి మనుగడే

# ప్రశ్నార్థకం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి.. వాటిని కనుమరుగయ్యేలా చేస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజారోగ్యం, పటిష్ఠ ఆర్థిక పర్యావరణ కోణాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ శాపంగా మిగిలిపోకూడదు అని సీఎం సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. మూసీ ప్రక్షాళన చేయాలన్నదే.. ప్రజా ప్రభుత్వ సంకల్పం అని ఆయన పేర్కొన్నారు. ఇది ఈ తరానికే కాదు.. భావితరాలకు మేలు చేసే నిర్ణయమని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి అండగా నిలిచే ప్రతి వ్యక్తికి, వ్యవస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల 'మూసీ పునరుజ్జీవం- ప్రక్షాళన' పేరుతో అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేస్తోంది. ఈనేపథ్యంలో పలువురి నుంచి సీఎం నిర్ణయం సరికాదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.



ఈనేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోషల్‌మీడియాలో తనదైన శైలిలో స్పందించారు.

## వ్యవసాయ రంగం బలోపేతానికి ఆదర్శ రైతుల

# నియామకం: సానుకూలంగా స్పందించిన మంత్రి



హైదరాబాద్: రాష్ట్రంలో రైతాంగం ప్రయోజనాల దృష్ట్యా ఇప్పటికే విత్తన చట్టం, గూడ్స్ అండ్ సర్వీసు టాక్స్ - జీఎస్‌టీ అంశాలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కమిటీ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు మంత్రిని కలిశారు. కీలక వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా గ్రామాల్లో ఆదర్శ రైతుల నియమాకం అంశం పరిశీలించాలని కోదండరెడ్డి మంత్రి తుమ్మల వద్ద ప్రస్తావించారు. అనూహ్య వాతావరణ మార్పులతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూలీల కొరత నేపథ్యంలో వ్యవసాయ పనుల కోసం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానం చేయాలని విజప్తి చేశారు.

అలాగే, యాంత్రీకరణ పథకం త్వరలో పునరుద్ధరించేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుందని, యంత్రాలు, పనిముట్లపై జీఎస్‌టీ ఎత్తివేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాలని సూచించారు. ఆయా అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాలన్నింటిపై కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి ఓ కీలక నిర్ణయం తీసుకుంటామని కోదండరెడ్డి బృందానికి మంత్రి హామీ ఇచ్చారు.

గమనిక: ఈనాడు.నెట్‌లో కనిపించే వ్యాపార ప్రకటనలు వివిధ దేశాల్లోని వ్యాపారస్తులు, సంస్థల నుంచి వస్తాయి. కొన్ని ప్రకటనలు పాఠకుల అభిరుచిననుసరించి కృత్రిమ మేధస్సుతో పంపబడతాయి. పాఠకులు తగిన జాగ్రత్త వహించి, ఉత్పత్తులు లేదా సేవల గురించి సముచిత విచారణ చేసి కొనుగోలు చేయాలి. ఆయా ఉత్పత్తులు / సేవల నాణ్యత లేదా లోపాలకు ఈనాడు యాజమాన్యం బాధ్యత వహించదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావు లేదు.

## రోగులకు 90శాతం చికిత్స మండల

# కేంద్రాల్లోనే జరగాలి: దామోదర రాజనర్సింహ

మంచిర్యాల: రోగులకు 90శాతం చికిత్స మండల కేంద్రాల్లోనే జరగాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వ వైద్యులు రోగిని తమ క్లయింట్‌గా భావించాలని చెప్పారు. మంచిర్యాలలో రూ.360 కోట్లతో చేపట్టనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజనర్సింహ మాట్లాడారు.

ఆస్పత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేరనే విమర్శ రావొద్దని వైద్యాధికారులకు సూచించారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే 7 వేలకుపైగా నర్సు పోస్టులను భర్తీ చేసిందన్న ఆయన.. ప్రతి మండలానికి 2 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని



చెప్పారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ ఉండేలా చర్యలు చేపడతామన్నారు.

# బీఆర్ఎస్ మహాధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్..

హైదరాబాద్, నవంబర్ 21: మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న గిరిజన రైతు మహా ధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గిరిజన రైతు ధర్నాకు అనుమతించింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది హైకోర్టు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్నా చేపట్టేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. వెయ్యి మందితో ధర్నా చేపట్టొచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే బీఆర్ఎస్ మాత్రం



50 వేల మందితో మహా ధర్నా చేపడతామని మొదట ప్రకటించింది. ఇప్పుడు హైకోర్టు తీర్పుతో.. తక్కువ మందితోనే ధర్నా కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉంది.

మహబూబాబాద్‌లో గిరిజన రైతుల మహాధర్నాకు అనుమతి కోరుతూ బీఆర్ఎస్ పార్టీ పోలీసుల అనుమతి కోరింది. కానీ, పోలీసులు ఈ ధర్నాకు అనుమతి నిరాకరించారు. తొలుత పోలీసులు ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో.. బీఆర్ఎస్ ముఖ్యనేతలంతా జిల్లా ఎస్పీ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. మహా ధర్నాకు అనుతి ఇచ్చే వరకు కదిలేది లేదని ప్రకటించారు. చివరకు ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో.. హైకోర్టును ఆశ్రయించారు బీఆర్ఎస్ నేతలు. వాదనలు విన్న ధర్మాసనం.. బీఆర్ఎస్ మహా ధర్నాకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

బీఆర్ఎస్ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్‌పై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఆయన.. ఇదేం పాలన అంటూ సీఎం రేవంత్‌పై ఘాటైన విరమ్శలు చేశారు.

'ఇప్పుడు అక్కడ ఎన్నికలు లేవు-మరి ఈ పోలీసుల లాంగ్ మార్చ్ ఏంటి? అక్కడ గొడవలు ఏం జరగలేదు ?-మరి పోలీసుల హెచ్చరికలు ఎందుకు? అసలు మహబూబాబాద్ జిల్లా మానుకోటలో ఏం జరుగుతుంది ? శాంతియుతంగా సభ నిర్వహించుకుంటామంటే అవకాశం కూడా ఇవ్వని దుస్థితి ఎందుకు వచ్చింది ? ఇది ప్రజాపాలన ఎలా అవుతుంది ? ఇది ముమ్మాటికీ నిర్బంధ పాలన, నిరంకుశ పాలన, కంచెల పాలన, కక్ష్యల పాలన, ఆంక్షల పాలన.. మొత్తంగా రాక్షస పాలన.. ఖబర్దార్ రేవంత్.. ఇది తెలంగాణ. ఎంత అణచివేస్తే అంత తిరుగుబాటు వస్తుంది. జై తెలంగాణ.' అంటూ పోస్ట్ చేశారు కేటీఆర్.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం మార్కెట్‌లో ధర్నా చేపట్టనున్నారు. ఈ ధర్నాలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, హరీష్ రావు, గంగుల కమలాకర్, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నేతలు పాల్గొననున్నారు. గురువారం రాత్రికే ఖమ్మం చేరుకోనున్నారు మాజీ మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్. శుక్రవారం ఉదయం 7 గంటలకు పత్తి కొనుగోలు చేయాలంటూ ధర్నా చేపట్టనున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీకి తప్పిన భారీ ప్రమాదం..



హైదరాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డికి భారీ ప్రమాదం తప్పింది. రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. దీంతో పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మహబూబ్ నగర్ నుంచి హైదరాబాద్‌కు గురువారం మధ్యాహ్నం బయల్దేరారు. అయితే తన కారు బెంగళూరు హైవేపై వస్తుండగా షాద్‌నగర్ మిలినీయం టౌన్ షిప్ వద్ద సడెన్‌గా ఓ ద్విచక్ర వాహనం అడ్డుగా వచ్చింది. దీంతో ఎమ్మెల్సీ కారు డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడంతో.. బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇక గాయపడిన వ్యక్తిని తన కారులోనే ఎమ్మెల్సీ నవీన్ సమీప ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఎమ్మెల్సీ ఆదేశించారు. ఈ ప్రమాదంలో నవీన్ కుమార్ రెడ్డికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు.

# అన్నింటిలో కాంగ్రెస్ సర్కార్ విఫలం.. హరీష్ విసుర్లు

సంగారెడ్డి జిల్లా, నవంబర్ 21: సీఎం రేవంత్ రెడ్డిపై , కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్‌రావు ఘాటు విమర్శలు చేశారు. గురువారం అందోల్ మండలం మాసాన్ పల్లీ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారని.. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగారా అంటూ విమర్శలు గుప్పించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వద్ల కొనుగోలులో పూర్తిగా విఫలమైందని వ్యాఖ్యలు చేశారు.రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ం

భారతశక్తి
VOICE OF INDIAN

## చిన్నారులకు గుండెపోట్లు ఎందుకు,,

గుండెపోటు గతంలో వృద్ధుల వ్యాధిగా పరిగణించేవారు. కానీ ఇప్పుడు 10 ఏళ్ల లోపు పిల్లలు హఠాత్తుగా చనిపోతున్నారు. 20 నుంచి 40 ఏళ్ల యువకులు కూడా గుండె పోటు బారిన పడుతున్నారు. ప్రతి ఐదుగురు రోగులలో ఒకరు 40 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు ఉండటం గమనార్హం. గుండెకు శత్రువులు.. రక్తపోటు, మధుమేహం. కానీ, ఇటీవలి కాలంలో ఈ రెండు సమస్యలూ లేకపోయినా గుండెపోటు బారినపడుతున్నారు చాలామంది. దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, వ్యాయామం లేకపోవడం. గత పదేండ్లలో ఆహారపు అలవాట్లు చాలా మారి పోయాయి. తాజా కూరగాయలు, పండ్లు తీసుకొనే అలవాటు తగ్గిపోయింది. డీప్ ఫ్రై చేసిన పదార్థాలు, బేకరీ ఐటమ్స్, ప్రాసెస్డ్ ఫుడ్ ఆరగించడం ఫ్యాషన్‌గా మారింది. దీనివల్ల బరువు పెరుగుతున్నది. కొలెస్ట్రాల్, షుగర్ స్థాయులూ హద్దుమీరుతున్నాయి. అధిక రక్తపోటు, మధుమేహం, చెడు కొలెస్ట్రాల్‌కు ప్రధాన కారణం.. బరువు పెరగడమే. ఒక వ్యక్తి సాధారణ స్థాయి కంటే ఎక్కువ బరువు ఉన్నాడంటే దాన్ని బీపీ, షుగర్‌లకు ప్రారంభ దశగా భావించాలి. ఊబకాయం హఠాత్తుగా రాదు. బరువు క్రమంగానే పెరుగుతుంది. తొలి దశలోనే నియంత్రించడం ఉత్తమం. శారీరక శ్రమ తగ్గిపోయింది. వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల చాలామంది గంటల తరబడి కదలకుండా పనిచేస్తున్నారు. సమయాభావం సాకుతో హెల్త్ చెకప్‌లకు దూరం అవుతున్నారు. దీంతో యువతలో బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ స్థాయులు పెరిగిపోతున్నాయి. అంతిమంగా గుండెపోటుకు దారితీస్తున్నాయి. కొన్నిసార్లు మితిమీరిన కసరత్తూ ఓ కారణం కావచ్చు. యువతరం గుండెచుట్టూ కాపుకాసిన శత్రువులు ఇవే..గుండె పోటు వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిమ్‌లో గుండెపోటు రావడం, వంటి వార్తలు వస్తున్నాయి.. హైపర్ట్రోఫిక్ కార్డియోమయోపతి అనేది ఒక వైద్య పరిస్థితి. ఇది జన్యుపరమైన వ్యాధి. ఈ స్థితిలో యువత తరచుగా ఆడుతూ, జిమ్ చేస్తూ గుండెపోటుతో మరణిస్తున్నారు. ఇది గుండె కండరాలు గట్టిపడటానికి కారణమయ్యే పరిస్థితి. సాధారణంగా ఇది పేలవమైన జీవనశైలి కారణంగా జరుగుతుంది. గుండె కండరాలు మందంగా ఉండడం వల్ల గుండెకు రక్తాన్ని పంప్ చేయడం కష్టమవుతుంది. గుండె గదుల గోడలు మందంగా, గట్టిపడతాయి. రక్త పరిమాణాన్ని తగ్గిస్తాయి. హైపర్ట్రోఫిక్ కార్డియోమయోపతి పరిస్థితి ఉన్న కొందరిలో లక్షణాలు కనిపించవు. మరికొందరికి వ్యాయామం చేసేటప్పుడు లక్షణాలు కనిపించవచ్చు. కొందరిలో రక్తనాళం అప్పటికే గట్టిగా ఉన్నప్పుడు లక్షణాలు కనిపిస్తాయి. వారికి సాధారణంగా ఛాతీ నొప్పి లేదా శారీరక శ్రమతో అసౌకర్యం ఉంటుంది. గుండె కొట్టుకోవడం అసాధారణంగా మారుతుంది. విపరీతమైన అలసట ఏర్పడుతుంది. వారు స్పృహ కోల్పోయి ఎక్కడయినా పడిపోతారు. కానీ ప్రతిసారీ జన్యు పరంగా మాత్రమే గుండెపోటుకు కారణం కాదు. ఇతర కారణాలు కూడా ఉంటాయి. మధుమేహం ఇప్పుడు ప్రారంభ గుండెపోటుకు ప్రధాన ప్రమాద కారకంగా అభివృద్ధి చెందుతోంది. మీకు డయాబెటిస్ ఉన్నట్లయితే, మీకు గుండె జబ్బులు వచ్చే అవకాశం లేనివారి కంటే 4 రెట్లు ఎక్కువ. అధిక రక్త చక్కెర స్థాయి మీ రక్తనాళాలను దెబ్బతీస్తుందనేది వాస్తవం. క్రమంగా, ధమనులలో కొవ్వు పేరుకుపోయే అవకాశాలు పెరుగుతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి ఇతర వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ రోజుల్లో అధిక రక్తపోటు సమస్య వృద్ధుల కంటే యువతలోనే ఎక్కువగా కనిపిస్తోంది. అధిక రక్తపోటు కారణంగా, గుండె కండరాలు మందంగా మారుతాయి , అది సరిగ్గా పనిచేయదు. ఇది రక్తనాళాన్ని కూడా దెబ్బతీస్తుంది , ప్రక్రియలో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. మీరు ఆరోగ్యంగా ఉండవచ్చు. కానీ మీ బరువు అవసరమైన దానికంటే ఎక్కువగా ఉంటే, మీరు మీ అన్ని అవయవాలపై ఎక్కువ పని చేయడానికి ఎక్కువ ఒత్తిడి తెస్తున్నారు. ఇందులో మీ హృదయం కూడా ఉంటుంది. మీరు వేగంగా లేదా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినడం అలవాటు చేసుకోవడం వల్ల చాలా మంది లావుగా మారతారు. మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, నూనెలో వేయించిన పదార్థాలు తినడం ద్వారా రక్త నాళాలలో తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ లేదా చెడు కొలెస్ట్రాల్ చేరడం వేగవంతం చేస్తుంది. అందుకే ఫైబర్ అధికంగా ఉండే పండ్లు , కూరగాయలు మీ ప్లేట్‌లో ఎక్కువ భాగం ఉండేలా చూసుకోండి యువకులలో గుండెపోటుకు ప్రధాన ప్రమాద కారకం సిగరెట్. ధూమపానం చేయని వారితో పోలిస్తే రోజుకు ఒక ప్యాక్ తాగడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం రెట్టింపు అవుతుంది. సిగరెట్ పొగలోని రసాయనాలు రక్తం చిక్కగా , ధమనుల లోపల గడ్డలను ఏర్పరుస్తాయిజిమ్ , వ్యాయామం కూడా బాధ్యత వహిస్తాయి: చాలా మంది ప్రజలు తమ శరీర ఆకృతిని పొందడానికి జిమ్‌కు వెళ్తున్నారని భావిస్తారు, అయితే చాలా మంది జిమ్ ట్రైనర్‌లకు అర్హత లేదని కొట్టిపారేయలేము. వారికి ఆరోగ్య పరిస్థితి, వ్యాయామం గురించి తెలియదు. ప్రతిరోజూ ఎక్కువ జిమ్ చేయమని వారు మీకు సలహా ఇస్తున్నారు, ఇది మీకు సరికాదు. ఇదే కాకుండా, చక్కెర, సంతృప్త కొవ్వు , మీ గుండెకు హాని కలిగించే అనేక ఇతర టాక్సిన్స్ కలిగి ఉన్న అనేక ప్రోటీన్లను తీసుకోవాలని మీకు సలహా ఇస్తారు. ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ పరీక్షను పూర్తి చేయండి కుటుంబ చరిత్రను ఎప్పుడూ విస్మరించవద్దు.. జిమ్ మెంబర్‌షిప్‌ని మీ మెడికల్ టెస్ట్‌కి జత చేయాలి. అర్హత కలిగిన జిమ్ ట్రైనర్‌ని మాత్రమే ఎంచుకోండి.

# కూటమికి కలిసొచ్చిన సమావేశాలు

## నిలదీసే అవకాశాన్ని వదులుకున్న ప్రతిపక్షం

అమరావతి, నవంబర్ 21, (న

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసాయి. సభకు వెళ్లినా ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించకపోతే తమకు మాట్లాడే అవకాశం రాదు కాబట్టి సమావేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని వైసీపీ సమావేశాలను బహిష్కరించింది. దీంతో విపక్షం లేకుండానే ఏపీ అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాయి. మండలిలో వైసీపీకి బలం ఉండటంతో బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని వైసీపీ చివరి నిమిషంలో నిర్ణయం తీసుకుంది. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వైఎస్సార్సీపీ పార్టీ తరపున పోటీ చేసిన వారిలో కేవలం 11మంది సభ్యులు మాత్రమే గెలుపొందారు. ఎన్డీఏ కూటమి తరపున 164మంది గెలుపొందారు. ఏపీ అసెంబ్లీలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీలకు కూడా ప్రాతినిథ్యం ఉంది. మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. వైసీపీ తరపున 11మంది మాత్రమే సభ్యులు ఉండటంతో తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా కావాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ప్రతిపక్ష హోదాకు తగినంత మంది సభ్యుల బలం లేకపోవడంతో వైసీపీ తరపున గెలిచిన వారికి? సాధారణ ఎమ్మెల్యే హోదా మాత్రమే వర్తిస్తుందని అధికార పక్షం తేల్చేసింది. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా సభకు హాజరు కావడానికి వైసీపీ విముఖత చూపింది. దీనికి తోడు అసెంబ్లీలో అధికార పార్టీ తమపై ప్రతీకారం తీర్చుకుంటుందనే అనుమానం ఆ పార్టీ బాధ్యుల్లో ఉంది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరని, అధికార పార్టీ అడ్డు తగులుతుందనే అనుమానం ఆ పార్టీలో ఉంది. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత 2014లో టీడీపీ, బీజేపీలు తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అప్పట్లో వైసీపీకి తగినంత బలం ఉన్నా ఆ పార్టీ నుంచి 23 మంది సభ్యులు టీడీపీలో చేరారు. 2019లో వైసీపీకి ఏకపక్షంగా మెజార్టీ లభించింది. 151 స్థానాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. టీడీపీ నుంచి గెలిచిన వారిలో నలుగురు వైసీపీ పక్షం చేరిపోయారు. టీడీపీ కేవలం



23మందితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జనసేన నుంచి గెలిచిన ఒక్క సభ్యుడు కూడా అప్పట్లో వైసీపీ పక్షాన చేరిపోయాడు. 2019-24 మధ్య ఏపీ అసెంబ్లీలో వైసీపీ బలం ఏకపక్షంగా ఉండటంతో టీడీపీ మీద దూకుడుగా వ్యవహరించేవారు. వైసీపీ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని టీడీపీ విమర్శించడం, న్యాయపరమైన అవరోధాలు కల్పించడం, శాసనసభలో వైసీపీ అమోదించిన బిల్లుల్ని మండలిలో బలమున్న టీడీపీ అడ్డుకోవడం సాధారణంగా జరిగేవి. ఓ దశలో ఏపీ అసెంబ్లీలో తమ బలం ఉన్నా మండలిలో మాట నెగ్గడం లేదని ఏకంగా శాసన మండలిని రద్దు చేయాలని జగన్ భావించారు. మండలితో వృధా ఖర్చు తప్ప ప్రజలకు ఉపయోగం లేదని తీర్మానం చేశారు. మండలి రద్దు నిర్ణయానికి కేంద్రం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. మరోవైపు ఏపీలో ఘనమైన విజయాన్ని దక్కించుకున్నా రాజకీయంగా టీడీపీ మీద పోరాటంలో వైసీపీకీ ఇబ్బందులు తప్పేవి కాదు. దీంతో విమర్శలు, ఆరోపణలు శృతి మించేవి. చివరకు 2021 నవంబర్‌లో ఏపీ అసెంబ్లీ సమావేశాలకు రానని, ముఖ్యమంత్రిగానే మళ్లీ సభలో అడుగుపెడతానని టీడీపీ అధ్యక్షుడు సభ నుంచి వాకౌట్ చేశారు. రెండున్నరేళ్ల తర్వాత 2024ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఏపీ అసెంబ్లీలో గతంలో జరిగిన పరిణామాలు పునరావృతం అవుతాయనే ఉద్దేశమో మరో కారణమేదైనా ఉందో స్పష్టంగా వెల్లడించకపోయినా శాసనసభకు రావడానికి జగన్ విముఖత చూపారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయడానికి కూడా అతి కష్టమ్మీద హాజరయ్యారు. సభలో తనను టీడీపీ అవమానించేలా వ్యవహరిస్తుందనే ఆలోచనతో ఆయన వారికి ఎదురు పడటానికి కూడా ఆసక్తి చూపలేదుతాజాగా ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సభలో బడ్జెట్ కేటాయింపులు, పథకాల అమలు తీరును నిలదీసే అవకాశాన్ని కూడా జగన్ వదులుకున్నారు. అసెంబ్లీ జరిగే సమయంలో ప్రతిరోజు మీడియా సమావేశాలను నిర్వహిస్తానని ప్రకటించారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఎటూ ఇవ్వరు కాబట్టి తమ గొంతు బయట వినిపిస్తామని ప్రకటించారు. అయితే దానిని కూడా జగన్ ఆచరణలో అమలు చేయలేదు. అసెంబ్లీ సమావేశాలకు జగన్ హాజరై ఉంటే పరిస్థితి మరో రకంగా ఉండేది. సభలో మాట్లాడే అవకాశం వచ్చేదా లేదా అన్నిది పక్కన పెడితే అధికారాన్ని కోల్పోయిన తర్వాత తొలిసారి సభలో కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశాన్ని మాత్రం జగన్ జారవిడుచుకున్నారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా అసెంబ్లీ వెలుపల కూటమిపై విమర్శల దాడి చేయకుండా టీడీపీ పన్నిన వ్యూహంలో జగన్ శిబిరం చిక్కుకుంది. గత కొద్ది రోజులుగా పెద్ద సంఖ్యలో జరుగుతున్న సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆ పార్టీ కోసం సోషల్‌మీడియాలో ప్రత్యర్థులపై దాడి చేసే ప్రధానమైన వారిని గుర్తించి కేసులు పెట్టడంతో వైసీపీ ఆత్మరక్షణలో పడింది. దీంతో ఏపీ అసెంబ్లీ - బడ్జెట్ అంశం పక్కదారి పట్టింది. ఓ దశలో వైసీపీ కార్యకర్తల కోసం బాధితులను పరామర్శించేందుకు జగన్ రెడీ అయినట్టు కూడా ప్రచారం జరిగినా ఆ తర్వాత జిల్లాల వారీగా ముఖ్య నాయకులకు ఆ బాధ్యతలు అప్పగించారు. జగన్ అసెంబ్లీకి రాక పోవడంతో సభలో పోరాడే అవకాశాన్ని విడుచుకున్నారు. అసెంబ్లీలో పోరాడి, మైక్ ఇవ్వకపోతే అప్పుడు తను సభ నుంచి వెళ్లిపోతే కనీసం పోరాడినట్టు చెప్పుకోవడానికి ఉండేది. ముందే అస్త్ర సన్యాసం చేశాడు. దీనికి తోడు జగన్ రాకపోవడంతో సభలో దూషణలు, బూతులు లేకుండా చర్చ జరుగుతోందని అధికార పార్టీ చెప్పుకోడానికి అవకాశం దొరికింది. బడ్జెట్‌లో టీడీపీ కూటమి కీలక హామీల కేటాయింపుల విషయం వాస్తవానికి రచ్చ జరుగుతుంది. కానీ ఈ సారి దాని గురించి మాట్లాడలేదు. జనంలో కూడా ఎన్నికల హామీల అమలుపై పెద్దగా చర్చకు రాలేదు. దీంతో టీడీపీ కూటమి ఊపిరి తీసుకునే అవకాశం దొరికినట్టైంది. సోషల్ మీడియా అరెస్టులు వైసీపీపై చాలా ప్రభావం చూపించాయి. చాలా మంది తమ అకౌంట్లు క్లోజ్ చేశారు. బహిరంగ క్షమాపణలు చెప్పారు. చంద్రబాబు అసెంబ్లీ సమావేశాల సమయంలోనే సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టుల అంశం ఎత్తుకోకపోయినా జగన్ సభకు రాకపోవడం, అరెస్టులు ఏకకాలంలో కూటమి కలిసొచ్చాయి.

# కిమిడికి జిల్లా పరిషత్..?

విజయనగరం, నవంబర్ 21

కిమిడి నాగార్జున.. ఉమ్మడి విజయనగరం రాజకీయాల్లో ఆయన పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. 2019లో చీపురుపల్లిలో టీడీపీ నుంచి మాజీ మంత్రి, ప్రస్తుత శాసనమండలి విపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణపై పోటీ చేసి ఓడిపోయిన నాగార్జున.. వైసీపీ వేధింపులను తట్టుకుంటూ అయిదేళ్లు అక్కడ బొత్స అక్రమాలను ఎండగడుతూ పార్టీ బలోపేతానికి క?షి చేశారు. 2014లో అదే చీపురపల్లి నుంచి బొత్సపై గెలిచి మంత్రిగా పని చేసిన కిమిడి మృణాళిని రాజకీయ



వారసత్వాన్ని అంది పుచ్చుకున్న ఆయన గత ఎన్నికల్లో విజయం సాధించడానికి పెద్ద కసరత్తే చేశారు. విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా జిల్లాలో బొత్స ఆధిపత్యానికి గండి కొట్టడానికి అలుపెరుగని పోరాటం చేసిన కిమిడి నాగార్జునకు గత ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఖాయమని, ఖచ్చితంగా ఆ యువనేత. బొత్సాకి చెక్ పెడతారని తెలుగుతమ్ముళ్లు భావించారు. అయితే ఎన్నికలు వచ్చేసరికి పెదనాన్న కిమిడి కళా వెంకట్రావు రూపంలో ఎమ్మెల్యే టికెట్ కి అడ్డుపుల్ల పడింది. తనను కాదని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన కళా వెంకట్రావుకి చీపురుపల్లి టికెట్ ఇవ్వడంతో నాగార్జున తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నారా లోకేశ్ టీమ్‌లో మెంబర్ అయిన నాగార్జున అధిష్టానం బుజ్జగింపులతో మెత్తబడ్డారు . చంద్రబాబే తమ నాయకుడంటూ.. స్టార్ క్యాంపెయినర్‌గా ఉత్తరాంధ్రలో ప్రచారం చేశారు . పార్టీ అధికారంలోకి వచ్చింది . నాగార్జున నామినేటెడ్ పోస్టు గ్యారంటీ అని భావించారు . ఫస్ట్ లిస్టులోనే కిమిడి నాగార్జున పేరుంటుందని ఆయన అనుచరులు ఆశగా ఎదురు చూశారు. అయితే నామినేటెడ్ పదవుల రెండో జాబితాలో కూడా ఆయనకు స్థానం దక్కలేదు. ఎన్నికల ముందు నాగార్జునకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన అధిష్టానం ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ..దీంతో ఉమ్మడి జిల్లా పొలిటికల్ సర్కిల్స్‌లో ఆయన ఫ్యూచర్‌పై హాట్ హాట్ చర్చలు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా నాగార్జునకి మళ్ళీ అన్యాయం జరిగింది అన్న చర్చ మొదలయింది . విజయనగరం యాస లో చెప్పాలంటే పాపం ఆ గుంటడికి మళ్ళీ అన్యాయం జరిగింది. ఈ సారీ ఏటీ ఇవ్వలేదు. నిజంగా పని సేసినోడికి ఎపుడూ న్యాయం జరగదు. ఆల పెదనాన్న కళా వెంకటరావు గానీ సెడ గొడతండేటి అని నాగార్జునపై తెగ జాలి కురిపించేస్తున్నారు. మరోవైపు నాగార్జున ఇటీవల కాలంలో నియోజకవర్గంలో ఎక్కడా కనపడటం లేదు. పూర్తిగా విశాఖకే పరిమితమై, అపుడప్పుడూ జిల్లా పార్టీ అధ్యక్షుని హోదాలో జిల్లాల జరిగే కార్యక్రమాల్లో మాత్రం కనిపిస్తున్నారు. నాగార్జున చీపురుపల్లికి రాకపోవడానికి ఎమ్మెల్యే తనయుడి హోదాలో కిమిడి కళా వెంకటరావు కొడుకు రామ్‌మల్లిక్ నాయుడు నియోజకవర్గాన్ని అంటి పెట్టుకొని ఉండడమే అంటున్నారు . కళా వెంకట్రావు పూర్తిగా రాజాంలో పూర్తిగా మకాం వేస్తే.. రామ్‌మల్లిక్ నియవజకవర్గంలో వ్యవహారాలు చక్కపెడుతున్నారంట . దాంతో అభిప్రాయ భేదాలు ఎందుకులే అనుకున్నారేమో.. నాగార్జున చీపురుపల్లి వైపు కన్నెత్తి చూడడం మానేశారు. ఓ పక్క ఎమ్మెల్యే టికెట్ లేదు, మరోవైపు నామినేటెడ్ పదవీ లేదు , ఇంకో వైపు నియోజకవర్గంలో పర్యటించే అవకాశం లేదు. దీంతో నాగార్జున భవిష్యత్తుపై జిల్లా వ్యాప్తంగా తెగ చర్చించుకుంటున్నారు. అయితే టీడీపీ అధిష్టానం ఆయనకి సరైన సమయంలో సరైన పదవి కట్టబెడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రజలతో మమేకమయ్యే పదవినే ఇస్తారు తప్ప , కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు లాంటివి ఆయన సత్తాకి సరైనవి కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీ ఛైర్మన్ పదవి ఆయననే వరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే టాక్ నడుస్తోంది. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఆయనకు అదే సరైన పదవి అని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి . ఒకవేళ జడ్పీ ఛైర్మన్ పదవి రిజర్వ్‌డ్ కోటాలోకి వెళ్లే ఎమ్మెల్సీగా అవకాశం దక్కొచ్చని ఆయన అనుచరవర్గం లెక్కలు వేసుకుంటుంది. . చట్టసభలకి వెళ్లాలని అమెరికాలో ఉద్యోగం కూడా వదులుకొని , పార్టీకోసం శ్రామికుడిలా పని చేసిన నాగార్జునకి కూటమి ప్రభుత్వం ఎలాంటి పదవి కట్టబెడుతుందో అనే ఆసక్తి అందరిలో కనిపిస్తుంది. చూడాలి చంద్రబాబు, లోకేష్ లు నాగార్జునను హీరోని చేస్తారో , జీరోగా మిగుల్చుతారో.

## వలంటీర్ వ్యవస్థ కథ ముగిసినట్టే

గుంటూరు నవంబర్ 21,

ఆంధ్రప్రదేశ్‌లో వలంటీర్ల వ్యవస్థ ఉనికిపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. అసలు ఆ వ్యవస్థ ఉనికిలో లేదని తేల్చి చెప్పింది. 2023 సెప్టెంబర్‌లో రెన్యువల్ చేయాల్సి ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. జగన్ ప్రభుత్వమే ఆ వ్యవస్థను నాశనం చేసిందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి చెప్పుకొచ్చారు. శాసన మండలిలో వలంటీర్ వ్యవస్థపై తీవ్ర చర్చ జరిగింది. అధికార ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మంత్రి విరాంజనేయస్వామి, మాజీ మంత్రి, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య హీట్ డిస్కషన్ నడిచింది. వలంటీర్ల వ్యవస్థ, వారికి ఇవాల్సిన జీతాలపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు అడిగారు. ఈ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం జీవో 5 ద్వారా తీసుకొచ్చారని మంత్రి వివరించారు. 2023 సెప్టెంబర్ అసలు జీవోనే ఇష్యూ చేయలేదని తెలిపారు. అప్పటి వరకు ప్రతి ఏడాది రెన్యువల్ చేస్తూ వచ్చిన ప్రభుత్వం 2023లో మాత్రం రెన్యువల్ చేయలేదని వివరించారు. అసలు ఆ వ్యవస్థనే కొనసాగించలేదు. లేని వారితో రాజీనామాలు చేయించారన్నారు. లేని వాళ్లను చూపించి ఎన్నికల కోడ్ పేరుతో డ్రామాలు ఆడారన్నారు. రెన్యువల్ చేసి జీతాలు పెంపును అమలు చేద్దామని చూస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు మంత్రి డోలా. ఇప్పుడు సాంకేతిక కారణాలతో వారిని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వారు ఉద్యోగాల్లో లేకపోయినప్పటికీ మే నెల వరకు జీతాలు ప్రభుత్వం ఖజానా నుంచి ఇచ్చారని తెలిపారు. బొత్స సత్యనారాయణ స్పందిస్తూ... వ్యవస్థ ఉందని దాన్ని రెన్యువల్ చేస్తే సరిపోతుందని అన్నారు. ఎన్నికల కారణంగా ఉత్తర్వులు ఇవ్వలేకపోయి ఉండొచ్చని దాన్ని ఇప్పటి ప్రభుత్వం కొనసాగించడంలో అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. దానికి స్పందించిన మంత్రి డోలా... 2020 నుంచి ఏటా రెన్యువల్ జీవోలు ఇస్తూ వచ్చిన జగన్ ప్రభుత్వం 2023లో జీవో ఇవ్వడానికి వచ్చిన అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామని ముందే జగన్ గ్రహించారని అందుకే జీవో ఇవ్వలేదని అన్నారు.

# వలస కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం

నల్గొండ నవంబర్ 21,

నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వచ్చేవారం ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వలస కార్మికుల కు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నకిరేకల్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె నకిరేకల్ లోని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలోని క్యాజువల్టీని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రతిరోజు ఆసుపత్రికి వస్తున్న ఇన్ పేషెంట్ల సంఖ్య ,అవుట్ పేషెంట్లు, ఎమర్జెన్సీలో చేరుతున్నవారి సంఖ్య, తదితరు వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి రిజిస్టర్లు నిర్వహిస్తున్నారని, ఆసుపత్రి సేవలు ఎలా అందిస్తున్నారని తెలుసుకున్నారు . అనంతరం లేబర్ రూమ్ ను సందర్శించి ప్రసవాల పరిస్థితిపై ఆరా తీశారు. ప్రసవం ముందు గర్భిణీల కు ఇస్తున్న కౌన్సిలింగ్, సాధారణ, సిజేరియన్ ప్రసవాలపై వివరాలను అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి మొత్తాన్ని పరిశీలించారు. ఇతర ప్రాంతాల నుండి నకిరేకల్ పరిసర ప్రాంతాలలో కంపెనీలలో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేకించి వచ్చేవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, ఈ శిబిరంలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని డాక్టర్లను ఆదేశించారు. అనంతరం పక్కనే నిర్మాణంలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. కొత్త భవన నిర్మాణాన్ని వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు .తహసిల్దార్ జమీరుద్దీన్, ఆసుపత్రి వైద్యులు, తదితరులు ఉన్నారు

భారత శక్తి

శుక్రవారం, 22 నవంబర్ 2024

## డ్వాక్రా మహిళలకు డ్రోన్ పైలట్ శిక్షణ-

నెల్లూరు, నవంబర్ 21

ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా సంఘాలకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది ప్రభుత్వం. ఈ మధ్య ఏర్పాటు చేసిన డ్రోన్ సదస్సులో హామి ఇచ్చినట్టుగా ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన మహిళలను ఇందులో శిక్షణ ఇస్తారు. దీంతో వ్యవసాయ పనుల్లో కూలీల కొరతను అధిగమించడమే కాకుండా, రైతుల డబ్బులు ఆదా చేసేలా యంత్రాగాన్ని సిద్ధం చేస్తోంది. ఈ కాలంలో వ్యవసాయం అంటే చిన్న విషయం కాదు. పంట పండించేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆ పంట ఇంటికి వచ్చే వరకు కూడా ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఖర్చు, కూలీల కొరత, గిట్టుబాటు ధర ఈ మూడే నేటి తరం రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు. వీటి కారణంగానే రైతు వ్యవసాయానికి దూరం అవుతూ వస్తున్నాడు. అందుకే ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకెళ్తోంది కూలీల, ఖర్చులు తగ్గించేందుకు ప్లాన్స్ వేస్తోంది. అందులో భాగంగా ఎరువులు పిచికారీ చేయడం లాంటి పనులు చేసే కూలీలు దొరకడం కష్టం. రోజుల తరబడి చేయించాల్సి ఉంటుంది. ఇలాంటి వాటికే కనిపించకుండానే ఖర్చు ఎక్కువ అవుతుంది. అందులో వీటి వాడకం కూడా మోతాదుకు మించడమో లేకపోతే తగ్గడమో జరుగుతుంది. ఇలాంటి బెడద లేకుండా ఉండేందుకు ప్రభుత్వం డ్రోన్‌లను రంగంలోకి దించుతోంది. ప్రతి గ్రామంలో వ్యవసాయ పనులకు డ్రోన్స్ వినియోగించేలా ప్రయత్నాలు ప్రారంభించిది. ఈ బాధ్యతను డ్వాక్రా సంఘాలకు ఇవ్వబోతోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నమో డ్రోన్ దీదీ కార్యక్రమాన్ని పక్కగా అమలు చేయాలని భావిస్తోంది. దీని కోసం డ్వాక్రా సంఘాల్లోని మహిళలను ఎంపిక చేసి డ్రోన్ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు లబ్దిదారులను ఎంపిక చేయాలని డీఆర్డీఏ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇలా ఎంపికైన వారికి రాయితీపై డ్రోన్లు సరఫరా చేయనుంది. ఈ సీజన్ నుంచే డ్రోన్లు మంజూరు చేసే అవకాశముందని తెలుస్తోంది. దీని ద్వారా మహిళలకు జీవనోపాదితోపాటు రైతుల ఖర్చులు కూడా తగ్గుతాయని అంటున్నారు. అంతే కాకుండా మందులు పిచికారీ చేసేటప్పుడు కూలీలు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. వాటి బారి నుంచి కూడా రక్షించుకోవచ్చు. కొన్నిసార్లు ఏపుగా పెరిగిన చేల్లోకి రైతులు, కూలీలు వెళ్లి మందులు చేయడం కష్టంతో కూడుకున్న పని. పంట కూడా నాశనం అవుతుంది. డ్రోన్లతో సులభంగా పని పూర్తి చేయవచ్చు. ఎంపిక చేసిన మహిళలకు 15 రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఒకరికి రిమోట్ పైలట్‌గా ట్రైనింగ్ ఇస్తే... ఆ కుటుంబంలోనే మరొకరికి ఫిటింగ్, మెకానికల్, మరమ్మతులపై శిక్షణ ఇస్తారు. వారిని డ్రోన్ అసిస్టెంట్ అంటారు. వాళ్లకు ఐదు రోజులు ట్రైనింగ్ ఇస్తారు. ఇలా శిక్షణ తీసుకున్న వాళ్లకు సర్టిఫికేట్స్ కూడా ఇస్తారు. గ్రామంలోని వ్యవసాయ పనులకు ఉపయోగపడేలా వారిని తీర్చిదిద్దుతారు. శిక్షణ పొందిన వాళ్లకు 10 లక్షల విలువ చేసే డ్రోన్‌ను అందిస్తారు. ఇందులో 80 శాతం రాయితీ ఇస్తారు. అంటే లబ్ధిదారులు 2 లక్షలు చెల్లిస్తే మిగతా 8 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. పొలంలో మందులు, ఎరువులు పిచికారీ చేయడం, డ్రోన్లకు అమర్చే కెమెరాలతో ఫొటోలు తీయడం, చీడపీడలను గుర్తించడంపై శిక్షణ ఇస్తారు. ఆ ఫొటోలను వ్యవసాయ అధికారులకు పంపించి సూచనలు తీసుకునేలా వారికి ట్రైనింగ్ ఉంటుంది.

# రోజాకు రియల్ సినిమా..

తిరుపతి, నవంబర్ 21,

మాజీమంత్రి ఆర్కే రోజా మరోసారి వార్తల్లోకి ఎక్కారట. ఆమె గతంలో పనిచేసిన పర్యాటక శాఖలోని అవకతవకలు ఒక్కొక్కటిగా బయటకు రావటంతో? ఆ శాఖ ఇమేజ్ దెబ్బతిందనే వార్తలు గుప్పుమంటున్నాయి. 2019లో ఎమ్మెల్యేగా గెలిచాక.. రోజాకు ఏపీఐఐసీ ఛైర్మన్‌గా రెండున్నర సంవత్సరాలు అవకాశాన్ని జగన్ కల్పించారు. అనంతరం రెండున్నర ఏళ్ల తర్వాత మంత్రివర్గాన్ని మార్చిన జగన్.. రోజాకు టూరిజం, క్రీడాశాఖ మంత్రిగా ప్రమోషన్ ఇచ్చారు. ఇంత అవకాశం ఉన్నా.. రోజా.. తన పదవీ కాలంలో అటు నియోజకవర్గానికి గానీ.. ఇటు రాష్ట్రానికి కానీ.. తన శాఖ ద్వారా ప్రగతి చూపలేదనే విమర్శలను మూటగట్టుకున్నారట.మంత్రి హయాంలో మేడమ్.. తిరుమలకు దర్శనానికి రావడం.. బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడటం తప్పు చేసిందేమీ లేదనే వాదనలు.. సొంత పార్టీలోనే వినిపించాయట. తిరుమల కొండపై రాజకీయాలు మాట్లాడితే కేసులు పెట్టాలని ఏకంగా పాలకమండలి సమావేశంలో తీర్మానం పెట్టేంత పరిస్థితి వచ్చిందంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చని రాజకీయవర్గాలూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి.దీనికి తోడు ఆమె వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ గొల్ల మండపం వద్ద శిలువ ధరించటమే కాకుండా.. దానిని ఆలయం ఎదుట ప్రదర్శించినా కనీసం దీనిని ఖండించలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు టూరిజంశాఖ మంత్రిగా.. తిరుపతిలోని శ్రీవారి పాదాల చెంత టూరిజం కార్యాలయంలో.. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని వివాదాలకు కేంద్ర బిందువు అయ్యారనే అవవాదనూ మూటగట్టుకున్నారని సొంత పార్టీలోనే చర్చ సాగిందట. దీనికి తోడు ఆమె మంత్రిగా ఉన్న సమయంలో ఏడు కొండల కింద ముంతాజ్ అనే స్టార్ హోటల్‌కు అనుమతులు మంజూరు చేసి మరో వివాదంలో రోజా ఇరుక్కున్నారట.అన్నింటికంటే మరో వివాదం ఆమెపై ఉందని పొలిటికల్ వర్గాల్లో చర్చసాగుతోందట. తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి.. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన టూరిజం శాఖకు 300 రూపాయల ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లను.. ప్రతిరోజూ 3వేల500 కేటాయించే వారు. ఎక్కువగా తమిళనాడు, కర్ణాటక భక్తులు వచ్చే వారట. దీంతో ఏపీ టూరిజం అనేక అక్రమాలకు పాల్పడిందని విజిలెన్స్.. రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో బయటపడిందట.దీనిపై అప్రమత్తం అయిన నాటి పాలక మండలి వాటిని పూర్తిగా రద్దు చేసిందట. మరోవైపు.. టూరిజంశాఖకు లీజు బస్సులు నడుస్తున్నాయి. ఇవి చాలా వరకూ ఎక్కడా తిరగడం లేదని సమాచారం. కేవలం తిరుమల టికెట్లు బుక్ చేసి.. బస్సులు తిప్పినట్లు.. దానికోసం అద్దెలు పెద్ద ఎత్తున చెల్లించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయట. మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ధనుంజయ్‌రెడ్డి బావమరిది గిరిధర్ రెడ్డి..తిరుపతి జిల్లా టూరిజం శాఖ అధికారిగా ఉంటూ.. అనేక దందాలు సాగించారనే ఆరోపణలూ ఉన్నాయి.ఆర్టీసీ డిపో మేనేజర్ అయిన సదరు ఉద్యోగిని డిప్యుటేషన్‌పై టూరిజంశాఖ తీసుకువచ్చారట. ఆయనతో పాటు ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల రీజియన్ అదికారిగా.. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన ఓఖఆూను నియమించటంతో.. ఇద్దరూ అడ్డగోలుగా దందాలు చేశారని అనేక ఫిర్యాదులు ఉన్నాయట. తిరుమల శ్రీవారి దర్శనం ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు బుక్ చేసుకున్న వారితో పాటు రాయచోటికి కూడా టూరిజం బస్సులు నడిపినట్లు లెక్కలు చూపించారట. దీంతో ఎన్నడూ లేని విధంగా కొత్త విషయాలు బయటకు రావటంతో.. సొంత పార్టీలో నాడు చర్చలు సాగాయనే టాక్ నడిచినట్లు తెలుస్తోంది. దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకోవాలనే విధంగా వీరంతా వ్యవహరించనట్లు ఆధారాలతో సహా బయటకు రావటంతో.. రోజా మరిన్ని చిక్కుల్లో పడ్డారట.టూరిజం శాఖ నుంచి ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు.. మొదటినుంచి స్కామ్‌లా మారాయనే ఆరోపణలు ఉన్నాయట. చివరికి ఆర్టీసీ ని కూడా ఇందులో భాగం చేశారనే అపవాదు ఉందట. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి టికెట్లు బుక్ చేసుకున్న రికార్డులు క్రియేట్ చేసి.. అప్‌అండ్ డౌన్ ఛార్జీలతో పాటు శ్రీవారి దర్శనం టికెట్‌ను ఇందులో కలిపారట. ఈ విధంగా టికెట్లు బుక్ చేసుకున్న వారు చాలామందీ.. స్వామి వారి దర్శనానికి మాత్రమే వచ్చి బస్సుల్లో మాత్రం ప్రయాణం చేసేవారు కాదట.ఈ టికెట్లను టూరిజం సిబ్బంది.. అయా బస్సు డ్రైవర్ కండక్టర్లతో ముందుగానే అందించి.. పాత టిక్కెట్ల రసీదులతో సొమ్ములు దోచుకున్నారనే వార్తలు కూడా గుప్పుమంటున్నాయి. ఈ విధంగా ఖీల ఆదాయానికీ.. గండికొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయట. అదే విధంగా అద్దె బస్సులు నడిపినట్లు రికార్డులు చూపించి..డబ్బులు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్‌తో పాటు తిరుపతిలో ప్రత్యేకంగా కౌంటర్లు పెట్టి ఈ వ్యవహారం నడిపినట్లు విజిలెన్స్ విచారణలో బయటపడటంతో ప్రభుత్వ పెద్దలే నాడు కంగుతిన్నారనే వార్తలు వినిపించాయి. శిల్పారామంలో అక్రమదందాలు, టూరిజం హోటల్స్, బార్లులో అడ్డగోలు వ్యవహారాలు నడిచినా.. ఏ రోజూ తన శాఖలపై నాటి మంత్రి రోజా.. రివ్యూ చేసిన దాఖలాలు కూడా లేవనే టాక్ నడుస్తోంది. దీంతో ఇష్టారాజ్యంగా సిబ్బంది. దందాలు నడిపిన పరిస్థితి ఏర్పడిందని తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు. ఏపీ టూరిజం శాఖ ఎఫెక్ట్.. మిగతా రాష్ట్రాల భక్తులకు శాపంలా మారిందట. మిగతా రాష్ట్రాలకు చెందిన భక్తులకు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.మరోవైపు.. తిరుమల శ్రీవారి పాదాలచెంత గతంలో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేవలోక్ ప్రాజెక్టుకు.. తిరుమల కొండల కింద జూపార్క్ కోసం అలిపిరికి మధ్యలో 22 ఎకరాలు కేటాయించారు. అయినా ప్రాజెక్టు నిర్వహణ ప్రారంభం కాలేదు. అప్పట్లో కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జూపార్క్ సమీపంలో శంకుస్థాపన కూడా చేశారట. ఐతే.. ఈ ప్రాంతంలో విలువైన ఎర్రచందనం చెట్లు నరికివేశారట. దేవలోక్ రాలేదు..స్టేడియం కట్టింది లేదు. తర్వాత ఆ భూముల్లోని ఏడు ఎకరాలను ఏకంగా ముంతాజ్ పేరుతో హోటల్ నిర్మించడానికి అనుమతులు ఇచ్చారట. దీంతో వివాదం కాస్తా ముదిరి పాకాన పడిందనేది రాజకీయవర్గాల మాట.మొదట ఆ భూముల్ని ఒబెరాయ్ గ్రూప్‌కు ఇస్తున్నట్లు టూరిజం శాఖ వెల్లడించిందట. తర్వాత ఆ ప్రాంతంలో ముంతాజ్ పేరుతో హోటల్ నిర్మాణం చేస్తూ బోర్డు పెట్టడంతో భక్తులు అవాక్కు అయ్యారట. ఆన్‌లైన్‌లో అప్పటి సీఎం శంకుస్థాపన కూడా చేసేశారట. అయితే స్టార్ హోటల్ పేరు ముంతాజ్ కావడం అందులోనూ.. స్పా సెంటర్‌తో పాటు బార్ అండ్ రెస్టారెంట్, నాన్ వెజ్ హోటల్ అని తెలియటంతో స్వామివారి



భక్తులతో పాటు హిందూ ధార్మిక సంఘాలు కూడా గళం విప్పాయట.ఇన్ని తెలిసినా.. వారానికి ఓసారి శ్రీవారికి పరమభక్తురాలిగా ఉండే రోజా.. దర్శనానికి వచ్చి కనీసం అభ్యంతరం చెప్పలేదని.. సొంతపార్టీలోనే వార్తలు గుప్పుమన్నాయట. అధికారం మారడంతో ముంతాజ్ హోటల్స్‌పై.. తీవ్రమైన చర్చ సాగింది. అనంతరం ముంతాజ్ పేరు తొలగించి.. ట్రైడెంట్ పేరుతో హోటల్ నిర్మాణాన్ని ఒబెరాయ్ గ్రూప్ మొదలపెట్టింది. ముంతాజ్ అనే పేరు ఉన్నప్పుడు ఆ శాఖ మంత్రిగా రోజా.. ఏనాడూ స్పందించిన దాఖలాలు లేవని? చాలామంది భక్తులూ పెదవివిరిచారు. దీనిపై మంత్రిగా ఉన్న రోజా ఎందుకు మౌనం వహించారో.. తెలియదంటూ రాజకీయవర్గాలూ ప్రశ్నిస్తున్నారు. ఏపీఐఐసీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు.. సొంత నియోజకవర్గంలోని వడమాలపేట, విజయపురం మండలాల్లో పరిశ్రమల కోసం స్థల సేకరణ చేయించారు. అయినా అక్కడకు ఒక్కటంటే ఒక్క పరిశ్రమ వచ్చిన దాఖలాలు లేవు. ఉన్న పరిశ్రమలు కూడా పోయాయని స్థానికులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. దీంతో పాటు వడమాలపేట మండలంలోని భూములను.. తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగస్థుల కోసం కేటాయించారు.మరోవైపు.. నాడు మంత్రిగా ఉన్న రోజా.. కార్యాలయానికి ఎయిర్ పోర్టు వద్ద రెండు ఎకరాల భూమి కేటాయించారనే విమర్శలనూ ఎదుర్కొన్నారు. క్రీడాశాఖ మంత్రిగా పనిచేసిన రోజా.. జగన్.. జన్మదినోత్సవాలకు అడుదాం ఆంధ్రా పేరుతో హడావిడి చేయడం తప్ప.. రాష్ట స్థాయిలో క్రీడాకారులకు సరైన శిక్షణ శిబిరాలు నిర్వహించనే లేదట. ఫెడరేషన్ పేరుతో క్రీడలు నిర్వహించినా ఎక్కడా వాటికి గుర్తింపు లభించలేదట. చాలామంది క్రీడాకారులు పోటీలో పాల్గొని విజయం సాధించినా.. వారికి ఎలాంటి గుర్తింపులేదని.. చివరకు ఉన్నతచదువులకు కూడా ఇవి ఉపయోగపడలేదని చాలా మందీ ఆవేదవ వ్యక్తం చేశారట.మొత్తంమీద మాజీమంత్రి రోజా ఎఫెక్ట్‌తో సీరియస్‌గా స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అటు శాఖమీద పట్టు తెచ్చుకోలేకపోగా.. నోటి దురుసుతో పార్టీకి నష్టం చేకూర్చారని అటు పార్టీలోనూ చర్చ సాగుతోందట. భవిష్యత్‌లో మరెన్ని వివాదాలు బయటకు వస్తాయోనని పార్టీ వర్గాల్లోనూ చర్చ సాగుతోంది.

==================================

## భారీగా పతనమవుతున్న ఆదానీ కంపేనీల షేర్లు

ముంబాయి

స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పతనం అవుతున్నాయి. అత్యధికంగా అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు 20 శాతం వరకు విలువ కోల్పోయింది. ఓ భారీ కాంట్రాక్టు పొందేందుకు మిలియన్ డాలర్ల (రూ.2,029 కోట్లు) లంచాలు ఇవ్వజూపినట్లు అమెరికాలోని బ్రూక్లిన్లోని ఫెడరల్ కోర్టు అభియోగాలు మోపడం దీనికి ప్రధాన కారణంగా నిలిచింది. న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీ బ్రియాన్ పీస్ ఆదేశాల మేరకు మొత్తం ఐదు అభియోగాలతో గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై కేసులు నమోదయ్యాయి.అదానీ గ్రూప్లోని పలు కంపెనీల షేర్లు భారీగా పతనం అయ్యాయి. ఏసీసీ 10%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 20%, అదానీ ఎంటర్ ప్రైజెస్ 20%, అదానీ గ్రీన్ ఎనర్జీ 18%, అదానీ పోర్ట్స్ 15%, అదానీ పవర్ 14%, అదానీ టోటల్ గ్యాస్ 15%, అదానీ విల్మార్ 10%, అదానీ సిమెంట్స్ 12% నష్టపోయాయి. మొత్తంగా గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ రూ.14.28 లక్షల కోట్ల నుంచి 12.42 లక్షల కోట్లకు పడిపోయినట్లు ఫార్చ్యూన్ కథనంలో పేర్కొంది. ఈ గ్రూపులో పెట్టుబడిదారు అయిన అమెరికాకు చెందిన జీక్యూజీ పార్టనర్స్ షేర్లు కూడా 25 % కుంగినట్లు సీఎన్బీసీ పేర్కొంది.

## రేణిగుంట విమానాశ్రయంలో జారీ చేసే శ్రీవాణి టికెట్ల సంఖ్య పెంపు

తిరుమల, నవంబరు 21

రేణిగుంట విమానాశ్రయంలో ప్రతిరోజూ జారీ చేస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల సంఖ్యను టీటీడీ 100 నుండి 200 కు పెంచింది.ఈ మేరకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో భక్తులు టికెట్లను బుక్ చేసుకోవచ్చు. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో మాత్రమే ఈ ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేస్తారు.అలాగే తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం వెనుక వైపు ఉన్న శ్రీవాణి టికెట్ కౌంటర్ లో ఆఫ్ లైన్ లో జారీ చేస్తున్న టికెట్ల సంఖ్యను 900 నుండి 800 కు తగ్గించడం జరిగింది. మొదటి వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఈ టికెట్లను జారీ చేస్తారు.కాగా ఈ విధానం రేపటి నుండి అమలులోకి రానుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించవలసిందిగా కోరడమైనది.

## డ్వాక్రా మహిళలకు డ్రోన్ పైలట్ శిక్షణ-

నెల్లూరు, నవంబర్ 21,

ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా సంఘాలకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది ప్రభుత్వం. ఈ మధ్య ఏర్పాటు చేసిన డ్రోన్ సదస్సులో హామి ఇచ్చినట్టుగా ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన మహిళలను ఇందులో శిక్షణ ఇస్తారు. దీంతో వ్యవసాయ పనుల్లో కూలీల కొరతను అధిగమించడమే కాకుండా, రైతుల డబ్బులు ఆదా చేసేలా యంత్రాగాన్ని సిద్ధం చేస్తోంది. ఈ కాలంలో వ్యవసాయం అంటే చిన్న విషయం కాదు. పంట పండించేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆ పంట ఇంటికి వచ్చే వరకు కూడా ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఖర్చు, కూలీల కొరత, గిట్టుబాటు ధర ఈ మూడే నేటి తరం రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు. వీటి కారణంగానే రైతు వ్యవసాయానికి దూరం అవుతూ వస్తున్నాడు. అందుకే ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకెళ్తోంది కూలీల, ఖర్చులు తగ్గించేందుకు ప్లాన్స్ వేస్తోంది. అందులో భాగంగా ఎరువులు పిచికారీ చేయడం లాంటి పనులు చేసే కూలీలు దొరకడం కష్టం. రోజుల తరబడి చేయించాల్సి ఉంటుంది. ఇలాంటి వాటికే కనిపించకుండానే ఖర్చు ఎక్కువ అవుతుంది. అందులో వీటి వాడకం కూడా మోతాదుకు మించడమో లేకపోతే తగ్గడమో జరుగుతుంది. ఇలాంటి బెడద లేకుండా ఉండేందుకు ప్రభుత్వం డ్రోన్‌లను రంగంలోకి దించుతోంది. ప్రతి గ్రామంలో వ్యవసాయ పనులకు డ్రోన్స్ వినియోగించేలా ప్రయత్నాలు ప్రారంభించిది. ఈ బాధ్యతను డ్వాక్రా సంఘాలకు ఇవ్వబోతోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నమో డ్రోన్ దీదీ కార్యక్రమాన్ని పక్కగా అమలు చేయాలని భావిస్తోంది. దీని కోసం డ్వాక్రా సంఘాల్లోని మహిళలను ఎంపిక చేసి డ్రోన్ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు లబ్దిదారులను ఎంపిక చేయాలని డీఆర్డీఏ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇలా ఎంపికైన వారికి రాయితీపై డ్రోన్లు సరఫరా చేయనుంది. ఈ సీజన్ నుంచే డ్రోన్లు మంజూరు చేసే అవకాశముందని తెలుస్తోంది. దీని ద్వారా మహిళలకు జీవనోపాదితోపాటు రైతుల ఖర్చులు కూడా తగ్గుతాయని అంటున్నారు. అంతే కాకుండా మందులు పిచికారీ చేసేటప్పుడు కూలీలు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. వాటి బారి నుంచి కూడా రక్షించుకోవచ్చు. కొన్నిసార్లు ఏపుగా పెరిగిన చేల్లోకి రైతులు, కూలీలు వెళ్లి మందులు చేయడం కష్టంతో కూడుకున్న పని. పంట కూడా నాశనం అవుతుంది. డ్రోన్లతో సులభంగా పని పూర్తి చేయవచ్చు. ఎంపిక చేసిన మహిళలకు 15 రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఒకరికి రిమోట్ పైలట్‌గా ట్రైనింగ్ ఇస్తే... ఆ కుటుంబంలోనే మరొకరికి ఫిటింగ్, మెకానికల్, మరమ్మతులపై శిక్షణ ఇస్తారు. వారిని డ్రోన్ అసిస్టెంట్ అంటారు. వాళ్లకు ఐదు రోజులు ట్రైనింగ్ ఇస్తారు. ఇలా శిక్షణ తీసుకున్న వాళ్లకు సర్టిఫికేట్స్ కూడా ఇస్తారు. గ్రామంలోని వ్యవసాయ పనులకు ఉపయోగపడేలా వారిని తీర్చిదిద్దుతారు. శిక్షణ పొందిన వాళ్లకు 10 లక్షల విలువ చేసే డ్రోన్‌ను అందిస్తారు. ఇందులో 80 శాతం రాయితీ ఇస్తారు. అంటే లబ్ధిదారులు 2 లక్షలు చెల్లిస్తే మిగతా 8 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. పొలంలో మందులు, ఎరువులు పిచికారీ చేయడం, డ్రోన్లకు అమర్చే కెమెరాలతో ఫొటోలు తీయడం, చీడపీడలను గుర్తించడంపై శిక్షణ ఇస్తారు. ఆ ఫొటోలను వ్యవసాయ అధికారులకు పంపించి సూచనలు తీసుకునేలా వారికి ట్రైనింగ్ ఉంటుంది.

## మైండ్ స్పేస్ బిల్డింగ్ పై నుండి దూకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

హైదరాబాద్

– మాదాపూర్లో నవీన్ రెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మైండ్ స్పేస్ 13వ అంతస్తు పైనుంచి దూకేశాడు.

ఈ క్రమంలో అతడు అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు.. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్నపోలీసులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది

## రామ్ చరణ్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలి అయ్యప్ప జేఏసీ

హైదరాబాదం?

నటుడు రామ్ చరణ్ వేంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని తెలంగాణ అయ్యప్ప జేఏసీ డిమాండ్ చేసింది. అయ్యప్ప మాలలో ఉండి దర్గాకు ఎలా వెళ్తారు ? ఏ ఆర్ రెహమాన్ కుట్ర పూర్వకంగానే రామ్ చరణ్ ని దర్గాకు వెళ్లమన్నారు. రామ్ చరణ్ రెహమాన్ ని కూడా తిరుపతి, శబరి లకు తీసుకరాగలరా ? ఒకపక్క పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం గురించి పోరాడుతుంటే ఇంకోపక్క వాళ్ల అబ్బాయి అయ్యప్ప మాలలో దర్గాకు వెళ్ళాడు. రామ్ చరణ్ నుంచి సమాధానం కోసం నాలుగైదు రోజులు ఎదురు చూస్తాం. ఎలాంటి స్పందన లేకపోతే మా ఆందోళనను ఉధృతం చేస్తామని తెలంగాణ అయ్యప్ప జేఏసీ హెచ్చరించింది.

## డేటా సెంటర్ రాజధానిగా విశాఖపట్నం

అమరావతి

రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు ప్రయత్నిస్తున్నాం. విశాఖను డేటా సెంటర్ రాజధానిగా చేస్తామని మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖలో భారీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తాం భోగాపురం ఎయిర్ పోర్టు పనుల్ని పరిగెత్తిస్తున్నాం. విశాఖకు వేలాది వస్తేనే ఎకో సిస్టం ఉంటుంది ఐటీ కంపెనీలతో చర్చలు జరుపుతున్నమని అన్నారు.

## గత ప్రభుత్వంలో ఐటి కంపెనీల్లో కూడా వాటాలు అడిగారు! నారా లోకేష్

అమరావతి:: గత ప్రభుత్వంలో కొందరు ఐటి కంపెనీల్లో కూడా వాటాలు అడగడంతో వారు రాష్ట్రం విడిచి వెళ్లిపోయారని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో ఐటి పరిశ్రమ అభివృద్ధిపై శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, ఈశ్వరరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... రాష్ట్ర విభజన తర్వాత ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ అనే నినాదంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్లారు. అందులో భాగంగా విశాఖలో ఐటి పరిశ్రమ అభివృద్ధికి కృషిచేశారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ఐటిరంగంలో 20శాతం మంది తెలుగువారు ఉండటం హర్షణీయం. 2014-19 నడుమ రాష్ట్రానికి దాదాపు 150 కంపెనీలు రావడంతో 50వేలమందికి ఉపాధి లభించింది. డాటా సెంటర్ ను రప్పించేందుకు అప్పట్లో అదానీతో ఒప్పందం చేసుకున్నాం. విశాఖలో ఐటి రంగం ప్రముఖులతో కాంక్లేవ్ పెట్టాం. ఐటి రంగంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న తరుణంలో గత ప్రభుత్వం చర్యలతో బ్రేక్ పడింది. గతప్రభుత్వంలో ఒక మంత్రి కోడిగుడ్డు కథలతో రాష్ట్రాన్ని నవ్వుల పాల్జేశారు. ఇదివరకెన్నడూ లేనివిధంగా ఐటి కంపెనీల్లో వాటాలడిగారు. నాటి ప్రభుత్వ అనాలోచిత చర్యలతో నిక్సీ, ఎస్ టిబిఐ వెళ్లిపోయాయి. ఫలితంగా ఏపి యువత నష్టపోయింది. గత అయిదునెలల్లో ఐటి కంపెనీలు, ఐటా ప్రతినిధులతో మాట్లాడాను. తమ కృషి ఫలితంగా త్వరలో విశాఖకు టిసిఎస్ రాబోతోంది. మూడునెలల్లో టిసిఎస్ విశాఖలో టిసిఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. దీంతోపాటు విశాఖలో క్యాంపస్ ఏర్పాటుకు కూడా వారు ఒప్పుకున్నారు.

# రా సామి... సభకు రా... కేసీఆర్ ఇగో టచ్ చేసే పనిలో రేవంత్

వరంగల్, నవంబర్ 21

మొన్నటి వరకు గులాబీ దళపతి మౌనం తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా కొనసాగింది. ఇప్పుడు సీఎం రేవంత్ బరస్ట్ అవడం టాక్ ఆఫ్ ది పాలిటిక్స్‌గా మారుతోంది. ఏడాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తోన్న సభల్లో..బీఆర్ఎస్ అధినేతను టార్గెట్ చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఏకంగా కేసీఆర్ అనే మొక్కను మళ్లీ మొలవనివ్వంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తానని చెప్పి ఓడించా..పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా సీట్లే అని చెప్పా.. చేసి చూపించా..మళ్లీ చెప్తున్నా బీఆర్ఎస్ అనే మొక్కను మళ్లీ మొలకెత్తనివ్వను రాసి పెట్టుకోండి అంటూ సవాల్ చేస్తున్నారు రేవంత్. అంతేకాదు దమ్ముంటే అసెంబ్లీకి రావాలంటూ గులాబీ దళపతి ఇగోను టచ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు సీఎం.మౌనంగా ఫామ్ హౌస్‌లో పడుకుంటే నీ సంగతి తేలవదనుకోకు..నీ ముందు తెలుసు..నీ వెనక తెలుసు..నీ ఉపాయం తెలుసు..ఉబలాటం తెలుసు అంటున్నారు రేవంత్. మొన్నటి వరకు కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్ అన్న రేవంత్..ఇప్పుడు ఒక్కసారిగా బీఆర్ఎస్ అధినేత టార్గెట్ చేసి మాట్లాడటం హాట్ టాపిక్ అవుతోంది. అయితే కొన్నాళ్లుగా కేసీఆర్ మౌనంగా ఉంటున్నారు. అవసరమనిపిస్తే పార్టీ నేతలను ఫాంహౌస్‌కు పిలిచి మాట్లాడుతున్నారు.ఈ మధ్యే పాలకుర్తి నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడిన గులాబీ బాస్ ఎక్కడా రేవంత్ పేరు ప్రస్తావించలేదు. ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది.. ఫ్యూచర్ అంతా బీఆర్ఎస్‌దేనని చెప్పారు కేసీఆర్. రేవంత్ మాత్రం కేసీఆర్ చేసిన కామెంట్స్‌ను ప్రస్తావిస్తూ తెలంగాణ ఏం కోల్పోయిందో చెప్పాలంటూనే..పర్సనల్ అటాకింగ్‌కు దిగుతున్నారు. దమ్ముంటే అసెంబ్లీకి రా అని సవాల్ చేయడం వెనక..కేసీఆర్‌ను రెచ్చగొట్టే ఎత్తుగడ ఉందన్న చర్చ జరుగుతోంది.వరంగల్ సభలో రేవంత్ చేసిన నాలుగు కామెంట్స్ చాలా ఇంట్రెస్టింగ్‌గా మారాయి. ఫాంహౌస్‌లో మౌనంగా పడుకుంటే



నీ సంగతి తెల్వదనుకోకు..నీ ముందు తెలుసు.. వెనక తెలుసు..నీ ఉపాయం, ఉబలాటం తెలుసు అన్నారు. కేసీఆర్ ఉపాయానికి తన దగ్గర విరుగుడు కూడా ఉందంటున్నారు రేవంత్. అసలు కేసీఆర్ ఫాంహౌస్‌లో ఏం చేస్తున్నారు? ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. అందరు అనుకుంటున్నట్లే మౌనంగా ఉంటూ కేసీఆర్ తన పని తాను చేసుకుంటూ పోతున్నారా? కేసీఆర్ చేస్తున్న ఉపాయం ఏంటి? రేవంత్ మాటల్లో అర్థమేంటి.? ఇదే ఇప్పుడు తెలంగాణ గడ్డ మీద హాట్ టాపిక్‌గా మారింది.ఇంతకీ కేసీఆర్ ఏం ప్లాన్ చేస్తున్నట్లు? గులాబీ దళపతి వ్యూహరచనేంటి? కేసీఆర్ వేస్తున్న ప్లాన్ ఏంటో రేవంత్‌కు తెలిసిపోయిందా? అందుకే అంతా తెలుసు..నీ ఉపాయానికి విరుగుడు ఉందంటున్నారా? అసలేం జరుగుతోందనేది ఆసక్తికరంగా మారింది. ఇంతకీ కేసీఆర్ ఏం ప్లాన్ చేస్తున్నారు? దానికి రేవంత్ దగ్గర ఉన్న విరుగుడు ఏంటిది? ఇదే ఇప్పుడు టాక్ ఆఫ్ తెలంగాణ పాలిటిక్స్‌గా మారింది. రేవంత్ దగ్గర ఉన్న విరుగుడు అరెస్టులేనా? అనేది కూడా డిస్కషన్ పాయింట్ అవుతోంది.కేసీఆర్ సైలెంట్‌గా ఉండటంపై తెలంగాణ ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. అయితే ప్రభుత్వానికి ఏడాది సమయం ఇవ్వాలనే గులాబీ బాస్ సైలెంట్‌గా ఉంటున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కానీ రేవంత్ మాటలను బట్టి చూస్తుంటే కేసీఆర్ మౌనం వెనక ఏదో ఉందన్న చర్చ తెరపైకి వస్తోంది. అంతేకాదు కేసీఆర్ తన పేరు ప్రస్తావించకుండా విమర్శించడం..ఫాంహౌస్‌లో ఉండే వ్యూహరచణ చేసస్తూ ప్రభుత్వంపై వ్యతిరేకత సృష్టిస్తున్నారని రేవంత్ ఆగ్రహంతో రగిలిపోతున్నారట. అందుకే అసెంబ్లీకి రావాలంటూ సవాల్ చేస్తున్నారట. కేసీఆర్ బయటికి వచ్చి తన పేరు ప్రస్తావించి మాట్లాడినా..లేక అసెంబ్లీకి వచ్చినా బీఆర్ఎస్ హయాంలో అక్రమాలు చేశారంటూ కార్నర్ చేసి ఆయనను సైలెంట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట.ఎంతసేపు తాను కేసీఆర్ మీద మాట్లాడుతుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని..కేసీఆర్ తనను విమర్శిస్తే ఆయన మీద మరింత అగ్రెసివ్‌గా కామెంట్స్ చేయొచ్చని రేవంత్ భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ మాత్రం రేవంత్‌కు కౌంటర్ ఇవ్వడానికి కేటీఆర్, హరీశ్ ఇద్దరూ చాలంటోంది. రేవంత్ అయితే కేసీఆర్‌నే టార్గెట్ చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే రెచ్చగొట్టి గులాబీ బాస్‌ను ప్రజల్లోకి తీసుకొచ్చే ప్లాన్ జరుగుతోందన్న టాక్ వినిపిస్తోంది. కేసీఆర్ మౌనాన్ని బద్దలు చేయాలని..ఆయన ఏదో ప్లాన్ చేస్తున్నారన్న చర్చకు ఎండ్ కార్డ్ వేయాలని అనుకుంటున్నారట రేవంత్. అందుకే కేసీఆర్ ఇగోను టచ్ చేసేలా మాట్లాడుతున్నారని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు.తన మాటలకు కేసీఆర్ రియాక్ట్ అయి అసెంబ్లీకి వస్తే..పొలిటికల్ సినారియోను తనకు అడ్వాంటేజ్‌గా మార్చుకోవచ్చనేది రేవంత్ ప్లాన్ అంటున్నారు. మరి రేవంత్ సవాల్‌ను స్వీకరించి కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా..పోనీ రేవంత్ కామెంట్స్ మీద కేసీఆర్ రియాక్ట్ అయినా అవుతారా అనేది అంటే డౌటే అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. రేవంత్ రెచ్చగొడితే కేసీఆర్ బయటికి వస్తారా లేక ఎప్పుడు మౌనం వీడాలో తనకు తానే నిర్ణయించుకుని బయటికి వస్తారా అనేది చర్చనీయాంశం అవుతోంది. సీఎం, మాజీ సీఎం ఎత్తుగడల్లో ఎవరు పైచేయి సాధిస్తారనే కూడా టైమే డిసైడ్ చేయనుంది.

# దుర్గంధ మయంగా ములుగు గ్రామపంచాయతీ పరిధి

## - కంపుతో ముక్కు మూసుకుంటున్న ప్రయాణికులు

## - పట్టించుకోని సంబంధిత అధికారులు








ములుగు జిల్లా ప్రతినిధి,నవంబర్ 21(భారత శక్తి):ములుగు జిల్లా కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో దుర్గంధం వెదజల్లుతుంది, దుర్వాసనతో కంపు కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, ప్రజలు అంటున్నారు. అటువైపుగా ప్రయాణించే ప్రయాణికులు, ప్రజలు మాట్లాడుతూ ప్రజల అవసరం కోసం ఎస్బిఐ, కెనరా బ్యాంకులకు, ములుగు గ్రామపంచాయతీ కి వస్తు పోతున్న సందర్భంలో ఇదే ఆవరణలో గ్రామపంచాయతీ ఎదురుగా మూలమలుపు వద్ద ఏర్పాటుచేసిన శ్రీ వెంకటేశ్వర వైన్ షాప్ ఉండటం వలన మందుబాబులు మందు సేవించి బహిరంగ ప్రదేశంలో మలమూత్రాలు విసర్జన చేస్తూ గ్రామపంచాయతీ ఆవరణాన్ని దుర్గాంధంతో కూడిన కంపు వాసన వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. సాయంత్రం ఐదు కాగానే ఈగల వలె దోమలు ఉండి ప్రజలను, ప్రయాణికులను కుట్టడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రజలకు,ప్రయాణికులకు ఇంతటి ఇబ్బందులకు గురి చేస్తూ సంవత్సరం గడిచినప్పటికీ గ్రామ పంచాయతీ ఎదురుగా మూలమలుపు వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర వైన్ షాప్ పై ఏ అధికారి కూడా చర్యలు తీసుకోవడం లేదని, అధికారులు లంచాలకు ఆశపడి వైన్ షాపులు ఇష్టం వచ్చినట్లు ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు గురి చేస్తున్నారనీ, అధికారుల వల్లనే వైన్ షాప్ యజమానులు ఇష్టం వచ్చినట్లు చెలరేగిపోతున్నారని ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకుకు గ్రామపంచాయతీకి రావాలంటే మూతికి మాస్క్ పెట్టుకొని రావాల్సిందేనా.. దీనిపై ఎవరూ చర్యలు తీసుకోరా.. అంటూ కంపు వాసనకు కారణం అవుతున్న బ్రాందీ షాపు నిర్వాహకులపై, పట్టించుకోని అధికారులపై అని ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఆదివారం అంగడి ఉండడంతో మహిళలు సరుకులు తీసుకోవడానికి అంగడికి రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలన యంత్రాంగం పట్టించుకోని ఆ భారీ నుండి మమ్మల కాపాడాలని స్థానికులు ప్రయాణికులు కోరుతున్నారు.

వైన్ షాపుకు నోటీసులు జారీ చేస్తాం పంచాయతీ కార్యదర్శి రఘు:

గ్రామపంచాయతీ ఆవరణలో మందుబాబుల వల్ల దుర్వాసన రావడం నిజమేనని, దుర్వాసన వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దానిపై ప్రతిరోజు సఫాయి కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. దుర్వాసన మాత్రం పోవటం లేదని ములుగు గ్రామపంచాయతీ కార్యదర్శి పి.రఘు తెలిపారు. దీనిపై వైన్ షాప్ యజమానికి నోటీసులు జారీ చేస్తామని అన్నారు.

వామ్మో కంపు..భరించలేని దుర్వాసన..

రోగాలు రావాలంటే.. గ్రామపంచాయతీ వద్దకు రావాల్సిందే..

ప్రయాణికుడు ఎస్ సారయ్య:

గురువారం ఎస్బిఐ, బ్యాంకు సేవలకు రావడం జరిగిందని, ఇక్కడికి రావడంతోటే వామ్మో కంపు కంపు దుర్వాసన భరించలేక వాంతి చేసుకునే పరిస్థితి ఎదురైందనీ, ఇంత దుర్వాసన ఏ గ్రామంలో కూడా చూడలేదని ప్రయాణికుడు సారయ్య తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోలేకపోతే ప్రయాణికులకు, ప్రజలకు విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉంటాయని, ఎక్కడలేని దుర్వాసన ఈ వైన్ షాపు వద్దనే వస్తుందని ప్రయాణికుడు వాపోయాడు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

# రాజంపేట సబ్ జైలు మరియు బద్వేల్ సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లు విజిట్:ఎస్.బాబా ఫక్రుద్దీన్





కడప, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప శ్రీమతి జి శ్రీదేవి వారి సూచనల మేరకు సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాజంపేట సబ్ జైలు మరియు బద్వేల్ సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మధురగ అంశాలను వివరించారు.

ఏవైనా సమస్యలుంటే రాజంపేట మరియు బద్వేలు మండల న్యాయ సమితులను మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించవచ్చు అన్నారు.

ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ జైలు మరియు బద్వేల్ సబ్ జైలు సూపరిండెంట్లు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన కార్యవర్గం ఎన్నిక



హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)నవంబర్21:తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టి జి ఓ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల నూతన కార్యవర్గ సభ్యులను గురువారం హనుమకొండ ఐడిఓసి ప్రాంగణంలోని టీజీవో భవన్లో జరిగింది.ఈ సమావేశానికి టీజీవో సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీ జాక్ సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ సహా అధ్యక్షులు బి శ్యామ్ ఉపాధ్యక్షులు,ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఏ జగన్మోహన్రావు, కోశాధికారి ఎం ఉపేందర్ రెడ్డి, దీపా రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .రెండు జిల్లాల నూతన కమిటీల ఎన్నికలు నిర్వహించుటకు ఎన్నికల అధికారులుగా ఉపేందర్ రెడ్డి, ఈగ వెంకటేశ్వర్లు, హనుమకొండ జిల్లాకు మురళీధర్ రెడ్డి, నాగ నారాయణ,వరంగల్ జిల్లాకు వ్యవహరించారు ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీలను వారు ప్రకటించారు నూతనంగా ఎన్నికైన రెండు జిల్లాల కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘ బలోపేతానికి అందరూ సభ్యులు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లకు సవాలక్ష అడ్డంకులు..

నల్గొండ, నవంబర్ 21,

రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు ముక్తకంఠంతో ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అనుకూలంగా లేదు.తెలంగాణలో అత్యధిక వరి ధాన్యం దిగుబడి వచ్చే నల్గొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సమస్యాత్మకంగా మారింది.అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు ఎన్ని భరోసా మాటలు చెప్పినా ప్రయోజనం కనిపించడం లేదు.ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 12.79 లక్షల ఎకరాల్లో సన్న, దొడ్డు రకం వరి ధాన్యం పండించారు. దీనిద్వారా 29.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి మార్కెటింగ్, ఐకేపీ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ల ఆధ్వర్యంలో 870 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఇవే కాకుండా మిల్లర్లు కూడా రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేశారు. అయితే, పంటల దిగుబడులు రావడం మొదలైన రోజు నుంచీ ప్రభుత్వానికి, రైస్ మిల్లర్ల మధ్య పేచీ నడిచింది. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లర్లకు ఇస్తుంది. మిల్లర్లు ఆ ధాన్యాన్ని బియ్యం పట్టి తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాలి. ఈ బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా రేషన్ దుకాణాల ద్వారా అర్హులకు విక్రయిస్తారు.కస్టమ్ మిల్లింగ్ కోసం ప్రభుత్వం ధాన్యం ఇవ్వాలంటే మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలని ప్రభుత్వం నిబంధనలు



విధించడంతో మిల్లర్లు ససేమిరా అన్నారు. ఫలితంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. అక్టోబరు 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జీవో 27 ప్రకారం ధాన్యం కొనుగోళ్ల పాలసీని ప్రకటించింది.ఈ పాలసీని మిల్లర్లు వ్యతిరేకించడంతో కొనుగోళ్లు పెండింగ్ లో పడ్డాయి. ఈ లోగా రైతుల నుంచి మిల్లర్లు సన్న రకం ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయడం మొదలు పెట్టారు. ధాన్యం తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేస్తుండడంతో మిల్లర్లు చెప్పిన ధరలకే విక్రయించుకోక రైతులకు తప్పడం లేదు. ఫలితంగా వీరికి గిట్టుబాటు ధర లభించలేదు. చివరకు మిల్లర్లకు, ప్రభుత్వానికి మధ్య బ్యాంకు గ్యారెంటీల విషయంలో రాజీ కుదిరినా ఇంకా ధాన్యం కేంద్రాల్లో రైతులు పడిగాపులు గాస్తూనే ఉన్నారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రధానంగా నల్గొండ జిల్లాలో వరి సాగు చేసే ఆయకట్టు ఎక్కువగా ఉంది. నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతం ఎక్కువగా ఉండడంతో వరి ధాన్యం దిగుబడులు కూడా ఎక్కువే. జిల్లా పరిధిలోని నల్గొండ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లో ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. మరో వైపు సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని మిర్యాలగూడ, నాగార్జున సాగర్ నియోజకవర్గాలతో పాటు, దేవరకొండ నియోజకవర్గంలో ఇంకా కోతలు పూర్తి కాలేదు.అత్యధిక రైస్ మిల్లులు ఉన్నది కూడా ఈ ప్రాంతంలోనే. మిర్యాలగూడ, నాగార్జున సాగర్ నియోజకవర్గాల పరిధిలోని రైతులు సన్న రకం వరి సాగు చేస్తుండగా, మిగిలిన నియోజకవర్గాల్లో దొడ్డు రకం వరి సాగవుతోంది. కాగా, జిల్లాలో 5.19 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేయగా, 12.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. దీనికోసం 340 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ సారి జిల్లాలో 7.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఇప్పటి వరకు కేవలం 1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇంకా 68వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులు ఉన్నాయని తాజా గణాంకాలు చెబుతున్నాయి. మిర్యాలగూడ, నాగార్జున సాగర్ నియోజకవర్గాల్లో కోతలు ఇంకా 40 శాతం పూర్తి కావాల్సి ఉంది.అంటే, ఇంకా నలభై శాతం వరి ధాన్యం దిగుబడులు రావాల్సి ఉంది. నిర్దేశించుకున్న లక్ష్యానికి, ఇప్పటి వరకు సాధించిన లక్ష్యానికి పొంతన లేకుండా ఉంది. వివిధ కారణాల వల్ల వరి పండిస్తున్న రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలపై, లేదంటే మిలర్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది.

# విద్యార్థి హత్య

హైదరాబాద్

సంతోష్ నగర్ పీఎస్ పరిధిలోని బర్హానా షా సాహబ్ దర్గా కమాన్ పరిధిలోని ఓవైసీ కాలనీ లో విద్యార్థి మోహీద్ (18) ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. విషయాన్నీ తెలుసుకున్న పోలీసులు.. ఆ తరవాత సంఘటన స్థలం చేరుకున్నారు. పోలీసులు సాజిద్ ని ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో మృతి చెందాడు.

అయితే ఈ హత్యకి గల కారణాలు పాతకక్షలుగా ప్రాథమిక అంచనాగా పేర్కొన్నారు పోలీసులు.ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి సిద్దక్ కోసం పోలీసులు వెతుకుతు న్నారు. కేసుకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హత్య కి గల కారణాలు అక్రమ సంబంధంగా మరో ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం.

# సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, నవంబర్ 21: సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా ఎంట్రీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం సదాశివనగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంను సందర్శించారు. అక్కడ సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ తీరును పరిశీలించారు. ప్రతీ వ్యక్తి, ప్రతీ అంశంకు సంబంధించిన సేకరించిన వివరాలు పక్కాగా డాటా ఎంట్రీ చేయాలని అన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ఒకటికి, రెండు సార్లు పరిశీలించి నమోదు చేయాలని ఆపరేటర్లకు తెలిపారు. డాటా ఎంట్రీ లను సంబంధిత అధికారులు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, జడ్పీ సీఈవో చందర్, జిల్లా పంచాయతీ అధికారి,



మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ నిర్మూలనకు మొదటి ప్రాధాన్యత

## పట్టభద్రుల ప్రతినిధిగా మండలిలో సమస్యలు పరిష్కరిస్తా

## ఆర్మూరు పట్టణంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం



కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 21(భారత శక్తి):రానున్న పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే నిరుద్యోగ నిర్మూలనకు మొదటి ప్రధాన్యతను ఇస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్పష్టం చేసారు.గురువారం ఆర్మూర్ పట్టణంలో పలువురు పట్టభద్రులను, న్యాయవాదులను కలసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు పలుకలాని కోరారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చాలాచోట్ల కోర్టులకు పక్క భవనాలు లేక, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని,తాను ఎమ్మెల్సీగా గెలిచిన తరువాత అన్ని కోర్టులకు పక్క భవనాలను నియమిస్తామని అన్నారు.న్యాయవాద వృత్తి లోకి కొత్తగా వస్తున్న యువ న్యాయవాదులకు 5వేల గౌరవ వేతనం తో పాటు,న్యాయవాదుల ప్రధాన డిమాండ్ అయిన అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుతో పాటు, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇప్పించెందుకు కృషి చేస్తానని అన్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా 317 జీవో ద్వారా ఎంతోమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి స్థానికతను దృష్టిలో ఉంచుకొని సొంత జిల్లాలకు బదిలీ అయ్యేవిధంగా కృషిచేసి వారికి బాసటగా నిలుస్తానని వెల్లడించారు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ బేసిక్, అవుట్ సోర్సింగ్, గెస్ట్ లెక్షరర్లకు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 010 పద్దు ద్వారా వేతనాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టిన జాబు క్యాలెండర్ అమలు అయ్యేవిధంగా కృషి చేస్తానని,ప్రభుత్వంలోని వివిధ రంగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తానని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులతో పాటు, మినిమమ్ బేసిక్ శాలరీ అందించేందుకు కృషిచేస్తానని అన్నారు.ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాల యాజమాన్యానికి గత కొన్ని నెలలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదలకు సహకరిస్తానని అన్నారు. ఓటు నమోదు చేసుకొని పట్టభద్రులకు కోసం నవంబర్ 23 నుండి డిసెంబర్ 09 వరకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించిందని,ప్రతి పట్టభద్రుడు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే పట్టభద్రుల ప్రతినిధిగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

# స్థానిక సంస్థలలో మేదరులకు రిజర్వేషన్ కల్పించాలి:మేదరుల డిమాండ్

భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, నవంబర్ 21:రాజకీయ,సామాజిక, విద్య,వైద్య పరంగా చాలా వెనుకబడి ప్రజా ప్రతినిధులుగా ఏ చిన్నా చితక పదవిని పొందకుండా బిసి(ఎ)లో కొనసాగుతున్న మేదరులకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించాలని,బి.సి డెడికేటెడ్ కమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ విచారణకు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హనుమకొండ జిల్లా మేదరి సంఘం పక్షాన హాజరై వినతిపత్రం ఇచ్చి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారులు మస్న బిక్షపతి,జిల్లా ఉపాధ్యక్షులు,చిలువేరు సురేందర్,కోరుట్ల



రమేష్, జిల్లా సహాయ ప్రచార కార్యదర్శి ప్రతాపగిరి వెంకట రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలకు ప్రభుత్వం పెంచిన మెనూ అమలు చేయడం హర్షనీయం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవ రత్న అవార్డు గ్రహీత మొగురం రమేష్

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 21(భారత శక్తి):ఎస్సీ గురుకులాలు,బి సి , గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెనూ అమలవుతున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవ రత్న పురస్కార్ అవార్డు గ్రహీత , ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మొగురం రమేష్ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 16 ఏండ్లు గా ప్రభుత్వాలు గురుకుల హాస్టల్స్, సంక్షేమ హాస్టల్లకు సంబంధించిన మెనూ పెంచలేదన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పెంచడం చాలా హర్షనీయమన్నారు. పెంచిన మెనూ ను అమలు చేయిస్తున్న ముఖ్యమంత్రి కి , డిప్యూటీ సీఎం కు తల్లిదండ్రులము రుణపడి ఉంటామన్నారు.

# కవులను సన్మానించిన గ్రంథాలయ సిబ్బంది










ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్21 (భారత శక్తి):57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం లో కవులు విని కవితలకు ప్రేక్షకులు అలరించి ఆనంద డోలికల్లో మునిగితేలారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనంలో అల్లరించిన కవులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు సన్మానం నిర్వహించారు. కవులను శాలువాతో సన్మానించి ప్రశంస పత్రాన్ని అందించారు.

ఈ కార్యక్రమంలో కవులు దుర్గం సూరయ్య, సదానందం, కొండ్లె శ్రీనివాస్ , చల్లగురుగుల రాజు వర్ధన్, ఇల్లందుల లెనిన్, కుమారస్వామి హమీద్ బైకని రాజు, కార్యదర్శి ఎం.అలివేలు సీనియర్ అసిస్టెంట్ ఎస్. నిఖిల్, గ్రంధ పాలకులు బి.సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉమ్మినేని కృష్ణ జన్మదిన వేడుకలు

## -పొంగులేటి వీరాభిమానిగా పొంగులేటి నమ్మకస్తుడిగా జిల్లాలో మంచి పేరు ఉన్న ఉమ్మినేని కృష్ణ



ఖమ్మం బ్యూరో, (భారత శక్తి) నవంబర్ 21: బోనకల్ మండలం గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన ఉమ్మినేని కృష్ణ జన్మదిన వేడుకలు రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.

మండల స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీలో నమ్మకస్తుడిగా పనిచేసిన ఉమ్మినేని కృష్ణ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అనుచరుల్లో ఒకరిగా జిల్లా వ్యాప్తంగా సుపరిచితులు. ఈయన జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మరియు పొంగులేటి కార్యాలయంలో అట్టహాసంగా ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి జన్మదిన వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, డివియల్ కరాటే వేణు, హెచ్ గురుమూర్తి, పొంగులేటి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుల సర్వే రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి, డాటా ఎంట్రీ ప్రారంభించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, నవంబర్ 21: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే రానున్న రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి, డాటా ఎంట్రీ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుండి మండల ప్రజా పరిషత్, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటి సమగ్ర సర్వే పనులు ఎన్యుమరేషన్ బ్లాక్ వారీగా పూర్తి చేయాలని, అదేవిధంగా సేకరించిన వివరాల ఫారాలను ట్రంక్ పెట్టెల్లో భద్రపరచాలని, డాటా నమోదు ప్రారంభించాలని తెలిపారు. అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్ లను, వారికి సహాయకులను నియమించుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 11 మండలాల్లో వంద శాతం ఎన్యుమరేషన్ పూర్తయిందని, మిగతా మండలాల్లో రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. పూర్తి చేసిన ఎన్యుమరేషన్ వివరాలను డేటా ఎంట్రీ చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 96.3 శాతం ఇన్యుమరేషన్ పూర్తయిందని తెలిపారు. డేటా ఎంట్రీ భద్రంగా తప్పులు లేకుండా నిర్వహించాలని తెలిపారు. ఎంపీడీఓ లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత ఇన్యుమరేషన్ బ్లాక్ వారీగా నిర్ణీత ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు.ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం క్రింద తహసీల్దార్లు





అందిన ఫారం 6,7,8 లను పరిశీలించాలని తెలిపారు. తహసిల్దార్ లాగిన్ లో ఉన్న వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వి. విక్టర్, ఆర్డీఓ రంగనాథ్ రావు, సీపీఓ రాజారాం, మండల ప్రత్యేక అధికారులు వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓ లు, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ఉద్భవించిందే డీజేయు

## డీజేయు ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా వేదికగా

## జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

## ఇళ్లు, ఇళ్ల స్థలాలు సాధనే ధ్యేయంగా అడుగు ముందుకు వేస్తున్నాం

## జర్నలిస్టుల హక్కుల సాధనకు ప్రత్యేక ఉద్యమం

## డిజేయు జాతీయ కన్వీనర్ బి. లక్ష్మీనర్సింహా





భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21 (భారతశక్తి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి డీజేయు యూనియన్ కృషి చేస్తుందని సీనియర్ పాత్రికేయులు సీమకుర్తి రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెం టిఎస్ యూటిఎఫ్ కార్యాలయంలో సీమకుర్తి రామకృష్ణ అధ్యక్షతన కో-ఆర్డినేటర్స్ చెంగపోగు సైదులు, అఫ్జల్ పఠాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డెమొక్రటిక్ జర్నలిస్ట్ యూనియన్(డిజేయు) జాతీయ కన్వీనర్ లక్ష్మీ నరసింహ మాట్లాడుతు జర్నలిస్టుల నైపుణ్యతను వెలికి తీసేందుకు డీజేయు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా త్వరలోనే ఏర్పాటు చేస్తామని, జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన లక్ష్యంగా అడుగు ముందుకు వేస్తున్నామన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేసేందుకు డీజేయు సిద్ధంగా ఉందన్నారు. గతంలో జర్నలిస్టుల కోసం పనిచేసిన యూనియన్లు కాలయాపన చేస్తూ సంక్షేమాన్ని వీడిందని దీన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల కోసం డీజే యు ఉద్భవించింది అన్నారు. జర్నలిస్టులకు అవసరమైన ఇల్లు ఇళ్ల స్థలాలు సాధించేందుకు అర్హతలు బట్టి అక్రిడేషన్ కార్డుల మంజూరు, ప్రత్యేక శిక్షణ తరగతులు, తదితరవి ప్రణాళిక బద్ధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో డీజే యు ఆధ్వర్యంలో నిర్వహించనున్నామన్నారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి పని చేసే యూనియన్లను నమ్ముకోవాలని పిలుపునిచ్చారు. ఏ ఒక్కరి స్వలాభం కోసమో స్వార్థం కోసమో డీజే యు ఏర్పాటు జరగలేదని దేశవ్యాప్తంగా జర్నలిజం లో ఎంతో అనుభవం ఉన్న మేధావుల రూపకల్పనే డీజేయు అన్నారు. ప్రధానంగా దేశంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడిని ఎదుర్కొనేందుకు చట్టపరిధిలో పోరాడి ప్రత్యేక చట్టం తెచ్చేందుకు డీజేయు కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. యూనియన్ లో సభ్యత్వం ఉన్న పాత్రికేయులు ఆకస్మికంగా మరణిస్తే యూనియన్ నుండి 50 వేల రూపాయలను కుటుంబానికి అందివ్వడం జరుగుతుందని , ప్రమాదవశాత్తు యాక్సిడెంట్లో అంగవైకల్యం చెందిన జర్నలిస్టులకు ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయలను సహాయం చేస్తుందని, ఆడపిల్ల కళ్యాణ నిమిత్తం 2 లక్షల రూపాయలను డిజెయు యూనియన్ అందిస్తుందని, డిజెయు యూనియన్ నుండి 15 లక్షల హెల్త్ భీమా అందివ్వడం జరుగుతుందన్నారు. సభ్యులకు అన్ని వేళలా యూనియన్ నాయకులు అందుబాటులో ఉంటు వృత్తిపరమైన సహాయ సహకారలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, మౌలాలి, లక్ష్మణ్ రావు, కృష్ణ, వెంకట్, వినోద్, సతీష్, హనుమంత్, శివ రామకృష్ణ, కవటం శ్రీనివాస్, ఉమాకాంత్, సురేష్, కంచు శ్రీనివాస్, ప్రసాద్, సురేందర్, అజ్మత్, ఇమాన్యూల్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్ ...

న్యూఢిల్లీ, నవంబర్21,

ప్రస్తుతం ఢిల్లీ గ్యాస్ ఛాంబర్ గా మారిపోయింది. ఈ రోజుల్లో దేశ రాజధానిలో గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉంది. గురువారం ఉదయం 7 గంటలకు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 500 కంటే ఎక్కువ నమోదైంది. ఈ రోజుల్లో ఢిల్లీలోని చాలా ప్రాంతాల పరిస్థితి ఇదే. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా ఢిల్లీ కాలుష్యంపై ఓ కన్నేసి ఉంచింది. మరోవైపు కృత్రిమ వర్షం కోసం ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. నగర కాలుష్యంపై గోపాల్ రాయ్ మాట్లాడుతూ ఉత్తర భారతదేశం ప్రస్తుతం పొగ పొరలతో కప్పబడి ఉందని అన్నారు. ఈ పొగమంచు నుంచి బయటపడేందుకు కృత్రిమ వర్షమే ఏకైక పరిష్కారం. ఈ సమయంలో ఢిల్లీలో పరిస్థితిని మెడికల్ ఎమర్జెన్సీగా అభివర్ణించారు. అయితే, ఈలోగా ఈ కృత్రిమ వర్షం ఎలా కురుస్తుంది, దాని కోసం ఎంత ఖర్చవుతుందనేది ఈ వార్తా కథనంలో తెలుసుకుందాం.కృత్రిమ వర్షం అంటే ఏమిటి?క్లౌడ్ సీడింగ్ అని కూడా పిలువబడే నకిలీ వర్షాన్ని మేఘాలలో కృత్రిమంగా వర్షాలు కురిపించే ఒక శాస్త్రీయ ప్రక్రియ. ఈ టెక్నిక్ సహజంగా కురిసే వర్షాన్ని పోలి ఉంటుంది. అయితే ఇందులో వర్షం వచ్చేలా మేఘాలకు కృత్రిమ మూలకాలను జోడిస్తారు

# త్వరలోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

## -ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఘనంగా హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

## -సీనియారిటీ ప్రాధాన్యతతో జర్నలిస్టులకు సభ్యత్వం

## -కోలాహలం నడుమ జర్నలిస్టులకు సభ్యత్వాలు





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 21:ఇళ్ల స్థలాల కోసం గత రెండు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న ఖమ్మం జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు వస్తాయని 'స్తంభాద్రి జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, ఖమ్మం తీపికబురు అందించింది. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సీనియారిటీ ప్రాధాన్యతతో జర్నలిస్టులకు హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా హౌసింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కనకం సైదులు, బొల్లం శ్రీనివాస్ లు మాట్లాడుతూ... 'స్తంభాద్రి జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ నియమ నిబంధనల మేరకు త్వరలోనే వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుత అక్రిడిటేషన్ తో పాటు గత సీనియారిటీని పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. జర్నలిస్టులు సభ్యత్వాలు పొందినప్పటికిని వారిపై ఆరోపణలు వస్తే వాటిని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని, లేనియెడల హౌసింగ్ సొసైటీ కమిటీ అటువంటి సభ్యత్వాన్ని నిర్దాక్షిణ్యంగా రద్దు చేస్తుందని అన్నారు. జర్నలిస్టులు ఐక్యమత్యంతో త్వరగా ఇళ్ల స్థలాలు పొందాలని జర్నలిస్ట్ యూనియన్లు అభిప్రాయబడ్డాయి. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు లు మాట్లాడుతూ... జర్నలిస్టులు తమ హక్కుల కోసం ఐక్యమత్యంతో పోరాడితేనే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో హౌసింగ్ సొసైటీకి మా సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టులు ఎవ్వరూ అపోహలకు పోవద్దని, హౌసింగ్ సొసైటీ నియమ నిబంధనలననుసరించి అర్హత కలిగిన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు న్యాయం జరుగుతుందని అన్నారు. సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాలను నమ్మొద్దని, జర్నలిస్టులు విజ్ఞతతో ఆలోచించి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ సభ్యులు ఏనుగు వెంకటేశ్వరరావు, వెన్నబోయిన సాంబశివరావు, మైసా పాపారావు, బత్తుల వాసు, ఆలస్యం అప్పారావు, మాటేటి వేణుగోపాల్, నర్వనేని వెంకట్రావు, నలజాల వెంకట్రావు, చిర్రా రవి, సత్తుపాటి రామయ్య, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# 100 ఏళ్ళుగా దేశ ప్రజల కోసం నిలబడ్డ పార్టీ సిపిఐ

## పదవ డివిజన్లో పార్టీసభ్యత్వ నమోదు ప్రారంభం



కరీంనగర్ ప్రతినిధి,నవంబర్ 21(భారత శక్తి):భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం 10వ డివిజన్ హనుమాన్ నగర్ లో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పైడిపల్లి రాజు మాట్లాడుతూలి భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని డిసెంబర్ 26 శతాబ్ది ఉత్సవాలకు సన్నదమవుతున్న నేపథ్యంలో శ్రామిక ప్రజల దళిత, బహుజనుల,బడుగు,బలహీన వర్గాల హక్కుల కొరకు సమ సమాజ వ్యవస్థ ఏర్పడాలని సమాజంలో కుల వివక్షత, ఆర్థిక,సాంఘిక, అసమనా తలు తొలగిపోవాలని నిర్విరామ పోరాటాలు చేస్తుందన్నారు. భారతదేశంలో గత వంద సంవత్సరాలుగా పేద ప్రజలకు కార్మికులకు అండగా సిపిఐ నిలబడి పోరాటం చేసిందన్నారు. వందేళ్లలో ఎన్నో చారిత్రాత్మక పోరాటాలు ప్రజల పక్షాన చేసి బూర్జవా కేంద్ర రాష్ట్ర ప్రజా కార్మిక వ్యతిరేక విధానాల్లో అవలంబించినప్పుడల్లా సిపిఐ గా నిలబడి పాలకుల మెడలు వచ్చిందన్నారు. ఈరోజు పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయి అంటే అది సిపిఐ పోరాటం అన్నారు. దేశంలో కోట్లాదిమందికి భూ పోరాట నిర్వహించి భూములు పంచిన చరిత్ర సిపిఐదే అని పేర్కొన్నారు. కార్మిక చట్టాలు ఈరోజు కూడా కొనసాగుతున్నాయి అంటే దాని కారణం ఎర్రజెండా సిపిఐ పోరాట ఫలితమేనని తెలిపారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నవాబుల ను తరిమికొట్టి హైదరాబాద్ రాష్ట్రాన్ని దేశంలో విలీనం చేసిన ఘన చరిత్ర సిపిఐ పార్టీ దని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలో సిపిఐ ప్రజల కోసం నిలబడి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంనిర్వహించి వేలాదిమందిని బలిఇచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి ప్రజలను విముక్తి చేసిందన్నారు. దొర నీ బాంచన్ నీ కాళ్లు మొక్కుతా అన్న నోటినుండి బరిసెలు పట్టి తిరగబడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ నగరంలో సిపిఐ పార్టీ సత్తా చాటాలని దానికి సభ్యత్వాన్ని డివిజన్ లలో చేసి పార్టీ బలోపేతం కై ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పదవ డివిజన్ నాయకులు బైరి విజయ్, వీరనారాయణ, సుగ్రీవు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం హామీ ఇచ్చిన గ్యారంటీలు అమలు కాకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై ధర్మ యుద్ధం

## అర్హులందరికీ విద్య వైద్యం ఉపాధి భూమి ఇల్లు ప్రభుత్వం వెంటనే అందించాలి.



మంచిర్యాల(భారతశక్తి) నవంబర్ 21:పేద, మధ్యతరగతి వర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీ ఈ బీసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బుధవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 90% పైన పేద, మధ్యతరగతి వర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీ ఈ బీసీ ప్రజలు ఉన్నారు అంటే దాదాపు ఒక కోటి కుటుంబాలు ఉన్నాయి. నేడు వీరు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా విద్యా వైద్యం ఉపాధి భూమి ఇల్లు ఈ ఈ ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడం ద్వారా తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తారు.రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఐదు పథకాలను వెంటనే అమలు చేయాలి. ప్రజలందరికీ కే.జీ నుంచి పి.జీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలి.ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించి ప్రాణాలను కాపాడాలి. అందరికి చేసుకోవడానికి వారి వారి అర్హతలను బట్టి ఉపాధి అందించి చేతినిండా గౌరవప్రదమైన పనిని కల్పించాలి తద్వారా వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచారు.

అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో ఒక ఎకరం వ్యవసాయ భూమిని ఇవ్వాలి. అర్హులైన వారికి 200 గజాల స్థలంతో నాలుగు గదుల ఇల్లును నిర్మించి ఇవ్వాలి. ఈ ఐదు పథకాలకు పూలే, అంబేడ్కర్, సాహు మహారాజ్, కాన్షిరాం ల పేర్లు పెట్టి ప్రభుత్వం పగడ్బందీగా అమలుచేసి రాష్ట్రంలో పేద మధ్యతరగతి ప్రజలుగా బ్రతుకుతున్న బీసీ ఎస్సీ ఎస్టీ ఈబీసీ ప్రజల జీవితాలలో సామాజిక సాంస్కృతిక ఆర్థిక మార్పుని తీసుకురావాలని మీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఐదు డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. ఈ డిమాండ్లను పరిష్కరించడం ద్వారా మన జిల్లాలో కూడా 90 శాతం పేద మధ్యతరగతి వర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీ ఈ బీసీ ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ నాయకులు జంగపెల్లి రామస్వామి,నందిపాటి రాజు,తాళ్ళపెల్లి చంద్రశేఖర్,ఈదునూరి రమేష్,కల్లూరి క్రాంతి కుమార్, కనకరాజు, నరేష్,సతీష్,తాళ్ళపెల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమావేశం ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్స్ బహిష్కరణ చేయడం విడ్డురం

## భూకబ్జాలకు,అక్రమ కట్టడాలపై వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిలుకూరి రమాదేవి డిమాండ్



నల్గొండ జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 21:నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీ లో గురువారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమావేశం ఏర్పాటు చేస్తే అధికార పార్టీ కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్స్ బహిష్కరణ చేయడం విడ్డురంగా వుందని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిలుకూరి రమాదేవి అన్నారు.ప్రజా సమస్యలు పక్కకు పెట్టి వ్యక్తిగతంగా రాజకీయ దూషణలు చేసుకోవడం బాధాకరంగా ఉందని పట్టణంలో ఎమ్మెల్యే అండతో అధికార పార్టీ నాయకులు భూకబ్జాలకు, అక్రమ కట్టడాలకు పాల్పడుతున్నారని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిలుకూరి రమాదేవి డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ షాపుల విషయంలో టెండర్లు వేసిన వారి తరుపున బీజేపీ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు.ఇకనైనా పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధి కోసం పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యేను అధికార పార్టీ కౌన్సిలర్ లను కోరుతున్నామన్నారు.

# కుటుంబ సర్వే డాటా ఎంట్రీ బాధ్యతాయుతంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.



ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 21 (భారత శక్తి) : జిల్లాలో నిర్వహించిన ఇంటింటా కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లు డేటా నమోదును ఎలాంటి తప్పులు లేకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని భవనంలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ తీరును జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా తనిఖీ చేసి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఎంట్రీ నమోదుకు లాగిన్ ఇవ్వడం జరిగినదని, డేటా ఎంట్రీ బాధ్యతాయుతంగా తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు వంద శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో ఎన్యూమనేటర్లకు ప్రజలు సహకరించారని సర్వే వేగవంతంగా పూర్తి జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో ఎం.పి. ఓ. రహీం, ఈ డి ఎం దేవేందర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, తదితరులుపాల్గొన్నారు.

# జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహణ





సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 21:హుజూర్ నగర్ నియోజక వర్గ వ్యాప్తంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వివిధ మండల అధికారులు చెకుముకి సైన్స్ సంబరాల ను ప్రారంభిస్తూ విద్యార్థుల తో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ సుజనాత్మక ఆలోచనల రూపకల్పనకు పరీక్షలు నిర్వహించటం అభినం దనీయమని అన్నారు. వివిధ జడ్.పి.హెచ్.ఎస్ పి స్కూళ్లలో ప్రధానోపాధ్యా యులు మాట్లాడుతూ పోటీ పరీక్షలు సైన్స్ పట్ల ఆసక్తి శ్రద్ధ పెంపొందిస్తాయని విజ్ఞాన సముపార్జన కు వారధిగా చెకుముకి ప్రతిభా పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర రసాయన శాస్త్రం ఉపాధ్యాయులు ఇంగ్లీష్ మీడియం విభాగాలలో తెలుగు మీడియం విభాగాలలో ప్రై వేట్ ఇంగ్లీష్ విభాగంలో గవర్నమెంట్ ఇంగ్లీష్ విభాగం లో పలువురు విద్యార్థులు టాలెంట్ టెస్ట్ పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో అధికారులు జన విజ్ఞాన వేదిక సభ్యులు విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐఏఎల్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించి న ఐఏఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొమ్మగాని శ్రీనివాస్, తొగిటి మురళి

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) నవంబర్ 21:వరంగల్ జిల్లా కేంద్రంలో ఈనెల 30, డిసెంబర్ 1న జరిగే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఐఏఎల్ రెండవ రాష్ట్ర మహాసభలకు సూర్యాపేట జిల్లా కేంద్రం నుండి అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేయాలని ఐఏఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొమ్మగాని శ్రీనివాస్ తొగిటి మురళి పిలుపునిచ్చారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ హాల్ నందు రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్ లను సూర్యాపేట జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. ఐఏఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణ కోసం ఐఏఎల్ కృషి చేస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజలకు చట్టాలు, హక్కులు అమలుకై నిరంతరం కృషి చేస్తుందన్నారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, హౌసింగ్ స్కీమ్, వృద్ధాప్యంలో ప్రవేశించిన సీనియర్ న్యాయవాదులకు సమగ్ర ఆరోగ్య పథకం, సంక్షేమ నిధి పెంపు వంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని, అలాగే జూనియర్ మహిళా న్యాయవాదులకు ఆర్థిక సహకార ప్రోత్సహించాలి అని అన్నారు. వృత్తిలో ఎదురవుతున్న సవాళ్ళు,




న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, నూతన చట్టాలపై అవగాహనకు రాష్ట్ర మహాసభలో చర్చించి తీర్మానాలు రూపొందించనునట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ గౌరవ అధ్యక్షులు నాతి సవేందర్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల పెల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డప్పు మల్లయ్య, సీనియర్ న్యాయవాదులు బిక్షమయ్య గౌడ్, వివి రావు, వేణుగోపాల్ రావు, పెండెం వాణి, కంచర్ల సతీష్ కుమార్, యరగాని వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ,వీరేష్ నాయక్, అనంతల సందీప్, ఢాకా శ్రీనివాస్, డి కిషోర్, ఏడీ%శీ%డ్ల అశోక్, పోలోజు మధు, సుంకరి రవి, ఎం.గోపి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా విద్యా శాఖాధికారిగా రామా రావు



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 21: నిర్మల్ జిల్లా విద్యా శాఖాధికారిగా రామా రావు బుధవారం పదవీ భాద్యతలు చేపట్టారు. కాగా ఇక్కడ విద్యాశాఖ అధికారిగా కొనసాగిన ఎ.రవీందర్ రెడ్డి మహబూబ్ నగర్ డి.ఇ.ఓ గా బాధ్యతలు చేపట్టనున్నారు.రామారావును విద్యా శాఖ అధికారిగా నియమించారు.అనంతరం గురువారం స్థానిక సంస్థల జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి, నాస్ పరీక్ష గురించి జిల్లా విద్య శాఖ అధికారి రామ రావు చర్చించారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఓ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఝాన్సీ రాణికి ఘన సన్మానం

భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, నవంబర్ 21:కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా ఇటీవల నియమితులైన తౌటం ఝాన్సీ రాణి-రవీందర్ దంపతులను అఖిల భారత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

హనుమకొండ లోని చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్ నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్,జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం ఆధ్వర్యంలో పూలమాలతో, శాలువాతో ఘనంగా సన్మానించి మార్కండేయుడి ఫొటోను బహుమతిగా అందజేశారు. అనంతరం స్వీట్లు అందజేసి చైర్ పర్సన్ గా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా తౌటం ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ 35 ఏళ్ల కష్టాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవిని అప్పగించిందని,చైర్మన్ పదవికి సహకరించిన మంత్రులకు,కాంగ్రెస్ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా,సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ మాట్లాడుతూ మరో రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు,ఇతర ఎన్నికలు జరిపే ఛాన్స్ ఉన్నందున పద్మశాలి ముద్దుబిడ్డలు అవకాశం ఉన్న ప్రతి చోట వార్డు మెంబర్ మొదలుకొని,సర్పంచ్,



ఎంపీటీసీ,ఇతర పదవులకు కచ్చితంగా బరిలో నిలిచి పద్మశాలీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. పోటీ చేసే ప్రతి పద్మశాలి బిడ్డకు కులం అండదండలు ఎల్లవేళలా ఉంటాయని, వారి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు.

ఈ ఆదివారం నిర్వహించే కార్తీక మాస వనభోజనాల కార్యక్రమానికి పద్మశాలి కుల బాంధవులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్,జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకన్న, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు పోరండ్ల రమేష్, నల్ల సత్యం, వెంగళ వేణుగోపాల్, యూత్ కమిటీ అధ్యక్షుడు పోరండ్ల కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రశాంత్, సత్కారి సంతోష్, గైని సత్యనారాయణ, కుసుమ శ్యాంసుందర్, తుమ్మ రమేష్, మార్గం ఎల్లయ్య, గోలి రవి, సాదుల రాజలింగం, ఆడెపు విశ్వనాథ్, చేరాల చంద్రమోహన్, కుల బాంధవులు పాల్గొన్నారు.

# పోలీస్ కీర్తి ప్రతిష్టలు పెంపొందించే రీతిలో ప్రజా సేవకు అంకితం కావాలి:వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)నవంబర్21: పోలీసులు శాంతి భద్రతల పరిరక్షిస్తూ, పోలీస్ కీర్తి ప్రతిష్టలు పెంపొందించే దిశగా నిరంతరం ప్రజల సేవకు అంకితం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ళకు పిలుపునిచ్చారు. తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 246 మంది స్టైఫండరీ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ళ (సివిల్) పాసింగ్ అవుట్ పరేడ్‌ను(దీక్షాంత్ పరేడ్) గురువారం మడికొండలోని సిటి పోలీస్ శిక్షాణ కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్యఅతిధిగా హాజరై ముందుగా ట్రైనీ కానిస్టేబుళ్ళ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విధి నిర్వహణలో వివక్ష చూపమని, తమ సేవలతో దేశ ప్రతిష్టలను పెంచుతామని శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ కానిస్టేబుళ్ళ చేత సిటిసి ప్రిన్స్‌పాల్ రవి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేది పోలీసులు మాత్రమేనని, నేటి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ళు ఈరోజు నుండి పోలీస్ శాఖలో పూర్తి బాధ్యతలు చేపట్టేందుకు సిద్దమయ్యారని. ముఖ్యంగా శాంతి భద్రతలను పరిరక్షించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, అలాగే ప్రజల హక్కులు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజల స్నేహపూర్వకంగా వ్యహరించాల్సి వుంటుందని. అలాగే క్రమశిక్షణ అనేది ప్రతి పోలీస్ అధికారికి ముఖ్యమని గుర్తించుకోవాలని, శిక్షణ సమయంలో అనుసరించిన క్రమశిక్షణను రాబోవు రోజుల్లో కూడా అనుసరించాలని. అనునిత్యం విధినిర్వహణలో ఎదురయ్యే పనివత్తిడితో పాటు ప్రతికూల పరిస్థితులలో కూడా భాధ్యతలు నిర్వర్తించాల్సి వుంటుందని. ప్రలోభాలకు లొంగకుండా నీతి, నిజాయితీ విధులు నిర్వహించే పోలీసులకు సమాజంలో గౌరవ మర్యాదలు పెరగడంతో పాటు, అధికారుల గుర్తింపు వుంటుందని. ఉన్నత చదువులు చదివి నైపుణ్యంతో పనిచేయాలనుకున్నవారికి పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో పనిచేసేందుకు అవకాశాలు అధికమని. నూతన పరిజ్ఞానంపై మరింత పట్టుసాధించడంతో పాటు, కొత్త చట్టాలను సమర్ధవంతంగా అమలుచేస్తూ తెలంగా రాష్ట్ర పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసురావాలని,పట్టుదలతో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు అంకిత భావంతో సేవలు అందిస్తూ వృత్తిపరం జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సిపి ట్రైనీ కానిస్టేబుళ్ళకు తెలిపారు. అంతకు ముందు శిక్షణా కేంద్రం ప్రిన్స్‌పాల్ మాట్లాడతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ట్రైనీ కానిస్టేబుళ్ళకు గత ఫిబ్రవరి మాసంలో ప్రారంభమైన తొమ్మిది నెలల పోలీస్ శిక్షణ సమయంలో ట్రైనీ కానిస్టేబుళ్ళకు పరిపాలన, డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం. లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్స్ మరియు అంతర్గత భద్రత, పోలీస్ చట్టాలు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ మరియు ఫోరెన్సిక్ మెడిసిన్ఇ అవుట్‌డోర్స్ ఫిజికల్ ట్రైనింగ్, స్క్వాడ్ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, టియర్ గ్యాస్ మరియు మాబ్ ఆపరేషన్‌లు, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్,ట్రాఫిక్, ఫస్ట్ ఎయిడ్, పోలీస్ అప్లికేషన్ల వినియోగం మొదల్కైన అంశాల్లో ట్రైనీ కానిస్టేబుళ్ళకు శిక్షణ అందజేయడం జరిగిందని ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఈ సందర్బంగ శిక్షణలో ప్రతిభ కనబరిచిన నాగరాజు, రవి,శశిధర్ గౌడ్‌లకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా జ్ఞాపిలను అందజేసారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి, శ్రీనివాస్, వైస్‌ప్రిన్స్‌పాల్ రమణబాబు, ఎసిపిలు తిరుమల్, సురేంద్ర, అనంతయ్య, ఆర్.ఐ ఉదయ్‌భాస్కర్, శ్రీనివాస్, శ్రీధర్, స్పర్జన్‌రాజ్, ఇన్స్‌స్పెక్టర్లు రవికుమార్,మంగీలాల్, కిషన్‌తో పాటు ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు ఇన్‌డోర్,అవుట్‌డోర్ సిబ్బందితో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు పరిష్కరం చూపేలా,జిల్లాని అభివృద్ధి బాటలో నడిపేలా వార్తా కథనాలుండాలి :టీజేఏ ప్రెస్ క్లబ్ ను ప్రారంభించిన ఆర్డీఓ శ్రీనివాసులు

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టిజేఏ ముందుంటుంది: టీజేఏ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి)నవంబర్ 21:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఇందిరా చౌక్ వద్ద తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎన్.యు.జే(ఐ) మాజీ జాతీయ అధ్యక్షుడు ఉప్పల లక్ష్మణ్, టీజేఏ రాష్ట్రఅధ్యక్షులు రమణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాథ్,

టిజేఏ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావుల ఆదేశాల మేరకుటీజేఏ సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షుడు షేక్ సైదా ఆధ్వర్యంలో గురువారం హుజూర్ నగర్ రాజ్యసభ మండలాధికారి శ్రీనివాసులు ముఖ్య అతిథి గా పాల్గొని టీజేఏ జిల్లా కమిటీ ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించి కేక్ కట్ చేసి జిల్లా కమిటీ జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి జర్నలిస్టుల కార్యాలయం హుజూర్ నగర్ నియోజకవర్గంలో పెట్టడం శుభ పరిణామమని జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలకు పరిష్కరం చూపేలా,జిల్లాని అభివృద్ధి బాటలో నడిపేలా వార్తా కథనాలుండాలని జర్నలిస్టు మిత్రులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా టిజేఏ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు షేక్ సైదా కమిటీ సభ్యులతో కలిసి ఆర్డీవోను శాలువాతో సత్కరించారు.

అనంతరం అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టిజేఏ ముందుంటుందని, జర్నలిస్టుల రక్షణ,సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో టీజేఏ జర్నలిస్టులు జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర చారి, షేక్ నవాబ్ జాని,నందిగామ నాగేందర్, మహమ్మద్



యాసిన్ బాబా,షేక్ జానిపాషా, షేక్ రహీం మౌలానా, మహమ్మద్ ఖయ్యూమ్,షేక్ నయీమ్, కొత్తపల్లి మధుసూదన్,పెందుర్తి సతీష్, కొమ్ము మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ డివిజన్ కేంద్రంలో భారీ,ర్యాలి, ఆర్డీఓ ఆఫీసు ముట్టడి సబ్ కలెక్టరుకు వినతి పత్రం అందజేసిన తెలంగాణ బీడీ వర్కర్స్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, నవంబర్ 21: గురువారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ కేంద్రం లో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్, ఎ,ఐ,ఎఫ్ టీయూ,ల ఆధ్వర్యంలో బాన్సువాడ ఆర్%ఉ%బి,ఆపీసు నుండి ఆర్డీఓ ఆఫీసు వరకు బీడీ కార్మికులు భారీ ర్యాలి, నిర్వహించి ఆర్డీఓ, ఆఫీసు ముట్టడి చేసి అనంతరం సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేసారు. అనంతరం తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బిఎల్ టీయూ, రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్దిరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, నాగారపు యెల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యం, ఆంజనేయులు, శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్, ఎఐఎఫ్ టీయూ, రాష్ట్ర అధ్యక్షురాలు, యస్, అనూసుయ, రాష్ట్ర నాయకులు, కుర్తి లింగం, రాష్ట్ర నాయకురాలు, వెంకట లక్ష్మి, తదితరులు కార్మికుల ను ఉద్దేశించి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రములోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10,నెలలు గడిచిన బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ నేటికి అమలు చేయలేదు, అందుకని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని గత నెల రోజులపాటు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మా రెండు యూనియన్ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కు స్థానిక ఎయం ఎల్ ఎ, మొద్దు నిద్ర లో ఉన్నారు, బాన్సువాడ ఎమ్మెల్యే,పోచరం శ్రీనివాస్ రెడ్డి,బీడీ కార్మికులు ఓట్లతో అధికారికంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, యం,ఎల్ ఎ, అసెంబ్లీలో బీడీ కార్మికుల జీవన భృతి విషయంలో మాట్లాడక పోవడం సిగ్గు చేటు, ఇప్పటికీ కైన మొద్దు నిద్ర విడనాడి, బీడీ పరిశ్రమ లో పని చేయు కార్మికులందరికి,ఎలాంటి షరతులు లేకుండా 4016,రూ,ల జీవన భృతి ఇవ్వాలని,2014 సంవత్సరం కటాఫ్ తేదీని తొలగించి, పరిశ్రమలో పనిచేయు అందరికీ జీవన భృతి ఇవ్వాలని లేనిచో రానున్న స్థానిక ఎన్నికలలో వీరికి తగిన బుద్ధి చెప్పాలని కార్మికులకు పిలుపు నిచ్చారు,బీడీ కార్మికులకు నేలకు 26,రోజుల పని లేదు, నేలలో 10,రోజు కూడా పనిలేదు, కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమ పై లేనిపోని ఆంక్షలు విధించింది, దీని ఫలితంగా బీడీ కార్మికులకు ఉన్న ఉపాది లేక వారి కుటుంబాలు అర్ధ అకాలితో జీవిస్తున్నారు. అందుకని బీడీ కార్మికుల పోరాటం తీవ్రం కాకముందే అందరికీ 4016 రూ.జీవన భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్దిరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, నాగారపు యెల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యం, ఆంజనేయులు, రాష్ట్ర కోశాధికారి,సైయ్యద్,నాయకులు,గంగాధర్, శ్రామిక శక్తి తెలంగాణ బీడీ కార్మిక సంఘం, ఎఐఎఫ్ టీయూ, రాష్ట్ర అధ్యక్షురాలు, యస్, అనూసుయ, రాష్ట్ర నాయకులు, కుర్తి లింగం, రాష్ట్ర నాయకురాలు, వెంకట లక్ష్మి తదితరులు బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహారాష్ట్ర, జార?ండ్ ల ఎన్నికల ఫలితాల్లో కమల వికశించడం ఖాయం : కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, నవంబర్ 21: కామారెడ్డి పట్టణానికి చెందిన 91 మంది యువకులు కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి చేతుల మీదుగా కాషాయ కండువా కప్పుకొని బీజేపీ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా బీజేపీ కి రోజు రోజుకి ఆదరణ పెరుగుతుందని మహారాష్ట్ర, జార?ండ్ ల ఎన్నికల ఫలితాల్లో కమల వికశించడం ఖాయం అని జోస్యం చెప్పారు. ఒక్క ఏడాదికే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత వచ్చిందనీ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇంకా నెరవేర్చలేదని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డిలో అన్ని స్థానాలు బీజేపీ కైవసం చేసుకోవాలనీ అందుకు ప్రతి కార్యకర్త బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ



కార్యక్రమంలో బిజెవైఎమ్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి,బిజెవైఎమ్ నాయకులు రాజేష్, భరత్, రాజ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించు అన్ని పథకాలపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలి : జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 21: నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంలోని మ్యాక్స్ లో ఏడీసీసీ బ్యాంకు వారి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు పలు రకాల రుణ, బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు అన్ని రకాల పథకాలు రుణాలు, బీమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జన సురక్ష, పీఎం విశ్వకర్మ, ముద్ర, పీఎంఈజీపి, పీఎం జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, పిఎం ఎఫ్ఎంఈ, ఇతర వ్యవసాయ రుణాలపై రైతులకు, ప్రజలకు అవగహన కల్పించారు. రుణాలు పొంది వాటిని సక్రమంగా వినియోగించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అర్హులైన వారు రుణాలు పొంది వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలైన డెయిరీ, కోళ్లు, చేపలు, తేనెటీగలు పెంపకం వంటి రంగాలలో, కుటీర పరిశ్రమ, వ్యాపార, కుల వృత్తులలో అభివృద్ధిని సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహా రెడ్డి, తహసిల్దార్ లక్ష్మణ్ ఎంపీడీవో రమాకాంత్, ఏడిసిసి బ్యాంకు ఖానాపూర్ శాఖ మేనేజర్ కల్పన, ఎఫ్ఎల్ సి మచిందర్ రెడ్డి, సిఎఫ్ఎల్ జాదవ్, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువకులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భైంసా మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గజానంద్ పటేల్ జన్మ దిన వేడుకలు

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 21: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో లో భైంసా మండల యూత్ అధ్యక్షుడు గజానంద్ పటేల్ జన్మదిన వేడుకలకు ముధోల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భోస్లే నారాయణ్ రావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భోజారాం పటేల్, సుదర్శన్,, ముత్యం రెడ్డి, ఓం ప్రకాష్, సుధీర్ రెడ్డి, మెట్రో టివి నిర్మల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మాడుగుల సాయినాథ్ లు పాల్గొన్నారు. ఘనంగా సన్మానించి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.



# ఏఎస్సైలు గా పదోన్నతి పొందిన పోలీసు సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), నవంబర్ 21:ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో హెడ్ కానిస్టేబుల్ గా భాధ్యతలు నిర్వహిస్తూ...ఏఎస్సైలు పదోన్నతి పొందిన ఐదుగురు పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏఎస్సైలు గా పదోన్నతి పొందిన వారు పోలీస్ కమిషనర్ ని కలిశారు. పదోన్నతి పొందిన వారిలో ఎస్ కె . నూరుద్దీన్,కె. నాగేశ్వరరావు,బి.వి.ఆర్. రాజు,ఐ.చిన్నారావు,ఎస్.శ్రీనివాసరావు వున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

# ఇది ఐపీఎల్ కాదు.. మైదానంలో ఫ్రెండ్స్ ఉండరు: గంభీర్‌కు మద్దతుగా క్లార్క్



భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ( అప్రోచ్ బాగుందని.. కీలక సిరీస్ కోసం బరిలోకి దిగే ముందు దూకుడుగా ఉండటం అత్యవసరమని ఆసీస్ మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ వ్యాఖ్యానించాడు. ఇదేమీ లీగ్ క్రికెట్ కాదని, మైదానంలోకి దిగాక ఎవరూ స్నేహితులు కారని తెలిపాడు. అయితే, ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లతో కలిసి ఆడుతున్న రోజుల్లో మైదానంలో దూకుడు ప్రదర్శించడం కాస్త కష్టమేనని పేర్కొన్నాడు.

"ఇప్పుడు ప్రపంచమంతా లీగ్ క్రికెట్ వచ్చేసింది. ఐపీఎల్, బిగ్‌బాష్, కరీబియన్ లీగ్‌ల హడావుడి ఎక్కువైంది. గతంలో మేం ఆడేటప్పుడు (ఐపీఎల్‌కు ముందు) ప్రత్యర్థులుగానే చూసేవాళ్లం. ఎందుకంటే మేం ఎప్పుడూ కలిసి ఆడే అవకాశం ఉండేది కాదు. కానీ, ఐపీఎల్ సహా లీగ్‌లు విస్తరించాక ఇప్పుడు ఆటగాళ్లందరూ కలిసి ఆడుతున్నారు. కానీ, దేశం కోసం ఆడేటప్పుడు ఆ మాత్రం దూకుడు ఉండాల్సిందే. ఎందుకంటే మైదానంలో స్నేహితులు ఎవరూ ఉండరని తెలుసుకోవాలి. ఆఫ్ ది ఫీల్డ్ ఎలా ఉన్నా ఫర్వాలేదు. జాతీయ జట్టు తరఫున ఆడేటప్పుడు దూకుడు ప్రదర్శించాలి. ఎందుకంటే అందరూ కలిసి ఒకే ఐపీఎల్ జట్టులో ఆడటం లేదనే సంగతిని గుర్తుంచుకోవాలి" అని తెలిపాడు.

భారత్‌కే మేలు..

"గౌతమ్ గంభీర్ దూకుడుగా ఉండటం భారత జట్టుకు ప్రయోజనమే. ఆసీస్ కూడా ఇదే యాటిట్యూడ్‌తో ఉంది. నేను స్లెడ్జింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గంభీర్ విధానం బాగుంది. కానీ, ఆస్ట్రేలియా ఇంకా ఆ మోడ్‌లోకి రాకపోవడం ఆశ్చర్యమేస్తోంది. తప్పకుండా ఈ సిరీస్ గొప్పగా మారతుందని ఆశిస్తున్నా. ఆస్ట్రేలియా సొంత గడ్డపై విజయం సాధించాలని గట్టి పట్టుదలతో ఉంది. భారత్ కూడా హ్యాట్రిక్ లక్ష్యంగా బరిలోకి దిగనుంది'' అని మైకెల్ క్లార్క్ వ్యాఖ్యానించాడు.

బీసీసీఐ అనుకుంటే చేసేస్తుంది: ఆరోన్ ఫించ్

తొలి టెస్టు శుక్రవారం నుంచి పెర్త్ వేదికగా ప్రారంభం కానుంది. టెస్టు జరుగుతున్న సమయంలోనే ఐపీఎల్ మెగా వేలాన్ని బీసీసీఐ నిర్వహించనుంది. దీంతో కొందరు ఆసీస్ మాజీలు మొదటి మ్యాచ్ కామెంట్రీకి దూరం కానున్నారు. ఒకే సమయంలో కాకుండా.. తొలి టెస్టు అయిపోయిన తర్వాత వేలం పెడితే బాగుండేదన్న అభిప్రాయమూ వ్యక్తమైంది. "టెస్టు మ్యాచ్ జరుగుతున్నప్పుడే ఐపీఎల్ వేలం నిర్వహించడం వెనక కారణం ఉండే ఉంటుంది. బీసీసీఐ దేనినైనా చేయాలని అనుకుంటే ఆ మార్గంలో వెళ్లిపోతుంది" అని మాజీ క్రికెటర్ ఆరోన్ ఫించ్ వ్యాఖ్యానించాడు. అయితే, ఇది క్రికెట్ ఆస్ట్రేలియాకు నిరుత్సాహం కలిగించే అంశమేనని.. టైమింగ్స్ వేరుగా ఉన్నప్పటికీ టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత పెడితే బాగుండేదని మాజీ ఆటగాడు కల్లమ్ ఫెర్గూసన్ తెలిపాడు.

# రోహిత్ భవితవ్యం ఏంటి? అదే జరిగితే.. టీమ్ ఇండియా కొత్త కెప్టెన్ ఎవరు?

న్యూజిలాండ్ సిరీస్‌లో భారత్ 3-0తో వైట్‌వాష్‌కు గురికావడం భారత క్రికెట్లో సంచలనమైంది. ఎదురులేదు అనుకున్న జట్టు కివీస్ చేతిలో ఇంతలా ఓడడాన్ని అభిమానులతో పాటు భారత క్రికెటర్లు కూడా జీర్ణించుకోలేకపోయారు. ఈ పరాజయమే కెప్టెన్ రోహిత్ శర్మ సామర్థ్యాన్ని ప్రశ్నించేలా చేసింది. భవిష్యత్‌ను దృష్టిలోపెట్టుకొని కెప్టెన్ ను వెతకాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది.



సొంతగడ్డపై అనుకూలమైన పిచ్‌లు తయారుచేయించుకొని.. విజయాలు సాధించి సంబరపడిన భారత్‌కు న్యూజిలాండ్‌తో సిరీస్ చెంపపెట్టులా మారింది. వ్యూహాలు బెడిసికొట్టి.. ఆటలో పదును లోపించి చేదు అనుభవాన్ని రుచి చూసింది. అయితే ఇక్కడితో అయిపోలేదు. ముందుంది ఆస్ట్రేలియాతో మహా సమరం ! భారత్‌లో మాదిరిగా ఇష్టమైన పిచ్‌లు తయారుచేసుకోవడం కుదరదు. అలవాటైనట్లుగా ఆడటం అస్సలూ కుదురదు. బౌన్సీ పిచ్‌లపై.. భీకర ఆసీస్ పేస్ బౌలింగ్‌కు ఎదురురొడ్డి నిలవాల్సి ఉంది.

బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో గత రెండు సిరీస్‌లలోనూ గెలిచి సత్తా చాటిన భారత్‌కు ఈసారి కంగారే! ముఖ్యంగా రోహిత్ శర్మ కెప్టెన్సీ పటిమకు ఈ సిరీస్ పెద్ద లిట్మస్ టెస్టుగా నిలవనుంది. సారథిగా అతడికిదే చివరి టెస్టు సిరీస్ అనే ప్రచారం ఊపందుకుంది. మరి రోహిత్ వారసులుగా నిలిచేవాళ్లు ఎవరు? వ్యక్తిగత కారణాలతో పెర్త్‌లో జరిగే తొలి టెస్టుకు రోహిత్ దూరం కావడంతో పేసర్ జస్ప్రీత్ బుమ్రా టీమ్‌ఇండియాకు సారథ్యం వహిస్తున్నాడు. కానీ ఇది తాత్కాలిక ఏర్పాటే. భవిష్యత్‌ను దృష్టిలోఉంచుకొని భారత్‌ను నడిపించే సారథిని ఈ టెస్టు సిరీస్‌లో సెలక్టర్లు కనుగొనాల్సి ఉంది. మరి ఆ సామర్థ్యం ఎవరికి ఉంది?

రేసులో వాళ్లిద్దరూ

రోహిత్‌శర్మ లాగే స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా కెరీర్ చరమాంకంలోకి వచ్చాడు. అతడు ఎలాగో సారథ్యం రేసులో లేడు. కోహ్లి సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎంతకాలం కొనసాగుతాడో తెలియదు. వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా కెరీర్ చివర్లో ఉన్నాడు. ఈనేపథ్యంలో కుర్రాళ్లకు సుదీర్ఘ ఫార్మాట్‌లో సారథ్య బాధ్యతలు అప్పగించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రస్తుత జట్టులో పేసర్ బుమ్రా తాత్కాలికంగా కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. కానీ అతడి వయసు, ఫిట్‌నెస్ దృష్టిలో ఉంచుకుంటే ఇది పెద్ద భారమే. బుమ్రాపై ఒత్తిడి తగ్గించాలంటే కెప్టెన్సీ కుర్రాళ్లకు ఇవ్వాలి.

సారథిగా కాస్త అనుభవం ఉన్న సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్ ఒత్తిడిలో ఉన్నాడు. బ్యాటర్‌గా విఫలమవుతూ జట్టులో స్థానాన్నే ప్రశ్నార్థకం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సారథ్యం చేయగల సామర్థ్యం ఉన్న యువ కెరటాలు శుభ్‌మన్ గిల్ రిషబ్ పంత్ ఈ పాత్రకు సరిపోయేలా కనిపిస్తున్నారు. ఒకటి రెండు సిరీస్‌లలో ఎదురుదెబ్బలు తిన్నా కూడా వాళ్లు కుదురుకుని జట్టును ముందుకుతీసుకెళ్లగలరు. ముఖ్యంగా ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్, దిల్లీ క్యాపిటల్స్‌ను నడిపించిన అనుభవం ఉన్న గిల్, పంత్‌లకు కెప్టెన్సీ ఏమీ కొత్త కాదు. కానీ సుదీర్ఘ ఫార్మాట్లో సారథ్యం మాత్రమే కొత్త. దీనికి వాళ్లు అలవాటు పడాల్సిఉంది.

జట్టులో మిగిలిన కుర్రాళ్లతో పోలిస్తే గిల్, పంత్‌లే కాస్త సీనియర్లు. ప్రస్తుతం ఉన్న ఫామ్‌లో ఆస్ట్రేలియాను ఆపి సిరీస్‌ను నిలబెట్టుకోవడం టీమ్‌ఇండియాకు దాదాపు అసాధ్యం. మరో వైట్‌వాష్‌కు గురికాకుండా చూసుకుంటే చాలు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో భారత్ ఓడితే కఠిన నిర్ణయాలు తప్పవు. న్యూజిలాండ్‌తో సిరీస్‌తో పాటు గత కొంతకాలంగా సుదీర్ఘ ఫార్మాట్లో విఫలమవుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి గురించి కూడా సెలక్టర్లు ఆలోచించాల్సిన పరిస్థితి రావొచ్చు. అందుకే ఈ సిరీస్ ముగిసేలోపే సెలక్టర్లు అటు కెప్టెన్సీపై.. ఇటు జట్టు కూర్పుపై ఓ నిర్ణయానికి రావడం మంచిది.

# విరాట్ మాటలే స్ఫూర్తి.. తొలి పర్యటనను ఆస్వాదిస్తా: యశస్వి జైస్వాల్




అడుగుపెట్టిన కొద్ది రోజుల్లోనే జట్టులో అత్యంత కీలక ప్లేయర్‌గా మారాడు. ఈ ఏడాది టెస్టుల్లో1000ం స్కోరు సాధించిన ఇద్దరు బ్యాటర్లలో అతడిది రెండో స్థానం. ఫార్మాట్ ఏదైనా దూకుడే ఆయుధంగా బరిలోకి దిగే యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌కు మార్గదర్శిగా నిలిచిన వ్యక్తి స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ. జాతీయ జట్టులోకి వచ్చిన తొలి నాళ్లలో ఎక్కువగా కోహ్లీతోనే సంభాషించేవాడినని.. అప్పుడు అతడు చెప్పిన మాటలు ఎంతో స్ఫూర్తి నింపాయని తాజాగా యశస్వి జైస్వాల్ వెల్లడించాడు. ఆస్ట్రేలియా పర్యటనకు తొలిసారి వచ్చిన తాను ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు వెల్లడించాడు. యశస్వి మాట్లాడిన వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

''సీనియర్ క్రికెట్ ఆడటం ప్రారంభించిన తర్వాత ఒకసారి విరాట్‌తో మాట్లాడా. మూడు ఫార్మాట్లలో ఇన్నేసి మ్యాచ్‌లు ఆడటాన్ని ఎలా మేనేజ్ చేస్తున్నావని అడిగా. దానికి అతడు ఇచ్చిన సమాధానం ఎప్పటికీ మరిచిపోలేను. 'నేను మూడు ఫార్మాట్లలో ఆడాలని కోరుకుంటున్నా. కాబట్టి, నా రోజువారీ దినచర్య కూడా ఓ పద్ధతిలో ఉండాలి. క్రమశిక్షణ అత్యంత కీలకం' అని అన్నాడు. అప్పట్నుంచి కోహ్లీ ఏం చేస్తున్నాడనేది రోజూ చూస్తూ ఉండేవాడిని. అలా చూసినా నాపై ఎంతో ప్రభావం పడిందనిపించేది. నా అలవాట్లలోనూ చాలా మార్పులు వచ్చాయి. నాకు ఎంత అత్యంత ముఖ్యమనే విషయాలను తెలుసుకోగలిగా. రోజు రోజుకూ మెరుగవుతూ వచ్చా" అని యశస్వి తెలిపాడు.

క్లిష్టమైన పరిస్థితుల్లో ఆడనుండటంపై..

"ఇది నాకు తొలి ఆస్ట్రేలియా ట్రిప్. ఇక్కడ ఆడాలని చాన్నాళ్లుగా ఎదురు చూస్తూ ఉన్నా. నాణ్యమైన క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తా. భారత్‌లోని పరిస్థితులకు, ఇక్కడికి చాలా వ్యత్యాసం ఉంటుంది. నేను మానసికంగానూ సన్నద్ధమయ్యా. అక్కడ అలా ఉంటుంది.. ఆ పిచ్‌లు చాలా కఠినమనే మాటలను చాలా విన్నా. ఇప్పుడు ప్రత్యక్షంగా ఆడే అవకాశం వచ్చింది. ఆ సవాళ్లను ఎదుర్కొంటూనే ఆటను ఆస్వాదిస్తా. ఇక్కడ వచ్చిన ప్రతి అవకాశాన్ని నేర్చుకొనేందుకు సద్వినియోగం చేసుకుంటా" అని భారత యువ బ్యాటర్ వెల్లడించాడు.

# మీ భవిష్యత్తు కోసం జ్ఞానాన్ని ఆదా చేసుకోండి: మంజ్రేకర్‌కు షమీ కౌంటర్

: ఐపీఎల్ మెగా వేలం మరో మూడు రోజుల్లో జరగనుంది. రెండు రోజులపాటు (నవంబర్ 24, 25 తేదీలు) సౌదీ అరేబియా రాజధాని జెడ్డా వేదికగా నిర్వహించేందుకు బీసీసీఐ ఏర్పాట్లు చేసేసింది. భారత స్టార్ క్రికెటర్లు ఈసారి వేలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. వారిలో సీనియర్ పేసర్ మహ్మద్ షమీ కూడా ఉన్నాడు. రూ. 2 కోట్ల బేస్ ప్రైస్‌తో బరిలోకి దిగనున్నాడు. గాయం నుంచి కోలుకుని ఇటీవలే రంజీ బరిలోకి దిగిన షమీ ఏడు వికెట్లు తీసి సత్తా చాటాడు. త్వరలో ఆసీస్ పర్యటనలో ఉన్న భారత జట్టుతో కలవనున్నాడు. అయితే, అతడికి తగ్గ ధరను ఈసారి దక్కించుకోవడం కష్టమేనని మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు. అతడి గాయమే అందుకు కారణమని పేర్కొన్నాడు. ఇలాంటి వ్యాఖ్యలపై షమీ స్పందిస్తూ.. మంజ్రేకర్‌కు కౌంటర్ ఇచ్చాడు.



"బాబాకి జయహో.. మీ భవిష్యత్తు కోసం కాస్త జ్ఞానం ఉంచుకోండి మంజ్రేకర్‌జీ. అది మీకు తప్పకుండా ఉపయోగపడుతుంది'' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షమీ పోస్టు పెట్టాడు. దీంతో మంజ్రేకర్‌కు సరైన సమాధానం ఇచ్చావంటూ షమీపై నెటిజన్ల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. షమీ 2023 సీజన్‌లో 17 మ్యాచుల్లో 28 వికెట్లు తీసిన సంగతి తెలిసిందే. గత సీజన్‌లో గాయం కారణంగా 34 ఏళ్ల షమీ పాల్గొనలేదు.

మంజ్రేకర్ ఏమన్నాడంటే?

"ఐపీఎల్ మెగా వేలంలో ( చాలా ఆసక్తికర అంశాలు ఉన్నాయి. టీమ్‌లు ఎలాంటి ప్లేయర్లను తీసకుంటాయనేది చూడాలి. సీనియర్ పేసర్ షమీ గాయం కారణంగా చాలా రోజులు ఆటకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడదే అతడి ధరను నిర్ణయిస్తుందని భావిస్తున్నా. గాయాల వల్ల సీజన్లకు అందుబాటులో లేకపోతే.. భారీ మొత్తం వెచ్చించేందుకు ఫ్రాంచైజీలు సిద్ధంగా ఉండవు. అందుకే, అతడికి లభించే ధర తగ్గుతుందని చెప్పగలను" అని ఓ చర్చా కార్యక్రమంలో మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

# భారత్ ఫుల్‌ఛార్జింగ్.. ఆసీస్ తస్మాత్ జాగ్రత్త: ఆడమ్ గిల్‌క్రిస్ట్

పెర్త్ వేదికగా శుక్రవారం నుంచి భారత్ - ఆస్ట్రేలియా ( జట్ల మధ్య తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఇంట్రాస్క్వాడ్ వార్మప్ మ్యాచ్‌లో పెర్త్ పిచ్ పరిస్థితులపై టీమ్‌ఇండియా ఆటగాళ్లు అవగాహన తెచ్చుకున్నారు. ప్రాక్టీస్ సెషన్స్‌లోనూ తీవ్రంగా సాధన చేస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ట్రైనింగ్ సెషన్‌ను ప్రత్యక్షంగా చూసిన ఆసీస్ మాజీ ఆటగాడు ఆడమ్ గిల్‌క్రిస్ట్ కూడా తమ జట్టుకు సున్నిత హెచ్చరికలు జారీ చేశాడు. కివీస్‌తో టెస్టు సిరీస్ ఓటమితో డీలా పడిందనుకుంటున్న భారత జట్టు మళ్లీ పుంజుకోవడం ఖాయమని ఈసందర్భంగా వ్యాఖ్యానించాడు.

"భారత్ ఇప్పుడు చాలా ఉత్సాహంగా ఉంది. జట్టులోని ప్రతిఒక్కరూ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. వారిని చూస్తుంటే ఫుల్‌గా ఛార్జ్ అయినట్లు అనిపిస్తోంది. టెస్టు సిరీస్ కోసం సిద్ధమైపోయారు. ఇక ఆస్ట్రేలియా జట్టు ఎలా స్పందిస్తుందో చూడాలి. భారత్‌ను అడ్డుకోవడానికి ఆసీస్ చాలా కష్టపడాల్సిందే" అని గిల్‌క్రిస్ట్ తెలిపాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడంతోపాటు ఆసీస్ గడ్డపై హ్యాట్రిక్ సాధించడమే లక్ష్యంగా టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది.

వెట్టోరి దూరం.. స్పందించిన కమిన్స్

ఆసీస్ బౌలింగ్ కోచ్ డానియల్ వెట్టోరి తొలి టెస్టుకు జట్టుతోపాటు ఉండటం లేదు. ఐపీఎల్ మెగా వేలం 24, 25 తేదీల్లో జరగనున్న సంగతి తెలిసిందే. ఎస్‌ఆర్‌హెచ్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వెట్టోరి వేలంలో పాల్గొనున్నాడు. ఈక్రమంలో వెట్టోరి దూరం కానుండటంపై ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ స్పందించాడు.



"డానియల్ సౌదీకి వెళ్తాడు. ఇదేమీ మా ఆటగాళ్లపై ప్రభావం పడదని భావిస్తున్నా. ఇప్పటికే చాలాసార్లు భేటీలు నిర్వహించాం. ఐపీఎల్ వేలంలో చాలామంది క్రికెటర్లు ఉన్నారు. ఆట ముగిసిన తర్వాతే వేలం జరగనుంది. కాబట్టి, ప్రతిఒక్కరూ వీక్షిస్తాం" అని వెల్లడించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ కమిన్స్ అనే విషయం తెలిసిందే. రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్ కూడా తమ వ్యాఖ్యానానికి దూరం కానున్నారు. వీరిద్దరూ ఐపీఎల్ మెగా వేలంలో తమ ఫ్రాంచైజీల తరఫున పాల్గొనున్నారు.

# నష్టాలు రిపీట్: ఒక్క సెషన్‌లో 6 లక్షల కోట్లు ఆవిరి.. 23,350 దిగువకు నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. వరుస నష్టాలకు బ్రేక్ వేస్తూ గత ట్రేడింగ్ సెషన్‌లో లాభాలు చవిచూసిన సూచీలు.. మరోసారి తన నష్టాల పరంపరను కొనసాగించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, అదానీ గ్రూప్ ఛైర్మన్‌పై అమెరికాలో అభియోగాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు క్షీణించి రూ.425 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 77,711.11 పాయింట్ల (క్రితం ముగింపు 77,578.38) వద్ద లాభాల్లో ప్రారంభమయ్యాయి. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 76,802.73 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 422 పాయింట్ల నష్టంతో 77,155.79 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 168.60 పాయింట్ల నష్టంతో 23,349.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 7 పైసలు క్షీణించి జీవనకాల కనిష్ఠమైన 84.49కు చేరింది.

సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్సు 2671 వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

సోలార్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూపు భారత్‌లో లంచాలు ఇవ్వజూపిందన్న ఆరోపణలపై గౌతమ్ అదానీ సహా పలువురిపై అమెరికాలో కేసు నమోదైంది. దీని ప్రభావంతో అదానీ గ్రూపు స్టాక్స్ అన్నీ నష్టపోయాయి. దీని ప్రభావం సూచీలపై పడింది.

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్ర రూపం దాలుస్తుండడం కూడా మదుపర్ల భయాలకు కారణమైంది. దీర్ఘ శ్రేణి క్షిపణులను రష్యా భూభాగంపైకి ప్రయోగించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో పుతిన్ తమ అణువిధానాలను సవరించడం యుద్ధ భయాలను పెంచింది.

మరోవైపు దేశీయ మార్కెట్‌లో విదేశీ మదుపర్ల అమ్మకాలు, బలహీన త్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్ వరుస నష్టాలకు కారణంగా నిలుస్తున్నాయి.

# దేశీయ విమానయాన రంగంలో పెరగనున్న విమానాల సంఖ్య

వచ్చే ఐదేళ్లలో దేశీయ విమానయాన సంస్థల విమానాల సంఖ్య 1400కు పెరగనుందని పౌర విమానయాన శాఖ కార్యదర్శి 'వుమ్‌లున్‌మాంగ్ వుల్నామ్' ఈ రోజు(గురువారం) తెలిపారు. ప్రస్తుతం, దేశీయంగా దాదాపు 800 విమానాలు తమ సేవలను అందిస్తున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థలైన ఇండిగో, ఎయిర్ ఇండియా కొత్త విమానాలకు భారీగా ఆర్డర్లు ఇచ్చాయి. దేశ రాజధానిలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించిన 'గివింగ్ వింగ్స్ టు డ్రీమ్స్ అవార్డ్స్ 2024' కార్యక్రమంలో మాట్లాడుతు డ్రోన్ సెగ్మెంట్‌తో సహా విమానయాన రంగంలో మహిళలకు ఉన్న అవకాశాల గురించి కూడా 'వుల్నామ్' ప్రస్తావించారు. గత 10 ఏళ్లలో విమానాశ్రయాల సంఖ్య



74 నుంచి 157కు పెరిగిందని 'వుల్నామ్' చెప్పారు. ప్రయాణికుల సంఖ్య 11 కోట్ల నుంచి 22 కోట్లకు రెట్టింపు అయిందని ఆయన పేర్కొన్నారు.

## ఒప్పో ఫైండ్ X8 సిరీస్ ఫోన్లు విడుదల..

# ధర 70 వేలు నుంచి ప్రారంభం




చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ ఒప్పో ఫైండ్ ఎక్స్ 8 సిరీస్‌లో రెండు కొత్త ప్రీమియం ఫోన్లు విడుదల చేసింది. ఫైండ్ ఎక్స్8 8), ఫైండ్ ఎక్స్ 8 ప్రో పేరిట వీటిని ఆవిష్కరించింది. ఈ రెండు ఫోన్లూ ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తాయి. మీడియాటెక్ డైమెన్‌సిటీ 9400 చిప్‌సెట్‌తో వస్తున్న తొలి ఫోన్లు కూడా ఇవే కావడం గమనార్హం.

ఒప్పో ఫైండ్ ఎక్స్8 వేరియంట్ ధర రూ.69,999గా కంపెనీ నిర్ణయించింది. 16జీబీ౦512జీబీ వేరియంట్ ధర రూ.79,999గా పేర్కొంది. స్పేస్ బ్లాక్, స్టార్ గ్రే రంగుల్లో ఈ ఫోన్ లభిస్తుంది. ఇక ఒప్పో ఫైండ్ ఎక్స్8 ప్రో సింగిల్ వేరియంట్‌లో లభిస్తుంది. దీని ధరను రూ.99,999గా నిర్ణయించింది. పెరల్ వైట్, స్పేస్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. డిసెంబర్ 3 నుంచి ఒప్పో ఇ-స్టోర్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ప్రధాన రిటైల్ ఔట్‌లెట్లలో లభిస్తాయి.

ఇక ఫీచర్ల విషయానికొస్తే.. ఫైండ్ ఎక్స్8, ఎక్స్8 ప్రో రెండూ ఆండ్రాయిడ్ 15 ఆధారిత కలర్ ఓఎస్ 15తో పనిచేస్తాయి. ఎక్స్8 మోడల్‌లో 6.59 అంగుళాల ఎల్‌టీపీఓ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120%ఎ౬% రిఫ్రెష్ రేటు, 4,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ప్రో మోడల్‌లో 6.78 అంగుళాల ఎల్‌టీపీఓ అమోలెడ్ డిస్‌ప్లే, 120%ఎ౬% రిఫ్రెష్ రేటుతో తీసుకొచ్చారు.

ప్రసార భారతి ఓటీటీ.. ఫ్రీగా రామాయణం, మహాభారతం

ఒప్పో ఫైండ్ ఎక్స్8లో 50 ఎంపీ సోనీ ఎల్‌టీవై-700 ప్రధాన సెన్సర్‌ను అమర్చారు. దీంతో పాటు 50 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా, 50 ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో లెన్స్ ఇచ్చారు. ఇది 3ఎక్స్ ఆప్టికల్ జూమ్‌కు సపోర్ట్ చేస్తుంది. ముందు వైపు 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఫైండ్ ఎక్స్ ప్రోలో 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ-808 కెమెరా ఇచ్చారు. 50 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా, 50 ఎంపీ పెరిస్కోపిక్ 3ఎక్స్ ఆప్టికల్ జూమ్, 6 ఎక్స్‌జూమ్‌తో మరో 50 ఎంపీ సెన్సర్ ఇచ్చారు. అంటే ఇందులో నాలుగు సెన్సర్లు ఉంటాయి. ముందువైపు 32 ఎంపీ కెమెరా ఇచ్చారు.

ఈ రెండు ఫోన్లూ 5జీ, బ్లూటూత్ 5.4, ఎన్ఎఫ్‌సీకి సపోర్ట్ చేస్తాయి. ఫైండ్ ఎక్స్8లో 5,630 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. ఇది 80 ఫాస్ట్ ఛార్జింగ్‌కు 50% ఎయిర్‌వూక్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ప్రో మోడల్‌లో 5,910 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. బేస్ వేరియంట్‌లానే ఫాస్ట్ ఛార్జింగ్ స్పీడ్ ఉంటుంది. 10%ఔ% రివర్స్ ఛార్జింగ్‌కు కూడా సపోర్ట్ చేస్తుంది. రెండు ఫోన్లూ అలర్ట్ స్లయిడర్‌తో పాటు ఐపీ68/ ఐపీ69 రేటింగ్‌తో వస్తున్నాయి.

# భారీగా పతనమైన అదానీ గ్రూప్ షేర్లు.. ఎందుకంటే..?



స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పతనం అవుతున్నాయి. అత్యధికంగా అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు 20 శాతం వరకు విలువ కోల్పోయింది. ఓ భారీ కాంట్రాక్టు పొందేందుకు 265 మిలియన్ డాలర్ల (రూ.2,029 కోట్లు) లంచాలు ఇవ్వజూపినట్లు అమెరికాలోని బ్రూక్లిన్‌లోని ఫెడరల్ కోర్టు అభియోగాలు మోపడం దీనికి ప్రధాన కారణంగా నిలిచింది. న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీ బ్రియాన్ పీస్ ఆదేశాల మేరకు మొత్తం ఐదు అభియోగాలతో గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై కేసులు నమోదయ్యాయి.

ఏమిటీ ఆరోపణలు..

భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు గౌతమ్ అదానీ, మరో ఏడుగురుతో కలిసి అధికారులకు లంచాలు ఆఫర్ చేసినట్లు అమెరికా ఎఫ్‌బీఐ చెబుతోంది. అదే సమయంలో బ్యాంకులు, ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు యత్నించినట్లు ప్రధానంగా ఆరోపణలు చేస్తోంది. ఈ ఆరోపణల్లో అమెరికా ఇన్వెస్టర్ల నిధులు కూడా ఉండటంతో ఆ దేశం దర్యాప్తు ప్రారంభించింది. ముఖ్యంగా రెండు అంశాలకు సంబంధించినవి. 2 బిలియన్ డాలర్ల విలువైన రెండు సిండికేట్ రుణాలకు సంబంధించిన అంశం వీటిల్లో ఒకటి. ఇక అంతర్జాతీయ ఫైనాన్షియల్ సంస్థలు ఇచ్చిన భరోసాను చూపి అమెరికా, ఇతర ప్రదేశాల్లోని మదుపర్లకు ఆఫర్ చేసిన 1 బిలియన్ డాలర్ల విలువైన బాండ్లకు సంబంధించినది రెండో ఆరోపణ.

అదానీ స్కామ్‌లో జగన్ సర్కారు పేరు..?

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో జరిగిన ఒప్పందం స్కామ్‌లో జగన్ సర్కారు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు 228 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1750కోట్లు) లంచాలను పుచ్చుకొన్నట్లు బ్రూక్లిన్ కోర్టులో చేసిన ఆరోపణల్లో ఉంది. ఈ స్కామ్ మొత్తం 2019-24 మధ్య చోటు చేసుకోగా.. ఆ సమయంలో జగన్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అభియోగాల ప్రకారం.. 2021లో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. నాడు విద్యుత్తు సరఫరా ఒప్పందంపై చర్చలు జరిగాయి. అదే సమయంలో 7,000 మెగావాట్‌ల కొనుగోలు డీల్ కుదరడానికి 'అవసరమైన ప్రతిపాదనలు' ముందుకొచ్చినట్లు ఆరోపణల్లో పేర్కొన్నారు. 2019-24 మధ్య పనిచేసిన ఓ అత్యున్నత స్థాయి వ్యక్తి హస్తం ఉన్నట్లు ఈ అభియోగాల్లో ప్రస్తావించారు.

భారీగా విలువ కోల్పోయిన షేర్లు..

అదానీ గ్రూప్‌లోని పలు కంపెనీల షేర్లు భారీగా పతనం అయ్యాయి. ఏసీసీ 10%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 20%, అదానీ ఎంటర్ ప్రైజెస్ 20%, అదానీ గ్రీన్ ఎనర్జీ 18%, అదానీ పోర్ట్స్ 15%, అదానీ పవర్ 14%, అదానీ టోటల్ గ్యాస్ 15%, అదానీ విల్మార్ 10%, అదానీ సిమెంట్స్ 12% నష్టపోయాయి. మొత్తంగా గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ రూ.14.28 లక్షల కోట్ల నుంచి 12.42 లక్షల కోట్లకు పడిపోయినట్లు ఫార్చ్యూన్ కథనంలో పేర్కొంది. ఈ గ్రూపులో పెట్టుబడిదారు అయిన అమెరికాకు చెందిన జీక్యూజీ పార్టనర్స్ షేర్లు కూడా 25% కుంగినట్లు సీఎన్‌బీసీ పేర్కొంది.

అదానీ గ్రీన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ ఫైలింగ్..

తాజాగా అదానీ గ్రూప్ అమెరికా డాలర్ డినామినేటెడ్ బాండ్ ఆఫరింగ్‌లో ముందుకువెళ్లకూడదని నిర్ణయించుకొంది. ఈ విషయాన్ని గురువారం స్టాక్ మార్కెట్‌కు అందజేసిన ఫైలింగ్‌లో పేర్కొంది. 'అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్, ఎస్ఈసీలు గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా మా బోర్డు సభ్యులపై నేరాభియోగాలు మోపాయి. దీంతో ప్రతిపాదిత డాలర్ డినామినేషన్ బాండ్ల విషయంలో ముందుకువెళ్లకూడదని మా అనుబంధ సంస్థ నిర్ణయించింది" అని పేర్కొంది. ఈ ఆఫర్ విలువ 600 మిలియన్ డాలర్లు.

అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ స్పందన..

జస్టిస్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ అసిస్టెంట్ అటార్నీ లీసా హెచ్ మిల్లర్ స్పందిస్తూ తమ దర్యాప్తు దూకుడుగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఏమూలైనా అమెరికా చట్టాలను ఉల్లంఘించినా సహించబోమని వెల్లడించారు. ఇప్పటివరకు ఎఫ్‌బీఐ న్యూయార్క్ కార్పొరేట్, సెక్యూరిటీస్ అండ్ కమొడిటీస్ ఫ్రాడ్ అండ్ ఇంటర్నేషనల్ కరప్షన్ యూనిట్స్ దీన్ని దర్యాప్తు చేశాయి.

ఈ డీల్ కోసం ది బిగ్ మ్యాన్, న్యూమెరో యునో పేర్లతో గౌతమ్ అదానీని సంబోధించినట్లు పేర్కొంది.

ఏ చట్టాన్ని ఉల్లంఘించింది..?

ఈ వ్యవహారంలో అమెరికాలోని ఫారెన్ కరప్ట్ ప్రాక్టిసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) ఉల్లంఘన జరిగినట్లు అక్కడి ఏజెన్సీలు చెబుతున్నాయి. అమెరికా కంపెనీలు, వ్యక్తులు విదేశాల్లో అవినీతి పనుల్లో భాగం కాకుండా చూడటమే దీని లక్ష్యం. దీని ఉల్లంఘన అక్కడ తీవ్రమైన నేరం కింద పరిగణిస్తారు. ఈ ఆరోపణలపై అదానీ గ్రూప్ ప్రతినిధి స్పందిస్తూ త్వరలోనే తాము ఓ ప్రకటన జారీ చేస్తామని వెల్లడించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది.

ట్రంప్ కార్యవర్గం ఎలా స్పందిస్తుందో..

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన అనంతరం గౌతమ్ అదానీ శుభాకాంక్షలు చెప్పారు. తాను అమెరికాలో 10 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టి.. 15,000 ఉద్యోగాలు సృష్టిస్తానని అందులో పేర్కొన్నారు. మరోవైపు తాజాగా ఈ కేసుకు ఆదేశాలు జారీ చేసిన ప్రాసిక్యూటర్ బ్రియాన్ పీస్‌ను బైడెన్ కార్యవర్గం నియమించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ అధికారంలోకి రాగానే పీస్ పదవి నుంచి దిగిపోవచ్చని భావిస్తున్నారు. తాజాగా పరిణామాలపై శ్వేతసౌధం కానీ, ట్రంప్ ట్రాన్సిషన్ టీమ్ కానీ స్పందించలేదు.

# సందేశాలను మాయం చేయడమే గూగుల్ వ్యూహం..

అంతర్గత కమ్యూనికేషన్‌లో భాగంగా పంపిన కొన్ని రకాల సందేశాలను డిలీట్ చేసేయాలని టెక్ దిగ్గజం గూగుల్ ) తన ఉద్యోగులకు కొన్నేళ్లుగా చెబుతోంది. అంతేకాదు.. కొన్ని రకాల పదాలను వినియోగించడం మానివేయాలని సూచించింది. కంపెనీపై యాంటీ ట్రస్ట్ కేసులు రాకుండా ఈ చర్యలను తీసుకొంది. కానీ, దీనిపై న్యాయస్థానాల్లో అభ్యంతరాలు రావడంతో తన విధానాలను మార్చుకొంది.




తన ప్రత్యర్థిగా యాహూ ఉన్న రోజుల్లో ఓ యాంటీ ట్రస్ట్ దర్యాప్తును ఎదుర్కొంది. దీంతో 2008 నుంచి గూగుల్ తన ఉద్యోగులకు ఇలాంటి మెమోలను పంపి అప్రమత్తం చేయడం మొదలుపెట్టినట్లు న్యూయార్క్ టైమ్స్ కథనంలో వెల్లడించింది. "ఊహాగానాలు, వెక్కిరింతలకు ఉద్యోగులు దూరంగా ఉండాలి. హాట్‌టాపిక్స్ అయిన సందేశాలు ఒకరి నుంచి మరొకరికి పంపే సమయంలో ఒకటికి, రెండుసార్లు ఆలోచించుకోవాలి. అంతేకాదు.. వాస్తవాలు తెలియకుండా ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదు" అని మెమోలో పేర్కొంది.

అదే సమయంలో గూగుల్ తన ఇన్‌స్టెంట్ మెసేజింగ్ యాప్ టెక్నాలజీని కూడా మార్చింది. దీనిలో కొన్నిరకాల పదాలను మర్నాటికల్లా తొలగించేటట్లు ఏర్పాట్లు చేసింది. అంతేకాదు.. వీటిపై అటార్నీ-క్లైంట్ ప్రివిలైజ్డ్ అని ఉంచమని ఉద్యోగులను ప్రోత్సహించింది. అప్పుడు దానిని రహస్య సమాచారంగా భావించి.. బహిర్గతం చేయరు. గతేడాది గూగుల్ మొత్తం మూడు యాంటీట్రస్ట్ కేసులను ఎదుర్కొంది.

# షారుక్ ఖాన్ తనయుడి ఎంట్రీపై కంగనా రనౌత్ ప్రశంసలు



ముంబయి: బాలీవుడ్ స్టార్ హీరో షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ రైటర్, దర్శకుడిగా ఎంట్రీ ఇస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై నటి కంగనా రనౌత్ స్పందించారు. ఆర్యన్ ఖాన్ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. మిగిలిన స్టార్ కిడ్స్‌లా నటనలోకి అడుగుపెట్టకుండా.. కెమెరా వెనక నిలబడి మెగాఫోన్ పట్టుకోవడం ప్రశంసించాల్సిన విషయం అన్నారు.

"సినిమా కుటుంబాలకు చెందిన పిల్లలు మేకప్ వేసుకోవడం, బరువు తగ్గడం, తమని తాము గాజుబొమ్మల్లా భావించడం.. నటీనటులుగా మారడం సాధారణంగా చూస్తుంటాం. దానిని మించి వెళ్లాలనుకోవడం నిజంగా గొప్ప విషయం. భారతీయ చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచడం కోసం సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఇప్పుడెంతో ఉంది. స్టార్ కుటుంబాలకు చెందినవారు సులభమైన మార్గాన్ని ఎంచుకొని నటనలోకి వస్తుంటారు. అలాకాకుండా, కెమెరా వెనక నిలబడటానికి మనకెంతో మంది కావాలి. తక్కువమంది మాత్రమే ఆసక్తి కనబరిచే మార్గాన్ని ఆర్యన్ ఎంచుకున్నారు. రైటర్, దర్శకుడిగా అతడి తొలి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు.

ఆర్యన్ ఎంట్రీకి సంబంధించి ఎంతోకాలం నుంచి వార్తలు వస్తున్నాయి. దీనిపై షారుక్ కూడా పలు సందర్భాల్లో స్పందించారు. ఆర్యన్‌కు రైటింగ్‌పై ఎంతో ఆసక్తి ఉందని చెప్పారు. తన కుమారుడు రాసిన కథలను తాను అప్పుడప్పుడూ చదువుతుంటానని అన్నారు. ఈనేపథ్యంలోనే మంగళవారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఆర్యన్ తొలి ప్రాజెక్ట్ గురించి అనౌన్స్ చేసింది. "బాలీవుడ్‌లో ఇప్పటివరకూ చూడని సరికొత్త వెబ్‌సిరీస్‌ను మీకు అందించబోతున్నాం. 2025లో ఈ సిరీస్ విడుదలవుతుంది" అని తెలిపింది. 'నెట్‌ఫ్లిక్స్' 'రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్' సంస్థలు సంయుక్తంగా ఈ వెబ్‌సిరీస్‌ను రూపొందించనున్నాయి. తనయుడి ఎంట్రీపై షారుక్ కూడా ఆనందం వ్యక్తంచేస్తూ పోస్ట్ పెట్టారు. నెట్‌ఫ్లిక్స్ టీమ్‌తో కలిసి వర్క్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యన్ రాసిన ఉద్వేగభరితమైన కథ తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. బాలీవుడ్ నటీమణులు అలియాభట్, అనన్యపాండే, తదితరులు ఆల్‌ది బెస్ట్ చెప్పారు.

చిత్ర పరిశ్రమ నేపథ్యంగా ఈ సిరీస్‌ని రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. సినీ నేపథ్యం లేని వ్యక్తి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం వంటి విషయాలను ఇందులో చూపించనున్నారని టాక్. దీనికి 'స్టార్ డమ్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

# నాకోసం ఎవరూ మాట్లాడరు కదా




వరుస సినిమాలతో జోరు కొనసాగిస్తున్న యువ కథానాయకుడు విష్వక్‌సేన్. ఈ ఏడాదిలో ఇప్పటికే 'గామి', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాలతో ప్రేక్షకుల్ని పలకరించారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన మరో చిత్రం 'మెకానిక్ రాకీ' ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించిన చిత్రమిది. 'మెకానిక్ రాకీ' ప్రయాణం, తన కెరీర్ గురించి విష్వక్‌సేన్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"వేదికలపై ఏదో ఒకటి మాట్లాడి అందరి దృష్టిని ఆకర్షించాలనే ఆలోచన నాకు ఉండదు. ఒకొక్కసారి అలా మాట్లాడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. అంతే కానీ, అలా మాట్లాడితేనే నా సినిమాకి ఎక్కువ ప్రారంభ వసూళ్లు వస్తాయనే భ్రమలో మాత్రం ఉండను. 'గామి' సినిమాకి రూ.10 కోట్లు ప్రారంభ వసూళ్లు వచ్చాయి. ఆ సినిమాకి ముందు నేనేమీ మాట్లాడలేదే. ఏదైనా మాట్లాడాల్సిన అవసరం వస్తే నేనే మాట్లాడాలి. ఇక్కడ నాకోసం ఎవ్వరూ మాట్లాడలేరు కదా".

'మెకానిక్ రాకీ' పక్కా కమర్షియల్ సినిమా అనుకోవచ్చా?

నా దృష్టిలో... ఏ సినిమాని ఎక్కువమంది చూస్తే అది కమర్షియల్ సినిమా. ఈ ట్రైలర్ చూసినప్పుడు మనం తరచూ చూసే కమర్షియల్ సినిమాలా అనిపిస్తుంది కానీ, థియేటర్లో సినిమాని చూస్తున్నప్పుడు మాత్రం తప్పుగా అర్థం చేసుకున్నామే అనుకుంటారు. కమర్షియల్ ఫార్మాట్‌కి కొత్త అర్థం చెబుతూ, ఇదొక పాత్ బ్రేకింగ్ సినిమాగా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది.

ఇందులో అంత ప్రత్యేకమైన అంశాలు ఏమున్నాయి?

నాలుగైదేళ్లుగా జరుగుతున్న ఓ అంశాన్ని ఇందులో స్పృశించాం. నిజ జీవిత సంఘటనలతో రూపొందించిన చిత్రమిది. కథ విన్నప్పుడు ఇన్నాళ్లూ ఈ అంశాన్ని ఎవ్వరూ తెరపైకి తీసుకు రాలేదేమిటా అనిపించింది. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి', 'మెకానిక్ రాకీ' సినిమాల్ని సమాంతరంగా చేశాం. ఈ ప్రయాణంలో మేం అనుకున్న అంశంతో వేరెవరైనా సినిమా తీస్తారో ఏమో అనే భయం వెంటాడేది. కానీ ఎవ్వరూ ఈ కథాంశంతో సినిమా చేయలేదు. మనందరం ఈ విషయానికి బాధితులమే కదా అనే భావనకి గురిచేసే కథ ఇందులో ఉంది. 60 శాతం కామెడీ, ఎవ్వరూ ఊహించని స్క్రీన్‌ప్లే... ఇలా చాలా ప్రత్యేకతలు ఉన్న సినిమా ఇది. మొత్తంగా చిన్న రిపేర్ అయితే చేశాం. ఆ రిపేర్ ఏమిటో థియేటర్లో చూసి ఆశ్చర్యపోతారు.

కథల ఎంపికలో మీ ఆలోచనలు ఎలా ఉంటాయి? కొత్త దర్శకులతోనే ప్రయాణం సౌలభ్యంగా ఉంటుందా?

సినిమాని ఎవరు బాగా తీస్తారనేదానికంటే, ఎవ్వరు తీయలేరో పసిగడతా. రవితేజ కథ చెప్పిన విధానం, తన రచనా శైలి, స్క్రీన్‌ప్లే చూశాక రెండో ఆలోచన లేకుండా తనతో సినిమా చేశా. కొత్త దర్శకులా, సీనియర్లా అనేది ఎప్పుడూ పట్టించుకోను. కాకపోతే నన్ను ఎంపిక చేసుకునే దర్శకులకే నా తొలి ప్రాధాన్యం. నన్ను దర్శకత్వం చేసేవాళ్లకి నేను రజనీకాంత్ అయ్యుండాలి కదా (నవ్వుతూ). దర్శకుల పనిలో విష్వక్‌సేన్ ఎప్పుడూ వేలు పెట్టడు. నేను వేలు పెట్టే అవసరం లేని సినిమాలే ఒప్పుకుంటాం. వేలు పెట్టాల్సిన అవసరమే వస్తే, నేనే రంగంలోకి దిగి దర్శకత్వం చేస్తా కానీ, వేరొకరి ఆలోచనల్ని నేనెప్పుడూ ప్రభావితం చేయను. కాకపోతే ఎవ్వరైనా సినిమాకి ముందు దర్శకుడు, నిర్మాత, ఛాయాగ్రాహకుడు, ఎడిటర్, హీరో, సంగీత దర్శకుడు కూర్చుని... ఈ సినిమా ఎలా చేస్తే బాగుంటుందో ఒకరికొకరు ఆలోచనల్ని పంచుకుని ఓ నిర్ణయానికొస్తుంటాం. అదే నేనూ చేస్తుంటాను.

ఈ ఏడాది మూడు సినిమాలతో మీ ప్రయాణం టాప్ గేర్‌లో సాగుతోంది...

వచ్చే ఏడాదిలో నాలుగు సినిమాలు వస్తాయి 'లైలా' 60 శాతం పూర్తయింది. జనవరిలో అనుదీప్ దర్శకత్వంలో సినిమాతోపాటు, శ్రీధర్ గంటా – సుధాకర్ చెరుకూరి కలయికలో సినిమా మొదలవుతుంది. మార్చిలో మరో సినిమా మొదలవుతుంది. 'ఏమైంది ఈ నగరానికి 2' స్క్రిప్ట్ పనులు కూడా జరుగుతున్నాయి. సాగర్ కె.చంద్ర దర్శకత్వంలోనూ ఓ సినిమా ప్రణాళికలో ఉంది.

సునీల్, నరేశ్, మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్... చాలామంది నటులే కనిపిస్తున్నారు....

ఇది హీరో నడిపే కథ కాదు. అన్ని పాత్రలకీ సమాన ప్రాధాన్యం ఉంటుంది. సునీల్, రఘు పాత్రలు వ్యతిరేక ఛాయలతో కనిపిస్తాయి. సునీల్, నరేశ్‌లతో కలిసి నటించే సినిమాలు గుర్తుండిపోయేలా ఉండాలనేది నా ఆలోచన. ఇదివరకు చాలాసార్లు వాళ్లతో కలిసి నటించే అవకాశం వచ్చింది. కానీ ఆయా సినిమాల్లో వాళ్లకోసం డిజైన్ చేసిన పాత్రల గురించి చెప్పినప్పుడు... ఇంత చిన్న పాత్రలైతే వద్దని దర్శకులతో చెప్పేవాణ్ని. ఈ సినిమాలో బలమైన పాత్రలు కుదిరాయి. నిజంగా వాళ్లతో నటించడం నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. జేక్స్ బిజోయ్ సంగీతం మరో స్థాయిలో ఉంటుంది. సినిమా చూశాక ప్రతి జిల్లా కేంద్రంలో ఓ ప్రీమియర్ షో వేయాలని నిర్ణయించాం.

# అవకాశమిస్తే దర్శకత్వం మానేసి.. కథలు రాసుకుంటా: ప్రశాంత్ వర్మ



'హనుమాన్' సినిమాతో ఇంటర్నేషనల్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్నారు యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ. ఈ టాలెంటెడ్ దర్శకుడి నుంచి సినిమా వస్తుందంటే అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యంగ్ హీరోలతో మూవీస్ చేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ప్రశాంత్ వర్మ తాజాగా చేసిన కామెంట్స్ అందరినీ ఆకర్షిస్తున్నాయి. 'దేవకీ నందన వాసుదేవ' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రశాంత్.. తాను దర్శకుడు కాకముందే 33 కథలు రాసుకున్నట్లు వెల్లడించారు వాటిలో ఒక కథ యాంకర్ సుమ కుమారుడి కోసం చెప్పినట్లు తెలిపారు.

"నేను ఇండస్ట్రీలోకి రాకముందే 33 కథలు రాసుకున్నాను. ఇప్పటివరకు తీసిన సినిమాలకు, వాటికి సంబంధం లేదు. ఇవి కొత్తవి. నాకు కథలు రాయడం చాలా ఇష్టం. అవకాశమిస్తే దర్శకత్వం మానేసి వేరే దర్శకుల కోసం కథలు రాయడానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తాను. అవసరమైతే బోయపాటి శ్రీను గారికి కూడా కథలు కావాలంటే ఇస్తాను" అని చెప్పారు. ఈ కామెంట్స్‌పై బోయపాటి మాట్లాడుతూ.. 'తాను రాసుకున్న కథలు వేరే దర్శకులకు ఇవ్వాలంటే మంచి మనసు ఉండాలి. ప్రశాంత్‌వర్మ మనసున్న వ్యక్తి. ఆయనెప్పుడూ బాగుండాలి' అని అన్నారు.

ఇక ప్రశాంత్ వర్మ దగ్గర 33 కథలు ఉన్నాయని చెప్పడంతో ఇండస్ట్రీలో చర్చ మొదలైంది. భవిష్యత్తులో వరుసగా సినిమాలు తీస్తారంటూ సినీప్రియులు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా కొన్ని చిత్రాలు ప్రకటించారు. అలాగే మోక్షజ్ఞ ను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నారు. ఇక తన సినిమాటిక్ యూనివర్స్‌కు సంబంధించి ఇప్పటికిప్పుడు 20 స్క్రిప్ట్‌లు సిద్ధమవుతున్నాయని.. తొలి ఫేజ్‌లో ఆరుగురు సూపర్ హీరోల సినిమాలు తీస్తామని గతంలో ప్రశాంత్ వర్మ వివరించారు. ఏడాదికి ఒక సినిమా కచ్చితంగా విడుదల చేస్తానని ఆయన చెప్పారు. ఇప్పుడు ఈ కథల గురించి చెప్పడంతో అందరిలోను ఆసక్తి నెలకొంది. ఇక 'దేవకీ నందన వాసుదేవ'కు కూడా ప్రశాంత్ వర్మ కథను అందించారు. ఈ చిత్రం నవంబర్ 22న ప్రేక్షకుల ముందుకురానుంది.

# రామ్ పోతినేని సరసన భాగ్యశ్రీ బోర్సే..



'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' దర్శకుడు మహేశ్ దర్శకత్వంలో యంగ్ హీరో రామ్ పోతినేని ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. పేరుతో ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సేను ( ఎంపిక చేసినట్లు పోస్ట్ పెట్టింది. రీసెంట్ సెన్సేషన్ భాగ్యశ్రీ ఈ ప్రాజెక్ట్‌లో జాయిన్ కావడంతో ఈ సినిమాకు మరింత అందం వచ్చింది అని పేర్కొంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను రేపు వెల్లడించనున్నారు. రేపు పూజా కార్యక్రమంతో దీన్ని ప్రారంభించనున్నారు.

రామ్ 22వ సినిమాగా రానున్న దీని రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. హై ఎనర్జీతో న్యూ ఏజ్ స్టోరీగా ఇది రానుంది. మైత్రీ మూవీస్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్‌లు దీన్ని నిర్మిస్తున్నారు.

# తల్లిదండ్రుల విడాకులపై స్పందించిన ఏఆర్ రెహమాన్ పిల్లలు



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, ఆయన భార్య సైరా బాను విడాకులు తీసుకున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిద్దరూ అధికారికంగా వారి వివాహబంధానికి స్వస్తి పలికారు. ఈ మేరకు భావోద్వేగపూరిత ఒత్తిడి కారణంగా విడిపోతున్నట్లు వారి న్యాయవాది ప్రకటించారు ఇక ఈ విషయంపై వారి పిల్లలు రహీమా, ఖతీజా, అమీన్ స్పందిస్తూ పోస్ట్‌లు పెట్టారు. 'మా తల్లిదండ్రుల విడాకుల విషయంలో గోప్యత పాటిస్తూ.. గౌరవంగా వ్యవహరించినందుకు మీ అందరికీ ధన్యవాదాలు' అంటూ రహీమా పోస్ట్ పెట్టారు. 'ఈ సమయంలో మా కుటుంబ గోప్యతను గౌరవించాలని మేము ప్రతిఒక్కరినీ వేడుకుంటున్నాం. మమ్మల్ని అర్థం చేసుకున్నందుకు కృతజ్ఞతలు' అని ఖతీజా, అమీన్‌లు పేర్కొన్నారు.

ఏఆర్ రెహమాన్, సైరా బాను 1995లో పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. 29 ఏళ్ల తర్వాత వీరు విడిపోతున్నట్లు ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. విడాకులపై ఏఆర్ రెహమాన్ స్పందిస్తూ.. 'మా వైవాహిక బంధం త్వరలోనే 30 ఏళ్లకు చేరుతుందని సంతోషించాం. అయితే అనుకోనివిధంగా ముగింపు పలకాల్సి వచ్చింది. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో స్నేహితులు మా వ్యక్తిగత గోప్యతను అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం" అని ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పంచుకున్నారు.

# ఎనిమిదేళ్ల ముందే మోకీళ్ల నొప్పి గుర్తింపు

మోకాలి కీళ్లు క్షీణించటాన్ని గుర్తించటానికి ఎక్స్‌రే తీస్తుంటారు. ఇందులో మార్పులు కనిపించేసరికే ఎంతోకొంత సమస్య ముదిరిపోయి ఉంటుంది. మరి దీన్ని ముందుగా గుర్తించగలిగితే? అదీ కేవలం రక్త పరీక్షతోనే సాధ్యమైతే? డ్యూక్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు అదే సాధించారు. ఎక్స్‌రేలో మోకీళ్ల క్షీణత సంకేతాలు కనిపించటానికి కనీసం ఎనిమిదేళ్ల ముందుగానే సమస్యను పసిగట్టే రక్త పరీక్షను రూపొందించారు. ఎముక క్షీణత జీవ సూచికల ఆధారంగా ఇది సమస్యను కచ్చితంగా గుర్తిస్తున్నట్టు రుజువైంది కూడా. దీని సాయంతో జబ్బు తలెత్తటాన్నే కాదు.. పురోగతినీ తెలుసుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. మోకాలి కీళ్లు అరగటం తరచూ చూసేదే. నొప్పి, వాపు వంటి లక్షణాలను తగ్గించుకోవటం తప్పించి ప్రస్తుతానికి దీన్ని నయం చేసే చికిత్సలేవీ లేవు. సమస్యను తొలిదశలోనే గుర్తిస్తే ముదరకుండా చూసే చికిత్సలను రూపొందించొచ్చు. ఈ దిశగా కొత్త పరీక్ష ఆశలు రేపుతోంది. దీని ద్వారా గుర్తించే జీవ సూచికలను జబ్బు నిర్ధరణతో పాటు పరిశోధనలకూ ఉపయోగించుకోవచ్చు. ఇది సమర్థమైన మందుల తయారీకి దారి చూపగలదు. ఈ పరీక్ష మోకీళ్ల



అరుగుదలను 74% వరకూ అంచనా వేస్తున్నట్టు, 85% వరకూ నిర్ధరిస్తున్నట్టు ఇంతకుముందే తేలింది. తాజా అధ్యయనంతో దీని అంచనా సామర్థ్యాలు మరింత కచ్చితంగా రుజువయ్యాయి.

# పెరుగుతో హుషారు



పెరుగు పేగులకే కాదు.. మూడ్‌కూ మంచిదే. దీనిలోని ల్యాక్టోబాసిలస్ బ్యాక్టీరియా శరీరం ఒత్తిడిని ఎదుర్కోవటానికి.. కుంగుబాటు, ఆందోళన నివారణకు తోడ్పడుతున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా ఎలుకల్లో కుంగుబాటును వెనక్కి మళ్లిస్తున్నట్టు ఇంతకుముందు బయటపడింది. అయితే దీనికి కారణమేంటన్నది తెలియరాలేదు. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనాన్ని చేపట్టారు. రోగనిరోధక వ్యవస్థలో మధ్యవర్తిగా పనిచేసే ఇంటర్‌ఫెరాన్ గామా మోతాదులను ల్యాక్టోబాసిలస్ పర్యవేక్షిస్తున్నట్టు గుర్తించారు. ఇలా ఒత్తిడికి శరీరం స్పందించటాన్ని నియంత్రిస్తున్నట్టు.. కుంగుబాటు తగ్గటానికి తోడ్పడుతున్నట్టు కనుగొన్నారు. దీంతో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేసే ప్రొబయాటిక్స్ తయారీకి కొత్త సాధనాలు దొరికినట్టయ్యిందని భావిస్తున్నారు. మానసిక సమస్యలకు కొత్త చికిత్సల రూపకల్పనకిది దారితీయగలదని ఆశిస్తున్నారు.

# బరువు పెరగకుండా ఉండాలంటే ఏం చేయాలి..!

: ఉద్యోగులు చాలామంది ఆఫీస్‌లో దాదాపు పనిగంటలన్నీ కుర్చీల్లోనే గడిపేస్తుంటారు. లంచ్ బ్రేక్, టీ బ్రేక్ వంటి విరామాల్లో తప్ప ఎక్కువ సమయం కూర్చునే ఉంటారు. దీంతో బరువు పెరిగే సమస్యను ఎదుర్కొంటారు. శారీరక శ్రమ లేకుండా అధిక క్యాలరీలు తీసుకుంటే అది శరీరంలో కొవ్వు పేరుకుపోయేందుకు దారి తీస్తుంది. ఊబకాయం సహా పలు అనారోగ్యాలకు దారితీస్తుంది. అయితే మనం తీసుకునే ఆహారంతో పాటు జీవనశైలి మార్పులతో అధిక బరువు దరిచేరకుండా నిరోధించవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.



ఆఫీస్ నుంచి పనిచేస్తూనే ఫిట్‌నెస్ సాధించేందుకు ఏం చేయాలనే విషయంలో ప్రముఖ న్యూట్రిషనిస్ట్ రుజుత దివేకర్ తన ఇన్‌స్టాగ్రాం ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశారు. ముఖ్యంగా ఆఫీస్‌కు వచ్చే ముందు ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలని దీంతో ఆకలితో అధికంగా చక్కెరతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోకుండా ఉండే వీలుంది. ఇక ఉదయాన్నే ఛాయ్, కాఫీ, సిగరెట్లు వంటివి తీసుకోరాదని బదులుగా కొబ్బరి నీరు, షెర్బత్, పండ్లు తీసుకుంటే మేలని ఆమె సూచించారు.

# నోరు మంచిదైతేనే..

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందంటారు. ఆరోగ్యం కూడా మంచిదవుతుంది! నోటి ఆరోగ్యానికీ గుండెజబ్బు, మధుమేహం వంటి



సమస్యలకూ సంబంధం ఉంటోంది మరి. అంటే నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవటం ఇలాంటి జబ్బుల నివారణకూ తోడ్పడుతుందన్నమాట. వయసు మీద పడ్డవారికిది మరింత ముఖ్యం.

గుండెజబ్బు వంటి సమస్యల ముప్పు కారకాలన్నీ మన చేతిలో ఉండవు. ఉదాహరణకు- వయసు. ఇది మీద పడకుండా ఆపలేం. అదృష్టం కొద్దీ ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి వైద్య సంరక్షణతో ఇలాంటి ముప్పులను చాలావరకు తగ్గించుకునే అవకాశముంది. వీటిల్లో అత్యంత ముఖ్యమైంది నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవటం. అయితే వయసు మీద పడినవారిలో చాలామందికిది పెద్ద సమస్యగానే నిలుస్తోంది. ఇంతకీ నోటిని శుభ్రంగా ఉంచుకోవటమంటే? రోజుకు రెండు సార్లు (ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకోబోయే ముందు) మృదువైన పోచలతో కూడిన బ్రష్‌తో పళ్లు తోముకోవటం, ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్ వాడుకోవటం. దీంతో దంతాలు, చిగుళ్లు శుభ్రమవుతాయి. రోజూ పళ్ల మధ్య సన్నటి దారంతో శుభ్రం చేసుకోవటం, మౌత్‌వాష్‌తో పుక్కిలించటమూ ముఖ్యమే. వీటితో పళ్ల మధ్య చిక్కుకున్న పదార్థాలు తొలగిపోతాయి. అలాగే ప్రతి ఆరునెలలకు ఓసారి దంత వైద్యుడిని సంప్రదించటమూ తప్పనిసరి. అయితే అన్నిసార్లూ అందరికీ ఇది సాధ్యం కాకపోవచ్చు. వృద్ధులకైతే మరింత కష్టం. సొంతంగా ఆసుపత్రికి వెళ్లటం కుదరకపోవచ్చు. తోడుగా వచ్చేవారు లేకపోవచ్చు.

# పార్శ్వనొప్పి వేధిస్తోందా?

పార్శ్వనొప్పి (మైగ్రెయిన్) చాలా ఇబ్బంది పెడుతుంది. ఒక్క తలనొప్పితోనే కాదు, వికారంతోనూ వేధిస్తుంది. దీన్ని రకరకాల కారణాలు ప్రేరేపిస్తుంటాయి. కొన్ని జాగ్రత్తలతో పార్శ్వనొప్పి బాధలను తగ్గించుకోవచ్చు.



నిద్ర సరిగా..

నిద్ర చిత్రమైన ప్రేరకం. మరీ ఎక్కువైనా, తక్కువైనా పార్శ్వనొప్పి తలెత్తొచ్చు. కాబట్టి రోజూ తగినంత నిద్ర పోయేలా చూసుకోవాలి. నిద్ర వేళలను కచ్చితంగా పాటించాలి.

భోజనం మానొద్దు

రక్తంలో గ్లూకోజు మోతాదులు పడిపోతే ముందుగా ప్రభావితమయ్యేది మెదడే. తలనొప్పులకు ఆకలి ఓ ప్రధాన కారణం. అందువల్ల సమయానికి భోజనం చేయాలి. రోజంతా పనిచేయటానికి శరీరానికి అవసరమైన శక్తి లభించేలా చూసుకోవాలి.

కెఫీన్ ఆచితూచి

కాఫీలోని కెఫీన్ పార్శ్వనొప్పిని ప్రేరేపించొచ్చు, తగ్గించొచ్చు. ఇది నొప్పి మందుల సామర్థ్యాన్ని పెంచుతుంది కాబట్టి కొన్ని తలనొప్పి మందుల్లో కెఫీన్‌నూ కలుపుతుంటారు. అయితే మోతాదు ఎక్కువైతేనే సమస్య. అందువల్ల కెఫీన్ విషయంలో ఆచితూచి వ్యవహరించాలి.

వ్యాయామం కీలకమే

కొన్నిసార్లు ఎక్కువ శ్రమతోనూ పార్శ్వనొప్పి ప్రేరేపితం కావొచ్చు. కానీ క్రమం తప్పకుండా, ఒక మాదిరిగా వ్యాయామం చేస్తే మొత్తంగా ఆరోగ్యం ఇనుమడిస్తుంది. తలనొప్పినీ నివారించుకోవచ్చు. వ్యాయామాలను నెమ్మదిగా ఆరంభించి, క్రమంగా వేగం పెంచుకుంటూ రావటం ముఖ్యమని గుర్తుంచుకోవాలి.

ప్రేరకాలకు దూరంగా..

సాధారణంగా పెద్ద శబ్దాలు, ఘాటు వాసనలు, మిరుమిట్లు గొలిపే కాంతుల వంటివి పార్శ్వనొప్పిని ప్రేరేపిస్తుంటాయి. ఇలాంటి ప్రేరకాలకు దూరంగా ఉండాలి. అవేంటో తెలియకపోతే నోట్ పుస్తకంలో ఏం తింటున్నారు? ఎప్పుడు తింటున్నారు? ఎప్పుడు మందులు వేసు కుంటున్నారు? ఎలాంటి లక్షణాలు వస్తున్నాయో రాసుకోవాలి. వీటిని బట్టి తలనొప్పి ఎప్పుడెప్పుడు వస్తుందో, ఏవి ప్రేరేపిస్తున్నాయో తెలుసుకోవచ్చు.

నెలసరికి తగినట్టుగా

హార్మోన్లు మెదడు మీద చాలా ప్రభావం చూపుతాయి. మహిళల్లో నెలసరి సమయంలో పార్శ్వనొప్పి రావటం మామూలే. ఫలదీకరణ జరిగే సమయంలో, నెలసరి నిలిచిపోయే దశలోనూ తలనొప్పి రావొచ్చు. హార్మోన్ల మార్పులు జరిగే సమయంలో మందులు వెంట ఉంచుకోవటం మంచిది.

# దీర్ఘ జలుబు

కొవిడ్ ఇన్‌ఫెక్షన్ తగ్గినా కొందరికి దగ్గు, కడుపునొప్పి, విరేచనాల వంటివి విడవకుండా వేధించటం తెలిసిందే. నాలుగు వారాలకు పైగా ఇలాంటి లక్షణాలు కొనసాగుతూ రావటాన్ని లాంగ్ కొవిడ్‌గా పరిగణిస్తుంటారు. దీనికి ప్రత్యేక చికిత్సలూ అందించటం చూస్తున్నాం. లాంగ్ కొవిడ్‌కు ప్రధానంగా కొవిడ్-19 తీవ్రత కారణమవుతుంటుంది. అయితే ఒక్క కొవిడే కాదు.. జలుబు, ఇన్‌ఫ్లుయెంజా వంటి సమస్యలూ దీర్ఘకాలం ప్రభావం చూపొచ్చని తాజా అధ్యయనంలో బయటపడింది. దీన్ని లాంగ్ కోల్డ్‌గా భావిస్తున్నారు. పరిశోధకులు 10వేల మందిని ఎంచుకొని దీర్ఘ కొవిడ్‌తో ముడిపడిన 16 వేర్వేరు లక్షణాల గురించి ఆరా తీశారు. వాళ్లు కొవిడ్-19 ఇన్‌ఫెక్షన్‌తో బాధపడ్డారా? ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల బారినపడ్డారా? ఇవేవీ రాలేదా? అని ప్రశ్నించారు. ఈ సమస్యలేవీ రానివారితో పోలిస్తే కొవిడ్ బాధితుల్లోనూ, కొవిడ్ పరీక్ష నెగెటివ్‌గా ఉండి ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల బారినపడ్డవారిలోనూ దీర్ఘకాల ఇబ్బందులు ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. కాకపోతే లక్షణాల్లో కాస్త తేడా కనిపించింది. కొవిడ్ నుంచి కోలుకుంటున్నవారిలో రుచి, వాసన పోవటం, తల తేలిపోతున్నట్టు అనిపించటం, జుట్టు ఊడటం, అతిగా చెమట పోయటం, గుండె వేగం పెరగటం,



జ్ఞాపకశక్తి సమస్యలు మరింత ఎక్కువగా, తీవ్రంగా ఉంటున్నట్టు తేలింది. మొత్తమ్మీద కొవిడ్, కొవిడ్ రహిత ఇతర ఇన్‌ఫెక్షన్లూ వివిధ రకాల లక్షణాలకు కారణమవుతున్నట్టు గుర్తించారు. కొందరిలో ఇవి నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ వస్తున్నట్టు కనుగొన్నారు. నిజానికి జలుబు ఒకట్రెండు వారాల్లోనే తగ్గిపోతుంది. మరి దీని ఇబ్బందులు దీర్ఘకాలం కొనసాగటానికి కారణమేంటి? ఇన్‌ఫెక్షన్‌ను ఎదుర్కొనే క్రమంలో మన రోగనిరోధక వ్యవస్థ ప్రేరేపించిన వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) కారణం కావొచ్చని భావిస్తున్నారు. ఇన్‌ఫెక్షన్ తగ్గినా వాపు స్పందన అలాగే కొనసాగుతూ రావటం వల్ల దగ్గు, నిస్సత్తువ వంటివి ఎక్కువ కాలం వేధించే అవకాశముంది. వీటిపై అవగాహన లేకపోవటం వల్ల చాలామందిలో గుర్తించలేకపోతున్నారని పరిశోధకులు చెబుతున్నారు. దీర్ఘ కొవిడ్‌తో ముడిపడినవే కాదు, ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల దీర్ఘకాల ప్రభావాల మీదా తమ అధ్యయనం కొత్త విషయాలను వెలువరించిందని వివరిస్తున్నారు.

# కాలి సిరలు ఉబ్బితే?

కాలి సిరలు ఉబ్బితే (వెరికోజ్ వీన్స్) వాటిని తొలగించు కోవటం ఒక్కటే పరిష్కారం. స్కీరోథెరపీ, లేజర్ థెరపీ, అలాగే సర్జరీతో సిరలను మూసేయటం లేదా తీసేయటం వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే అదృష్టం కొద్దీ చాలామందికి ఇలాంటి చికిత్సల అవసరం ఉండదు. బిగుతు సాక్స్ ధరించటం వంటి చిట్కాలతోనూ మంచి ఫలితం కనిపిస్తుంది. ఈ సాక్స్ సిరలు ఉబ్బకుండా అదిమి పడతాయి. వీటిని రోజంతా ధరిస్తే నొప్పి, పొడుస్తున్నట్టు అనిపించటం, చిరచిర వంటి ఇబ్బందులు తగ్గుతాయి. ఒకప్పుడు వీటిని ధరించటం నామోషీగా భావించేవారు. ఇప్పుడు రకరకాల రంగుల్లో లభిస్తుండటంతో ఎంతోమంది ధరిస్తున్నారు. ఆకర్షణీయంగానూ కనిపిస్తున్నాయి.



పీచు, పొటాషియం, ఫ్లేవనాయిడ్లతో కూడిన ఆహారం తినటమూ మేలు చేస్తుంది. కూరగాయలు, పండ్లకు రంగును తెచ్చిపెట్టే ఫ్లేవనాయిడ్లు రక్తపోటు తగ్గటానికి తోడ్పడతాయి. ఇలా పరోక్షంగా సిరల ఉబ్బు తగ్గటానికీ దోహదం చేస్తాయి.

కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు కాళ్లు ఎత్తుగా ఉండేలా చూసుకోవటం మంచిది. గోడకు కాస్త దగ్గరగా వెల్లకిలా పడుకొని, కాళ్లను గోడకు ఆనించి పైకి లేపి, కాసేపు అలాగే ఉన్నా మేలే. గుండె కన్నా కాళ్లు ఎత్తుగా ఉన్నప్పుడు గురుత్వాకర్షణ ప్రభావంతో సిరలు రక్తాన్ని పైకి నెట్టటానికి వీలవుతుంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy